తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
# తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం..!!
అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నదీ విన్నదీ నలుగురితో పంచుకున్నదీ ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలవంతమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..
తెలుగు-వెలుగు
మీకో చక్కని వేదికగా నిలుస్తోంది.
ఎవరి ఒత్తిడి లేని విలేకరి వృత్తిని
చాటేందుకు సాదరంగా ఆహ్వానిస్తోంది.
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
97050 43131 | 8096660656

సంపుటి : 02 సంచిక 324 హైదరాబాద్ : సంపాదకులు : గున్నాల అనిల్‌రెడ్డి సోమవారం 3-3-2025 పేజీలు : 12 వేల : 5

Published from: Hyderabad, Rangareddy, Nizamabad, Adilabad, And Bhadradri Kothagudem, Vijayavada, Vishakapatnam, Kurnool, Anantapur



# కేటీఆర్‌కు అహంకారం.. కిషన్‌రెడ్డికి కుళ్లు

- ఆయన కన్నా జూనియర్‌గా ఉన్న నేను ఎదిగానని అసూయ
- రాష్ట్రానికి మంచి చేయాలని మోదీకి ఉన్నా.. కిషన్‌రెడ్డి సైంధవుడిలా అడ్డుపడుతున్నారు
- ఏదైనా వస్తే తన ఖాతాలో వేసుకుంటున్నారు - రాకపోతే రేవంత్ ఏం చేయలేదంటున్నారు
- ఎయిర్‌పోర్టు తెచ్చింది ఆయనే ఐతే.. మూసీ, ఆర్ఆర్ఆర్, మెట్రోలను అడ్డుకున్నదెవరు?

**వనపర్తి బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి - ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి, రేవంతన్న భరోసా పథకాలు ప్రారంభం**

**మహబూబ్‌నగర్, మార్చి 2:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై మరోసారి విమర్శలతో విరుచుకుపడ్డారు. కేంద్రం నుంచి నిధులు రాకుండా కిషన్‌రెడ్డి సైంధవ పాత్ర పోషిస్తున్నారని, నిత్యం అసూయతో రగిలిపోతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్‌కు అహంకారం ఉంటే.. కిషన్‌రెడ్డికి కుళ్లు ఉందని అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలో పర్యటించిన ముఖ్యమంత్రి రూ.879.80 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన ప్రజాపాలన బహిరంగ సభలో మాట్లాడారు. రాష్ట్రానికి నిధులిచ్చి మంచి చేయాలని ప్రధాని మోదీ చూస్తున్నా.. కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారని తెలిపారు. తాము కేంద్ర మంత్రుల వద్దకు, ప్రధాన మంత్రి వద్దకు పలుమార్లు వెళ్లి ఏదైనా సాధిస్తే.. కిషన్‌రెడ్డి తానే తెచ్చానంటూ ఖాతాలో వేసుకుంటున్నారని విమర్శించారు. వస్తే తన ఖాతాలోకి, రాకపోతే రేవంత్‌రెడ్డిఏమీ చేయడంలేదని ఆరోపించడం ఆయనకు అలవాటుగా మారిందన్నారు. "నేను కష్టపడి మామునూరు ఎయిర్‌పోర్టుకు అనుమతులు తెస్తే.. తానే తెచ్చానని కిషన్‌రెడ్డి చెప్పుకుంటున్నారు. అలా అయితే మూసీ ప్రక్షాళనకు, మెట్రో విస్తరణకు, ఆర్ఆర్ఆర్ ఉత్తర, దక్షిణ భాగాల పనులకు, పాలమూరు-రంగారెడ్డికి నీటి కేటాయింపులు, కాళేశ్వరానికి కేటాయింపులు, సమ్మక్క-సారక్క, సీతారామ సాగర్‌లకు నిధులు రాకుండా అడ్డుపడుతున్నది ఆయనేనని భావించాల్సి వస్తుంది" అని రేవంత్ అన్నారు. తాను కిషన్‌రెడ్డి ఒక సందర్భంలో కలిసి పనిచేశామని, ఆయన కంటే చిన్నవాడిని, జూనియర్‌ను అయిన తాను ఎదగడం ఓర్వలేక అసూయతో రగిలిపోతున్నారని ఆరోపించారు. తాను ఈ 14 నెలల కాలంలో 55,163 మందికి ఉద్యోగాలు ఇచ్చానని, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోదీ 12 ఏళ్లలో 24 కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణలో కేవలం కిషన్‌రెడ్డికి, బండి సంజయ్‌కు మాత్రమే ఉద్యోగాలు వచ్చాయన్నారు. వీరిద్దరు కేంద్రం నుంచి చిల్లిగవ్వ తేలేదన్నారు. హైదరాబాద్ అభివృద్ధిపై సమీక్ష కోసం కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ రాకుండా రెండుసార్లు కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారని, ఆయన వస్తే సమీక్షకు రాలేదన్నారు. ఈటల రాజేందర్ వచ్చి మేడ్చల్ వరకు మెట్రోను విస్తరించాలని కోరారని తెలిపారు. కేంద్రం దగ్గర ఉన్న సీబీఐ, ఈడీతో ఎంతకాలం బెదిరిస్తారని ప్రశ్నించారు. చావు ఒక్కసారే వస్తుందని వ్యాఖ్యానించారు. వచ్చే పార్లమెంట్ సమావేశాలకు ముందు కిషన్‌రెడ్డి సమీక్ష పెడితే తెలంగాణ ఎంపీలంతా వచ్చి ప్రతిపాదనలు ఇస్తారని, వాటి ప్రకారం నిధులు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. కృష్ణానదిలో 811 టీఎంసీల నీటిలో ఏపీకి 512 టీఎంసీల కేటాయింపును సమర్థిస్తూ కేసీఆర్ పెట్టిన సంతకం తెలంగాణకు యమపాశమైందని అన్నారు. ఆనాడు పోతిరెడ్డిపాడు పొక్క పెంచుకోవడానికి తండ్రి వైఎసఆర్‌కు, స్వరాష్ట్రం ఏర్పడ్డాక రాయలసీమ లిఫ్టుకు పునాది వేసి కొడుకు జగన్‌కు కేసీఆర్ సాయం చేశారని ఆరోపించారు. పదేళ్లలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేసిన కేసీఆర్.. కాంగ్రెస్ హయాంలో 32 కిమీలు పూర్తయిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను వదిలేశారని మండిపడ్డారు. రోజా ఇంటికి వెళ్లి రొయ్యల పులుసు తిని.. రాయలసీమను రతనాల సీమ చేస్తానని చెప్పి లిఫ్టుకు కర్త, కర్మ, క్రియగా మారారని ధ్వజమెత్తారు. పాలమూరు బిడ్డ సీఎం అయితే ఓర్వలేక ఏడాది కాకముందే దిగిపోవాలంటున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం చేస్తున్న, చేసిన పనులను బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు మనఃసాక్షితో చూడాలని సీఎం రేవంత్ అన్నారు. 25.50 లక్షల మందికి రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, కేసీఆర్ ఎగవేసిన రైతుబంధు సాయం రూ.7,627 కోట్లు ఇచ్చామని, కోతలు లేకుండా విద్యుత్తు అందిస్తున్నామని చెప్పారు. అలాగే 50 లక్షల మందికి 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు ఇస్తున్నామని వివరించారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీ సబ్‌ప్లాన్, బీసీ కార్పొరేషన్, ట్రైబల్ కార్పొరేషన్, మైనారిటీ కార్పొరేషన్‌లను పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా వివిధ కార్పొరేషన్ల కింద స్వయం ఉపాధి పథకాలకు రూ.6 వేల కోట్లు అందజేస్తామని చెప్పారు. కేటీఆర్, హరీశ్‌రావు సంస్కారహీనంగా మాట్లాడుతున్నారని, గడీని దాటి బయటకు రాలేని కేసీఆర్ వీరిద్దరితో మాట్లాడిస్తున్నారని భట్టివిక్రమార్క మండిపడ్డారు. రెండో విడత రైతు భరోసా మార్చి 31లోపు జమ చేస్తామని అన్నారు. కాగా, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పదేళ్లు నిర్లక్ష్యం చేసి.. అనుకోని ప్రమాదం జరిగితే బీఆర్ఎస్ నేతలు ఇంగితజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వనపర్తి అర్బన్: ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి, రేవంతన్న భరోసా పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 50మంది ముస్లింమహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ పథకం కింద రాష్ట్రంలో రూ.36.64 కోట్లతో 42 వేల 230 మందికి మైనారిటీ మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. వనపర్తి పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి తాను చదువుకునే రోజుల్లో అద్దెకు ఉన్న ఇంటికి వెళ్లారు. ఆ కుటుంబం ఎంతో ఆప్యాయంగా హారతులిచ్చి రేవంత్‌ను ఆహ్వానించింది. ఈ సందర్భంగా అప్పట్లో ఆ కుటుంబ సభ్యులతో తనకున్న అనుబంధాన్ని రేవంత్ గుర్తు చేసుకున్నారు. వారు చేసిపెట్టిన పూరీలు తింటూ వారితో సరదాగా గడిపారు. వారితో ఫొటోలు దిగారు. 'ఇది రక్త సంబంధం కాదు.. అంతకంటే ఎక్కువైన అనుబంధం. వనపర్తిలో విద్యాభ్యాసం చేస్తూ ఆనాడు అక్క ఇంట్లో ఆత్మీయతను ఆస్వాదిస్తూ పెరిగా. ఆ జ్ఞాపకాలను మోసుకుని ముఖ్యమంత్రిగా అక్క ఇంటికి వెళ్లా' అంటూ తన 'ఎక్స్' ఖాతాలో సీఎం రేవంత్ పోస్టు చేశారు. మరోవైపు వనపర్తిలో తనతో కలిసి చదువుకున్న స్నేహితులతోనూ రేవంత్ కొద్దిసేపు గడిపారు. గత స్మృతులను నెమరువేసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు.

## డూప్లికేట్ ఎపిక్ నంబర్లు ఉంటే..
# నకిలీ ఓటర్లు ఉన్నట్లు కాదు!

**వేర్వేరు రాష్ట్రాల్లో ఒకే విధమైన సంఖ్యలు కొన్ని ఉండొచ్చు.. మమత ఆరోపణలపై ఈసీ**

**ఇకపై యూనిక్ నంబర్లు ఇస్తామని వెల్లడి**



**న్యూఢిల్లీ, మార్చి 2:** బెంగాల్ ఓటర్ల జాబితాల్లో హరియాణా, గుజరాత్‌లకు చెందిన నకిలీ ఓటర్లను బీజేపీ చేర్చుతోందని.. ఇందుకు ఎన్నికల కమిషన్ (ఈసీ) సహకరిస్తోందని ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ చేసిన ఆరోపణలపై ఈసీ స్పందించింది. ఓటరు కార్డు(ఎపిక్) నంబర్లు ఒకేలా ఉన్నంత మాత్రాన నకిలీ లేదా డూప్లికేట్ ఓటర్లు ఉన్నట్లు కాదని ఆదివారం స్పష్టం చేసింది. మమత పేరు ప్రస్తావించకుండా.. రెండు రాష్ట్రాల ఓటర్లకు ఒకేరకమైన ఎపిక్ నంబర్లు ఉన్నాయంటూ మీడియాలో వచ్చిన కథనాలు, సోషల్ మీడియా పోస్టులను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపింది. 'కొందరు ఓటర్ల ఎపిక్ నంబర్లు ఒకే విధంగా ఉన్నా.. రాష్ట్రాలు, అసెంబ్లీ నియోజకవర్గాలు, పోలింగ్ కేంద్రాలు వేర్వేరుగా ఉంటాయి. ఎపిక్ నంబర్‌తో సంబంధం లేకుండా.. తమ సొంత రాష్ట్రం/కేంద్ర పాలిత ప్రాంతంలోని నియోజకవర్గంలో, పోలింగ్ కేంద్రంలో ఓట్లు నమోదుచేసుకున్న ఏ ఓటరైనా ఓటేయవచ్చు' అని తేల్చిచెప్పింది. ఈసీకి సంబంధించిన ఎలక్టొరల్ రోల్ మేనేజ్‌మెంట్ (ఎరోనెట్) ప్లాట్‌ఫాంకు ఓటర్ల సమాచారం పంపేముందు రెండు విభిన్న రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలు ఒకేవిధమైన అల్ఫాన్యూమరిక్ సిరీసను ఉపయోగించడం వల్ల తాజా సమస్య తలెత్తినట్లు గుర్తించింది. ఈ నేపథ్యంలో రిజిస్టర్డ్ ఓటర్లందరికీ ఇకపై యూనిక్ ఎపిక్ నంబర్లు కేటాయించాలని ఈసీ నిర్ణయించింది. ఈ ప్రక్రియకు సహకరించేందుకు ఎరోనెట్ 2.0 ప్లాట్‌ఫాంను ఆధునికీకరిస్తామని తెలిపింది. మమత ఆరోపణలను బెంగాల్ ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) కూడా తోసిపుచ్చారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం.. ఏ రాష్ట్రంలోనైనా ఎన్నికల జాబితాల నవీకరణలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు), రిటర్నింగ్ అధికారులు(ఈఆర్‌వోలు), సహాయ రిటర్నింగ్ అధికారులు(ఏఈఆర్‌వోలు), జిల్లా ఎన్నికల అధికారులు(డీఈవోలు), రాష్ట్రాల సీఈవోలు పాలుపంచుకుంటారని.. రాజకీయ పార్టీలు నియమించిన బూత్ స్థాయి ఏజెంట్లు క్రియాశీల పాత్ర పోషిస్తారని ఆదివారం ఓ ప్రకటనలో గుర్తుచేశారు. ఓటర్ల నమోదు, జాబితాలపై ఏవైనా అభ్యంతరాలుంటే వీరి ముందు ఉంచాలని.. వాటిపై తక్షణమే దృష్టి సారిస్తున్నామని.. దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. కాగా.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక.. అక్కడ 5 నెలల వ్యవధిలోనే 48 లక్షల మంది కొత్త ఓటర్లను చేర్చారని కాంగ్రెస్ ఆరోపణలు చేస్తోందని.. కానీ ఈ వ్యవహారంలో సీఈవో కార్యాలయానికి ఒక్క ఫిర్యాదు మాత్రమే చేసిందని ఈసీ వర్గాలు తెలిపాయి. మమత చెప్పిన మరో అబద్ధం బట్టబయలైందని బీజేపీ ఐటీ ఇన్‌చార్జి, బెంగాల్ బీజేపీ సహ ఇన్‌చార్జి అమిత్ మాలవీయ 'ఎక్స్'లో పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిపోవడంతో ఆమె దుష్ప్రచారానికి ఒడిగట్టారని, ఎన్నికల వ్యవస్థపై ఓటర్ల విశ్వాసాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారని ఆరోపించారు. బెంగాల్లో ఓటర్ల ప్రక్షాళన జరపాలని ఈసీని కోరారు. అక్రమ బంగ్లాదేశీయులను, రోహింగ్యాలను ఓటర్ల జాబితాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

## బీఎస్పీ నుంచి మాయావతి మేనల్లుడు ఔట్



**లఖ్‌నవూ, మార్చి 2:** బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) అధినేత్రి మాయావతి సంచలన ప్రకటన చేశారు. "తాను బతికున్నంత కాలం వారసులను ప్రకటించబోనని" ఆమె వెల్లడించారు. గతంలో తన రాజకీయ వారసుడిగా ప్రకటించిన మేనల్లుడు ఆకాశ్‌ను పార్టీలో అన్ని బాధ్యతల నుంచి తొలగించారు. అలాగే తన సోదరులు ఆనంద్ కుమార్, రామ్‌జీ గౌతమ్‌లను పార్టీ జాతీయ సమన్వయకర్తలుగా ఆమె నియమించారు. తాజాగా లఖ్‌నవూలో జరిగిన పార్టీ ఉన్నతస్థాయి సమావేశంలో మాయావతి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన కారణంగా ఆకాశ్ మామయ్య అశోక్ సిద్ధార్‌ను పార్టీ నుంచి బహిష్కరించానని ఆమె చెప్పారు. ఆయన ఆకాశ్‌ను కూడా ప్రభావితం చేస్తున్నారని, అందుకే ఆకాశ్‌ను అన్ని బాధ్యతల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు.

# యూపీఎస్‌ను రద్దు చేయకుంటే ఉద్యమమే

- ఏప్రిల్ 1న బ్లాక్ డే, మే 1న చలో ఢిల్లీ
- సెప్టెంబరు 1న సామూహిక సెలవులు
- సీపీఎస్ ఈయూ అధ్యక్షుడు స్థితప్రజ్ఞ




**హైదరాబాద్, కవాడిగూడ, మార్చి 2:** రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యూపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యూపీఎసను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 1న రాష్ట్రవ్యాప్తంగా బ్లాక్ డేగా పాటిస్తామని, ప్రతి జిల్లా నుంచి ప్రధానికి లేఖలు రాస్తామని, మే1న చలో ఢిల్లీ నిర్వహిస్తామని, సెప్టెంబరు 1న సామూహిక సెలవులు పెట్టి లక్ష కలాలతో కవాతు నిర్వహిస్తామని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో యూపీఎస్ వద్దంటూ 'యుద్ధభేరి' పేరుతో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం దశలవారీగా ఉద్యమాన్ని చేపట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. యూపీఎసను 2025 ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం జనవరి 24న విడుదల చేసిన గెజిట్‌లో పేర్కొన్నదని, దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తున్నట్లుగానే, తెలంగాణలోనూ రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ డిమాండ్ చేశారు.

## సెబీ మాజీ చీఫ్ మాధవి పురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయండి

**మరో ముగ్గురు సెబీ డైరెక్టర్లు, బీఎసఈ ఎండీ, సీఈఓపై కూడా..**

**30 రోజుల్లో కేసు స్థాయీ నివేదిక సమర్పించాలి**

**ఏసీబీకి ముంబైలోని ప్రత్యేక కోర్టు ఆదేశం**

**ముంబై, మార్చి 2:** పదవీ విరమణ పొందిన రోజు నుంచే సెబీ మాజీ చీఫ్ మాధవి పురి బుచ్‌కు కొత్త కష్టాలు మొదలయ్యాయి. స్టాక్ మార్కెట్ కుంభకోణానికి సంబంధించిన ఒక కేసులో ఆమెతోపాటు ప్రస్తుతం సెబీ డైరెక్టర్లుగా ఉన్న అశ్వని భాటియా, అనంత్ నారాయణ్ జి, కమలేష్ చంద్ర వర్షణిలపైనా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని ముంబై వర్లీ ప్రాంతంలోని ఏసీబీ ప్రత్యేక కోర్టు.. ఏసీబీని ఆదేశించింది. వీరితో పాటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బీఎసఈ) ఎండీ, సీఈఓ సుందరరామన్ రామమూర్తి, మాజీ చైర్మన్, పబ్లిక్ ఇంట్రెస్ట్ డైరెక్టర్ ప్రమోద్ అగర్వాల్‌పైనా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని ఆదేశించింది. న్యాయమూర్తి శశికాంత్ ఏకనాథ్‌రావు బంగర్ శనివారం ఈ ఆదేశాలు జారీ చేశారు. తమ పర్యవేక్షణలో జరిగే ఈ కేసు దర్యాప్తును నెల రోజుల్లో స్థాయి నివేదిక సమర్పించాలని కూడా ఆదేశించారు. సవన్ శ్రీవాస్తవ అనే జర్నలిస్టు చేసిన ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ న్యాయస్థానం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 1994లో ఒక కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా తన షేర్లను లిస్ట్ చేసి, ఆ తర్వాత పెద్దఎత్తున అక్రమంగా తన షేర్ల ధర పెంచుకుని మదుపరుల నెత్తిన టోపీ పెట్టిందని ఆయన ఆరోపించారు. దీనిపై సెబీకి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదంటూ ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు. 'ఈ కేసులో నిందితులు నిబంధనలు తుంగలో తొక్కి కుమ్మక్కయ్యారు.

# రంగస్థల కళాకారులకూ అవార్డులు

**భక్తరామదాసు కీర్తనలు మార్గదర్శకం: మల్లు భట్టివిక్రమార్క**



**బర్కత్‌పుర, మార్చి 2:** సినీ కళాకారుల మాదిరిగానే రంగస్థల కళాకారులకూ అవార్డులు ప్రదానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నాటక రంగ పోటీలను నిర్వహించి ఎంపిక చేసి ఈ అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. భక్తరామదాసుకు శ్రీరాముడిపై ఉన్న భక్తి, ఆయన పాడిన కీర్తనలు నేటి తరానికి మార్గదర్శకం అని పేర్కొన్నారు. సంగీత కళాకారులు రామదాసును స్ఫూర్తిగా తీసుకుని ప్రముఖ విద్వాంసులుగా పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు. ఆదివారం ఎల్‌బి ఇండోర్ స్టేడియంలో భక్తరామదాసు 392వ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా భక్తరామదాసు జయంతి వేడుకలను ప్రతియేటా అధికారికంగా నిర్వహించి సంగీత నాట్యకళాకారులను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. భక్తరామదాసు ఆలియాస్ కంచర్ల గోపన్న పుట్టి పెరిగిన జిల్లాలోనే తాను జన్మించడం ఆనందంగా ఉందని ఆయన చెప్పారు. మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. భక్తరామదాసు గొప్ప వ్యక్తి అని, ఎన్ని కష్టాలు ఎదురైన శ్రీరాముడిపై తనకు ఉన్న భక్తిని చాటిచెప్పి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

# కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు అవార్డులు

## చిన్నారులను ఆశీర్వదించిన దైవజ్ఞశర్మ.. కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు అవార్డులు

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:**
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కూచిపూడి నృత్య కళా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ఆదివారం అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. నగరంలోని బిర్లా భాస్కర ఆడిటోరియంలో కళాకర్ తెలుగు టీవీ, శివనంది అవార్డ్స్ 2025 ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ నృత్య పోటీలలో హైదర్ నగర్ లోని రుహాని కూచిపూడి నృత్య అకాడమీ నిర్వాహకురాలు నేరెళ్ల కల్పన ఆధ్వర్యంలో నిర్వహించిన బిందు మాధవి, భావనల తోపాటు పలువురు చిన్నారులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కూచిపూడి నృత్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు దైవజ్ఞ శర్మ అవార్డులు ప్రధానం చేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సంస్కృతిక కళలను భావితరాలకు అందించడానికి తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. మన సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలుగువారిపై ఉందన్నారు. చిన్న వయస్సులోనే అద్భుతమైన ప్రతిభ కనబరిచిన రుహానా కూచిపూడి నృత్య అకాడమీ బృందాన్ని ఆయన ఆశీర్వదించారు. కూచిపూడి నృత్యాన్ని ప్రోత్సహిస్తున్న రుహాన కూచిపూడి నృత్య అకాడమీ నిర్వాహకులను ఆయన అభినందించారు. చిన్నారులు తమ వయస్సుతో సంబంధం లేకుండా అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రదర్శించారనికొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాఖర్ తెలుగు టీవీ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



**ఆకట్టుకున్న బిందు మాధవి, భావన కూచిపూడినృత్యం:**
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కూచిపూడి నృత్య కళా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ఆదివారం అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. నగరంలోని బిర్లా భాస్కర ఆడిటోరియంలో కళాకర్ తెలుగు టీవీ, శివనంది అవార్డ్స్ 2025 ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ నృత్య పోటీలలో హైదర్ నగర్ లోని రుహాని కూచిపూడి నృత్య అకాడమీ నిర్వాహకురాలు నేరెళ్ల కల్పన ఆధ్వర్యంలో నిర్వహించిన బిందు మాధవి, భావనల తోపాటు పలువురు చిన్నారులు



నృత్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కూచిపూడి నృత్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు దైవజ్ఞ శర్మ అవార్డులు ప్రధానం చేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సంస్కృతిక కళలను భావితరాలకు అందించడానికి తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. మన సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలుగువారిపై ఉందన్నారు. చిన్న వయస్సులోనే అద్భుతమైన ప్రతిభ కనబరిచిన రుహానా కూచిపూడి నృత్య అకాడమీ బృందాన్ని ఆయన ఆశీర్వదించారు. కూచిపూడి నృత్యాన్ని ప్రోత్సహిస్తున్న రుహాన కూచిపూడి నృత్య అకాడమీ నిర్వాహకులను ఆయన అభినందించారు. చిన్నారులు తమ వయస్సుతో సంబంధం లేకుండా అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శనప్రదర్శించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాఖర్ తెలుగు టీవీ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన మహిళా వ్యాపారవేత్తలను తయారుచేయటం లక్ష్యంగా పెట్టుకున్నాం..శ్రీరంగం ఫౌండేషన్ కో-చైర్పర్సన్ ఇందుమతి శ్రీరంగం

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి :**
మహిళలు సమాజంలో సామాజిక సేవ కార్యక్రమాలలో ప్రముఖ పాత్ర పోషించాలనీ శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్పర్సన్ ఇందుమతి శ్రీరంగం పేర్కొన్నారు. ఉమెన్ ఇంటర్నేషనల్ సమ్మిట్ ఆన్ ఎంట్రప్రెన్యూర్షిప్ ఎక్స్పో 2025 హైదరాబాద్లోని గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నేషనల్ కాన్ఫరెన్స్కు శ్రీరంగం ఫౌండేషన్ కో-చైర్పర్సన్ ఇందుమతి శ్రీరంగం హాజరై మహిళా వ్యాపారవేత్తలకు మరియు



కార్యక్రమాలకు తన కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరంగం ఫౌండేషన్, మధ్య అవగాహనా ఒప్పందం కుదిరిందని తెలియజేశారు ఈ ఒప్పందం ద్వారా భవిష్యత్తులో ఇద్దరు సంస్థలు కలిసి నూతన మహిళా పారిశ్రామిక వేత్తల అభివృద్ధికి మరియు వ్యాపార అవకాశాల విస్తరణకు సహకరించనున్నాయి అన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 108 మంది మహిళా వ్యాపారవేత్తలకు శక్తి అవార్డులు ప్రదానం చేయబడినాయి. అలాగే 40 పైగా బయ్యర్లు (ప్రభుత్వ, కార్పొరేట్ సంస్థలు) మరియు 70 పైగా సెల్లర్లు పాల్గొన్న %దీ2దీ జుఇజూశీ% ఈవెంట్ జరిగింది. శ్రీమతి ఇందుమతి శ్రీరంగం గారు ఈ సమ్మిట్లో శ్రీరంగం ఫౌండేషన్ తరఫున రెండు రోజులపాటు పూర్తిగా పాల్గొని మహిళా వ్యాపారవేత్తల అభివృద్ధికి మద్దతుగా ఫౌండేషన్ చేసే కృషిని వివరించారు. శ్రీరంగం ఫౌండేషన్ మహిళా సాధికారత, విద్య, ఆరోగ్య సంరక్షణ, సామాజిక అభివృద్ధిలో విశేష సేవలు అందిస్తున్న సంస్థ అని అన్నారు. మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించడంలో శ్రీరంగం ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందని శ్రీమతి ఇందుమతి శ్రీరంగం గారు తన ప్రసంగంలో తెలిపారు. %జూఔజు% తో కలిసి పని చేయడం ద్వారా మరిన్ని మహిళలకు మద్దతు అందించేందుకు శ్రీరంగం ఫౌండేషన్ కట్టుబడి ఉందని ఆమె వెల్లడించారు.

# శ్రీశ్రీశ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం లో సంకష్టహర గణపతి ధ్వజస్తంభన ప్రతిష్టాపన

## ముఖ్య అతిథిగా పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:**
బాలానగర్ చరబండ రాజు కాలనీలోని శ్రీశ్రీశ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న సంకష్టహర గణపతి విజయదుర్గ ధ్వజస్తంభ ప్రతిష్టాపన సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని దేవత దర్శనం గావించారు. ఆలయ కమిటీ సభ్యులు రాజేశ్వరరావుకి ఘన స్వాగతం పలికారు. దేవాలయ అభివృద్ధిలో సహకరించి రాజు కాలనీ లోని భక్తులందరికీ భాగస్వామ్యులను చేసినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ రాజేశ్వరరావుని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సురేందర్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు రమేష్, మహిళా మోర్చ నాయకులు శివరంజని, బాలానగర్ డివిజన్ నాయకులు నరేందర్ గౌడ్, ప్రదీప్ రెడ్డి, రాజేంద్ర కృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు చరబండ రాజు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం 25సంవత్సరాల తర్వాత ఒకే వేదిక పై కలిసిన మిత్రులు ఉపాధ్యాయులు

**తెలుగు వెలుగు న్యూస్ పెద్ద శంకరంపేట్ మార్చ్ 02:**
అందోల్ మండలం జోగిపేట స్వామి వివేకానంద ఉన్నత పాఠశాల 1999- 2000 ఎస్ ఎస్ సి పూర్వ విద్యార్థుల సమ్మేళనం సంగారెడ్డిలోని శివ బ్యాంకెట్ హాల్లో ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా తమకు పాట నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సంప్రదాయాల పద్ధతిలో తాళాలు చప్పులతో సాంప్రదాయ పద్ధతిలో సభ స్థలానికి ఆహ్వానించారు.. ఉపాధ్యాయులకు పుష్పగుచ్చాలు అందజేస్తూ వేదికపై సగరవంగా తీసుకువెళ్లారు అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు.. స్నేహితులందరూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రధాన ఉపాధ్యాయులు ప్రభాకర్ గౌడ్ ఉపాధ్యాయ బృందాన్ని విద్యార్థులు శాలువాలు మేమంటలతో ఘనంగా సత్కరించారు.. ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో ప్రభాకర్ గౌడ్.. దయాకర్ గౌడ్.. కృష్ణ.. పద్మ రాణి.. రాజు గౌడ్.. చారి.. మల్లికార్జున్ గౌడ్.. సురేష్.. సిద్దేశ్వర్ విద్యార్థులు.. రాకేష్.. రాజేష్.. సంతోష్.. సందీప్.. రాజు.. సర్వేశ్వర్.. జావేద్.. రమేష్.. సుమలత.. చండీ ప్రసన్న.. రమ్య జ్యోతి.. స్వప్న తదితరులు పాల్గొన్నారు



# ఘనంగా కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలు

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి :**
కూకట్ పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణరావు జన్మదిన వేడుకలను ఆదివారం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కూకట్ పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కో-ఆర్డినేటర్ ఆర్.సతీష్ అరోరా దీనబంధు కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.మహేందర్ నాయక్ ప్రభృతులు జూపల్లిని నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహేందర్ నాయక్ మాట్లాడుతూ కార్పొరేటర్ జూపల్లి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ డివిజన్ ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని కితాబిచ్చారు. అంతకుముందు కూకట్ పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ కె.నవీన్ కుమార్ ప్రభృతులతోపాటు పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, శ్రేయోభిలాషులు జూపల్లిని కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



# స్ఫూర్తి ప్రదాత స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాద రావు

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



**తొలి సమయంబీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 2:**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో శాసనసభకు వన్నె తెచ్చిన మాజీ స్పీకర్, స్వర్గీయ నేత దుద్దిళ్ళ శ్రీపాదరావు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఆయన జయంతి సందర్భంగా ఆదివారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశం మందిరం లో ఏర్పాటు చేసిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ తో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ%శ్రీ% స్వర్గీయ శ్రీపాద రావు న్యాయవాదిగా ప్రజలకు మంచి సేవలు అందించారని, ఆయన రాజకీయ ప్రస్థానంలో మొదటిగా సర్పంచ్ గా రెండు సార్లు ఎన్నికై తదుపరి మహాదేవపూర్ సమితి అధ్యక్షుడిగా ఎన్నికైయ్యారని చెప్పారు. 1984 ఎన్నికల్లో మొదటి సారి మంథని నుంచి శాసన సభ్యులుగా పోటీ చేసి విజయం సాధించి 3 సార్లు శాసన సభ్యునిగా ఎన్నికైనట్లు తెలిపారు. 1994 లో ఓటమి పాలు అయినప్పటికీ ప్రజల మధ్యనే ఉంటూ ఎన్నో సేవలు అందించడం అలాగే 1999 ఏప్రిల్ 13న మహదేవపూర్ మండలం అన్నారంకు తన అనుచర వర్గంతో వెళ్లి వస్తున్న క్రమంలో మార్గమధ్యంలోని అడవుల్లో ఆయన వాహనాన్ని నక్సల్స్ ఆపివేసి, ఆయనతో మాట్లాడాలని చెప్పి లోపలికి తీసుకెళ్లి కరుకు తుపాకీ తూటాలతో విగత జీవున్ని చేశారు. ఆయన మరణించిన... ఇప్పటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు అని కలెక్టర్ అన్నారు. అధికారులు మహనీయుని గురించి కింది స్థాయి సిబ్బందికి కూడా తెలపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఓ సంజీవరావు, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, జిల్లా క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి, డిఎం సివిల్ సప్లైస్ త్రినాధ్ బాబు , మైనింగ్ శాఖ అధికారి దినేష్ మరియు వివిధ శాఖల అధికారులు, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# రాందేవ్ రావు ఆసుపత్రిలో డెర్మాటలజీ ఈఎన్టీ ఉచిత వైద్య శిబిరం



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి :**
కూకట్పల్లిలోని రాందేవ్ రావు ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు డెర్మటాలజీ ఇఎన్టి లకు సంబంధించి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని రాందేవ్ రావు హాస్పిటల్ సీఈఓ డాక్టర్ యోబు తెలియజేసారు. ఈ క్యాంప్ లో చెవి నొప్పి, వినికిడి నష్టం, చెవి నుంచి ద్రవం విడుదల, తల తిరగడం, ముక్కు మూసుకుపోవడం, ముక్కు నుండి రక్తం కారుట, ముక్కు నొప్పి, గొంతు నొప్పి, దగ్గు, చేదు శ్వస, అలర్జీలకు వైద్య పరీక్షలు చేశారనన్నారు. ఈఎన్ టి సర్జన్స్ డాక్టర్. ఏస్ . శ్వేత డాక్టర్ డి లావణ్య లు ఈ వైద్య శిభిరాన్ని పర్యవేక్షించడం జరిగిందన్నారు. డాక్టర్ల సలహామేరకు అవసరమైన వారి కు సి టి స్కాన్ రూ. 1000, ఎం ఆర్ ఐ 2000 లకే చేయడం జరిగింద నీ అదేవిధంగా మొటిమలు, బొల్లి మచ్చలు, మంగు మచ్చలు, గజ్జి, తామర, ఇతర మచ్చలు, దురదలు, దద్దుర్లు, అలర్జీలు, జుట్టు రాలడం, బట్ట తల, చుండ్రు, పెను కొరకడం, గోరు చుట్లు ఇన్ఫెక్షన్ లకు కు కూడా పరీక్షలు చేయడం జరిగిందన్నారు. వీటిని డాక్టర్ సి. స్వాతి డాక్టర్. కె. శ్రీహర్ష ల పర్యవేక్షణ లో పరీక్షలు నిర్వహించడం జరిగిందని చెప్పారు. డాక్టర్ల సలహామేరకు సిబిపి, ఏఈసి, ఐజిఈ, ఎనిమియా ప్రొఫైల్, పి టీ ఏ, ఐ ఎం పి, ఓఏఈ పరీక్షలు ఉచితంగా చేయడం జరిగిందనీ వినికిడి పరికరాలు మీద ప్రత్యేక రాయితీ ఇవ్వబడం జరిగిందని డాక్టర్ యోబు తెలియజేశారు. ఈ క్యాంపులో రాందేవ్రావు హాస్పిటల్ అందిస్తున్న సర్వీసెస్ చాలా అద్భుతంగా, చాలా ఉపయోగకరంగా ఉన్నవని తమ హర్షాన్ని వ్యక్తం చేసారు. ఇలాంటి సేవలు ఇతర విభాగలలో కూడా మరిన్ని చేయాలనీ ఈ క్యాంపు కు వచ్చిన వారు మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్ ని కోరడం జరిగింది. అందుకు మెడికల్ డైరెక్టర్ కామలాకర్ గారు సానుకూలంగా స్పందించారు. ఈ క్యాంపు ప్రారంభించిన ప్రముఖ రేఖీ థెరపీ గ్రాండ్ మాస్టర్ లక్ష్మి కమలాకర్ గారు మాట్లాడుతూ ఈ క్యాంపు ని ప్రారంభించినందుకు తమ ఆనందాన్ని వ్యక్తం చేసారు, అతి తక్కువ వైద్య ఖర్చులతో సమాజానికి సేవ అందిస్తున్న రాందేవ్రావు హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేసారు.

# బిజెపి నాయకులు డాక్టర్ కొరదాల నరేష్ మాతృమూర్తి పుల్లమ్మ దశదిన కార్యక్రమంలో పాల్గొన్న జర్నలిస్టులు



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి :**
ఇటీవల మృతి చెందిన బిజెపి సీనియర్ నాయకులు డాక్టర్ కొరదాల నరేష్ మాతృమూర్తి కొరదాల పుల్లమ్మ పెద్దకర్మ సందర్భంగా సాయిబాబానగర్ లోని నివాసంలో ఆమె చిత్రపటానికి ఆదివారం జర్నలిస్టులు పాల్గొని నివాళులు అర్పించారు. సీనియర్ పాత్రికేయులు విద్యా వెంకట్ , దీనబంధుకాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.మహేందర్ నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుల్లమ్మ తనయుడైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివేకానంద విద్యాసంస్థల అధినేత డాక్టర్ కొరదాల నరేష్ ను ఈ సందర్భంగా మహేందర్ నాయక్ పరామర్శించి సానుభూతి తెలిపారు. పుల్లమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# శుభకార్యాలలో వివాహ వేడుకల్లో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు





**తెలుగువెలుగుప్రతినిధి** కట్పల్లి సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరిగిన శుభకార్యాలకు వివాహ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు నూతన దంపతులను ఆశీర్వదించారు. ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ పార్క్ కమ్యూనిటీ హాల్లో డివిజన్ సీనియర్ బీజేపీ కార్యకర్త రమేష్ రాథోడ్ కూతురు తులసి అల్లుడు శివశంకర్ ల వివాహ వేడుకలో వారి ఆహ్వానం మేరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని నూతన వధూవరులను అభినందించి ఆశీర్వదించారు. అలాగే గాజుల రామారావు లోని శ్రీ వెంకటేశ్వర గార్డెన్స్ లో జరిగిన ఆస్కానీ వెంకటస్వామి సాగర్ లక్ష్మీదేవి దంపతుల కూతురు జీవిత అల్లుడు రోహన్ సాగర్ల వివాహ వేడుకల్లో వారి ఆహ్వానం మేరకు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని నూతన దంపతులను అభినందించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బాణేష్,బేతి రమేష్,బీరప్ప, సగర సంగం నాయకులు కే పి రామ్ సాగర్, కేపీ రాములు సాగర్, ఆర్కే దయాసాగర్, గడ్డమీది రవి సాగర్, కొమ్ముల మధుసాగర్, కేపీ శివసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గురు దత్తాత్రేయ పంచమ వార్షికోత్సవ ఆహ్వాన కరపత్రికను పులి మామిడి రాజుకు అందించిన ఆలయ కమిటీ సభ్యులు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**సదాశివపేట పట్టణంలోని శ్రీ స్థానిక మాణిక్ ప్రభు మందిరం ఆలయ ప్రాంగణంలో నెలకొల్పిన శ్రీ దత్తాత్రేయ పంచమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని తేది: 03-03-2025 సోమవారం రోజున శ్రీ సద్గురు బాలమార్తాండ మహారాజ్ చయనయాజి ఆధ్వర్యంలో స్వామివారికి ఉ. 6 గం.లకు అభిషేకము, ఉ. 8 గం.లకు కళాశాల ఊరేగింపు, ఉ. 10 గం.లకు గీతా పారాయణం, మధ్యాహ్నం ఒంటిగంటకు మహా ప్రసాద వినియోగము (శ్రీమతి %డ% శ్రీ. బల్లెం భారతమ్మ – లక్ష్మయ్య కుటుంబ సభ్యులచే నిర్వహించబడును. రాత్రి 7. 00 గ.లకు దత్తాత్రేయుని పల్లకి సేవ సదాశివపేట పట్టణంలోని పురవీధుల గుండా నిర్వహించబడును. తదుపరి ఆలయ ప్రాంగణంలో తెల్లవారుజామున భజన కార్యక్రమము వెంకటాపురం భజన మండలిచే నిర్వహించబడును. కావున భక్తులందరూ పెద్ద ఎత్తున ఇట్టి కార్యక్రమంలో పాల్గొని శ్రీ సద్గురు దత్తాత్రేయుని కృపకు పాత్రులు కాగలరని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు పిలుపునివ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో అధ్యక్షులు ఎ. చిదానందం, యస్. మనోహర్, బల్లెం లక్ష్మయ్య, కార్యదర్శి ఎం. విజయ్ కుమార్ యాదవ్, మునిపల్లి సత్యనారాయణ, వాదోని రాజు, రాచన్న, అశోక్, గద్దం ప్రభు, ఎస్. కిరణ్, బాబు, కె. శంకర్, పండాల జగదీశ్వర్ పంతులు, మున్నేమ్మ, కె. రఘు, వరలక్ష్మి, యస్. ఉషా, అనురాధ మొదలగు వారు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా పార్వతీ పరమేశ్వర కల్యాణమహోత్సవం

**-వైభవంగా బండ్ల ఊరేగింపుగురుపాదగుట్ట శివాలయంలో ప్రత్యేక పూజలు -హాజరైన ఎమ్మెల్యే సంజీవరెడ్డి**





**తెలుగు వెలుగు న్యూస్ పెద్దశంకరంపేట మార్చి02::** పెద్దశంకరంపేట పట్టణం శివారులో కట్లమైసమ్మ గురుపాదగుట్ట శివాలయం ఆవరణలో వేదబ్రాహ్మణ పండితుల మంత్రోచ్ఛరణలతో మరోవైపు మంగళవాయిద్యాల చప్పుళ్లతో పార్వతీ పరమేశ్వర కళ్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణ మహోత్సవం ఆలయకమిటీ అధ్యక్షులు గుజ్జరి కనకరాజు కన్నుల పండువగా నిర్వహించారు. పలువురు గ్రామ పెద్దలు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కల్యాణోత్సవ మండపాన్ని రకరకాల పూలతో, అరటి మట్టలతో అందంగా అలంక రించారు. పార్వతీ, పరమేశ్వరుడి ఉత్సవ విగ్రహాలకు వేద బ్రాహ్మణంచే కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. వేదబ్రాహ్మణులు శివపార్వతుల కళ్యాణ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆయా గ్రామాల నుంచి బక్తులు తరలివచ్చి స్వామివారికి నైవేద్యాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇక్కడ శివపార్వతుల కల్యాణం నిర్వహించడంతో పట్టణంలోని ఆయా కాలనీల నుంచి భక్తులు. మహిళలు పెద్ద ఎత్తున వచ్చారు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.వైభవంగా బండ్ల ఊరేగింపుగురుపాదగుట్ట శివాలయం జాతర ఉత్సవాల్లో భాగంగా ఎడ్లబండ్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు శివాలయం చుట్టూ ఐదు ప్రదక్షిణల బండ్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో దేవాలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఎడ్లబండ్లకు వివిధ రకాల చీరలతో, రంగు రంగుల కాగితాలతో దేవతామూర్తుల క్యాలెండర్లను ఎడ్లబండ్లపై అతికించి అందంగా అలంకరించారు. ఉదయం వేద బ్రాహ్మణులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పేట ప్రజలు శివాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ అధ్యక్షులు గుజ్జరి కనకరాజు అన్నదానం, మంచినీటి వసతి ఏర్పాటు చేశారుహాజరైన ఎమ్మెల్యే సంజీవరెడ్డి కళ్యాణ మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

# రామేశ్వరంలో దోమల నివారణకు పిచికారీ: ఇఓఆర్డి ఎంఎస్ఎన్ రెడ్డి




**తెలుగు – వెలుగు, తూ. గో. జిల్లా బ్యూరో (అనపర్తి)::** పెదపూడి మండలం రామేశ్వరంలో దోమల నివారణకు పంచాయతీ విస్తరణాధికారి ఎమ్మెస్సార్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యదర్శి లక్ష్మి తో కలిసి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆదివారం వివిధ రకాల మిశ్రమ రసాయనాలతో గ్రామంలో ఉన్న డ్రైన్, కచ్చా డ్రైన్, బోధి కాలువలపై గట్టి ఉన్న ప్రదేశాల్లో ఒకే రోజు గ్రామమంతా పిచికారి చేయించడం జరిగింది. ఈ చర్య వలన పూర్తిగా దోమలు నివారించే అవకాశం ఉంటుందని ఎం ఎస్ ఎన్ రెడ్డి తెలిపారు. ఇంకా దోమలు ఉన్న చోట నూతనంగా కొనుగోలు చేసిన ఫాగింగ్ మిషన్ల ద్వారా దోమల నివారణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. దోమల నివారణతో అనేక వ్యాధులను నివారించవచ్చని విస్తరణ అధికారి ఎం ఎస్ ఎన్ రెడ్డి తెలిపారు. సందర్భంగా సర్పంచ్ చినబాబు ప్లాస్టిక్ తో నిండిపోయి ఉన్న బాదవ కాలువ తవ్వించాలని కోరగా స్పందించిన ఎమ్ ఎస్ ఎన్ రెడ్డి స్పందించి త్వరలోనే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# వృద్ధులకు భోజనాలు పంపిణీ



**తెలుగు – వెలుగు తూ.గో. జిల్లా బ్యూరో (అనపర్తి):** అనపర్తి రైజింగ్ హాండ్స్ ఫర్ హెూప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక తేతలి రామిరెడ్డి మంగయ్యమ్మ మహిళా వృద్ధాశ్రమంలో వృద్ధులకు అల్పాహారం, భోజనాలు పంపిణీ చేశారు. ఆదివారం రాయవరం మండలం పసలపూడి కి చెందిన నల్లమిల్లి వెంకటరెడ్డి సుజాత దంపతుల తనయుడు శ్రీనివాసరెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు, అల్పాహారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దాక్టర్ నల్లమిల్లి ఆదిరెడ్డి, చింతా సతీష్ రెడ్డి, బర్ల సత్యనారాయణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గ్రామాన్ని కాపాడే రక్షించే దైవశక్తి గ్రామ దేవత: ఎమ్మెల్యే నల్లమిల్లి



**తెలుగు – వెలుగు, తూ.గో. జిల్లా బ్యూరో (అనపర్తి, రాజానగరం):** గ్రామదేవత అంటే గ్రామాన్ని కాపాడి రక్షించే దైవ శక్తి అని గ్రామ ప్రజల నమ్మకమని గ్రామస్తుల కష్టాలు తీర్చి, పంటలను కాపాడి, శత్రువుల నుండి రక్షించే శక్తిగా గ్రామదేవతలను ఎంతో నమ్మకంతో ప్రజలు పూజిస్తారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు.ఆదివారం రాజానగరం నియోజకవర్గం కాటవరం గ్రామ దేవత శ్రీ పాశాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం పురస్కరించుకుని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.ఆయన వెంట రాజానగరం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ నీరుకొండ వీరన్న చౌదరి,ఎంఎస్ఎన్ చౌదరి (సాయి), గ్రామ ఎన్ డి ఏ నేతలు ఉన్నారు.

# కార్తీక్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మండల సర్పంచ్ ల సంగం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ



**తెలుగు వెలుగు మార్చి 2 ::** బి ఆర్ ఎస్ పార్టీ రాజేంద్రనగర్ ఇంచార్జ్ ఇంద్రారెడ్డి ట్రస్ట్ చైర్మన్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మండల సర్పంచ్ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి సరిగుడా మాజీ సర్పంచ్ సత్యనారాయణ, ఈ కార్యక్రమంలో మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు గండిచర్ల గోవర్ధన్ రెడ్డి, మండల బి ఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి, న్యాయవాది ఉపేందర్ రెడ్డి తోపాటు సేరిగూడ గ్రామస్తులు మండల నాయకులు పాల్గొన్నారు

# ఘనంగా ఆల్ ఇండియా వీరశైవ అధ్యక్షులు రుద్రమదేవికి ఘనంగా జన్మదిన వేడుకలు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**ఆల్ ఇండియా వీరశైవ మహాసభ అధ్యక్షులు శ్రీమతి పొగాకు రుద్రమదేవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలిండియా వీరశైవ మహాసభ ప్రధాన కార్యదర్శి శ్రీమతి వినియా పాటిల్, సంగారెడ్డి జిల్లా మహిళా కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీమతి అనిమిశెట్టి అన్నపూర్ణ, మఠం స్వాతి శివ శంకర్ లు ఘనంగా సన్మానించారు

# మల్కా కొమురయ్య కుమార్ వివాహ వేడుకల్లో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:**మాదాపూర్ హైటెక్స్ ఎగ్జిబిషహాల్ లో నిర్వహించిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ సంస్థల అధినేత, బిజెపి నాయకులు మల్కా కొమురయ్య, పల్లవి దంపతుల కొడుకుల యశస్వి ప్రకృతి ల వివాహ వేడుకలో వారి ఆహ్వానం మేరకు బిజెపి రాష్ట్రకార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని నూతన వధూవరులను అభినందించి ఆశీర్వదించారు. మల్క వారి వివాహ వేడుకకు విచ్చేసిన కేంద్ర హెూంశాఖ మాత్యులు బండి సంజయ్ కుమార్, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ని వడ్డేపల్లి రాజేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు.

# వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే సత్తి, డాక్టర్ గౌతమ్ రెడ్డి



**తెలుగు – వెలుగు, తూ గో జిల్లా బ్యూరో (అనపర్తి):** రాజమహేంద్రవరంలో డాక్టర్ వెంకట మహేష్ డాక్టర్ రష్మీ వివాహ వేడుకకు అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, తనయుడు ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ సత్తి గౌతమ్ రెడ్డి హాజరయ్యారు.ఆదివారం జరిగిన వివాహ వేడుకకు హాజరైన మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి, డాక్టర్ గౌతమ్ రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

**గ్రామాన్ని కాపాడే రక్షించే దైవశక్తి గ్రామ దేవత: ఎమ్మెల్యే నల్లమిల్లి**

**తెలుగు – వెలుగు, తూ.గో. జిల్లా బ్యూరో (అనపర్తి, రాజానగరం):** గ్రామదేవత అంటే గ్రామాన్ని కాపాడి రక్షించే దైవ శక్తి అని గ్రామ ప్రజల నమ్మకమని గ్రామస్తుల కష్టాలు తీర్చి, పంటలను కాపాడి, శత్రువుల నుండి రక్షించే శక్తిగా గ్రామదేవతలను ఎంతో నమ్మకంతో ప్రజలు పూజిస్తారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు.ఆదివారం రాజానగరం నియోజకవర్గం కాటవరం గ్రామ దేవత శ్రీ పాశాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం పురస్కరించుకుని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

# కాశ్మీర్‌లో రాజకీయ డ్రామాలను కట్టిపెట్టాలి

## - పాక్ దుశ్చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి - వలస వెళ్లిన పండిట్లకు భరోసా కల్పించాలి







**న్యూఢిల్లీ:** బిజెపిని అప్రతిష్టపాలు చేయడమే లక్ష్యంగా అక్కడి నేతలు ఇంతకాలం చేసిన రాజకీయ డ్రామాలకు తెరపడడం లేదు. ఎందుకంటే 370 ముసుగులో రాచరికం అనుభవించిన నేతలు ఇప్పుడు అక్కడ ప్రజలు స్వే+-ఛా వాయువులు పీల్చుకోవడం జీర్ణించుకోవడం లేదు. అందరు కాకున్నా కొందరికి ఈ చర్య గిట్టబాటు కాని వ్యవహారంగా కూడా ఉంది. అలాగే విపక్ష రాజకీయం లేకుండా చేసింది. కేంద్రం తీసుకుంటున్న శాంతి చర్యలకు ఇంతకాలం మెహబూబా ముఫ్తీ కూడా గండికొట్టారు. పూర్తి పాక్ అనుకూల విధానాలను నరనరాన జీర్ణించుకున్న హురియత్ నేతలు కాశ్మీర్‌లో శాంతి స్థాపనకు కేంద్రం చేసిన యత్నాలను ఆదినుంచీ గండికొట్టారు.అక్కడ 370 ఆర్టికల్‌ను అడ్డం పెట్టుకుని ఇంతకాలం హురియత్ నేతలకు తోడు మెహబూబా ముఫ్తీ, అబ్దుల్లాలు పాక్‌తో కలిసి దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడుతూ వచ్చారు. ప్రజలను రెచ్చగొడుతూ యువతను పక్కదారి పట్టించారు. అక్కడి ముఫ్తీలు,అబ్దుల్లాలే ఒక్కరే కాశ్మీర్ ప్రజలు కాదని గుర్తుంచు కోవాలి. 370 రద్దుతో హురియత్ నేతలకు స్థానం లేకుండ పోయింది. అలాగే అక్కడి నుంచి తరిమివేయబడ్డ వేలాది కాశ్మీర్ పండిట్లతో కూడా సమస్యలు చర్చించడం ద్వారా వారిలో ధైర్యం కల్పించాలి. కాశ్మీర్‌లో శాంతి భద్రతలు కుదుటపడుతున్నదేమిటి ప్రపంచానికి తెలిసింది. నిజానికి పండిట్లను ముందుగా వారిని తమ స్వస్థలాలకు పంపి రక్షణ కల్పించాలి. కనీస మర్యాద, గౌరవం లేకుండా తామేదో ఇతర దేశస్థుల మాదిరిగా ఇంతకాలం నేతలు వ్యవహరిస్తూ వచ్చారు. ఇంతకాలం వారి పెద్దరికానికి నిదర్శనంగా గుర్తుంచుకోవాలి. విచ్ఛిన్నకర ధోరణితో కాశ్మీర్‌లో మరింత ఆజ్యం పోస్తూ వచ్చారు. వారంతా కావాలని పాక్ కొమ్ముకాస్తూ భారత్‌లో వేర్పాటు వాద కార్యకలాపాలకు మద్దతు పలికారు. వీరంతా తాము అనుకున్న రీతిలో కాశ్మీర్ నడవాలని అనుకున్నారు. పాక్ వీరికి భారత్ వ్యతిరేక ఉగ్రవాదాన్ని నూరిపోస్తోంది. 370 ఆర్టికల్ కాశ్మీర్ అభివృద్ధికి అడ్డుగా నిలవడమే గాకుండా కాశ్మీరీ పండింట్లకు చోటులేకుండా చేసింది. దీనిరద్దుతో ఇప్పుడు పండిట్లు తమ స్వస్థలాలకు చేరుకునే అవకాశం వచ్చింది. అలాగే మెల్లగా ఇక్కడినుంచి తరలి వెళ్లిన వారు కూడా వచ్చేస్తున్నారు. ఇది జీర్ణించుకోలేని ఉగ్రమూకలు పండిట్లను మళ్లీ లక్ష్యంగా చేసుకుని కాల్పులకు తెగబడుతున్నారు. ముందు పండిట్లను కాశ్మీర్‌లో స్వేచ్ఛగా జీవించే చర్యలు తీసుకోవాలి. అలా చేస్తేనే కాశ్మీర్ అందరిదన్న భావన ఉంటుంది. కాశ్మీరీ పండిట్లను జాడ లేకుండా తరిమేసినా గత ప్రభుత్వాలు ఏనాడూ అక్కడ నివారణ చర్యలు తీసుకుని అక్కడి ప్రజలను భారత్‌తో మమేకం చేయలేకపోయింది. రాజకీయ పార్టీలు కూడా ఇలాంటి విషయాల్లో ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తూ వచ్చాయి. బిజెపి కఠినంగా వ్యవహరించి సమస్యను పరిష్కరిం చడంలో చొరవ తీసుకున్న దానిని విఫలం చేశారు. పాక్ పాలకులతో స్నేహం పెంచుకోవడం ద్వారా తీవ్రవాద గ్రూపులు కాశ్మీర్‌ను నిత్యం కల్లోల క్షేత్రంగా రగిలిస్తూనే ఉన్నారు. అందువల్ల ముందుగా కాశ్మీర్ నుంచి తరిమివేయబడ్డ పండిట్లను ఇతర ప్రాంత ప్రజలను విశ్వాసంలోకి తీసుకోవాలి. అలా చికిత్సకు శ్రీకారం చుట్టాలి. అప్పుడే మిగతా వర్గాల ప్రజలు కూడా విశ్వాసంలోకి తీసుకునే ప్రయత్నం చేయాలి. ఇందుకోసం కొంత కఠిన వైఖరినే కేంద్రం అవలంబించాలి. ఇక్కడ శాంతి కోసం చేసే ప్రతి ప్రయత్నాన్నీ ఇక్కడ తీవ్రవాదులు ఎగదోస్తూ చిచ్చు రేపుతున్నారు. రాజకీయ లబ్ధికి వీటిని ఉపయోగించుకుంటున్న నేపథ్యంలో అందుకు తగ్గట్లుగా వ్యూహాలు ఉండాలి. నరేంద్రమోదీ ప్రభుత్వం కాశ్మీర్ సమస్య, కాశ్మీర్ పట్ల వివేకవంతమైన వైఖరితో ముందుకు వెళ్లడం స్వాగతించాలి. ప్రధాని మోడీ ప్రయత్నాలు ఫలించాలంటే ప్రతిపక్షం కూడా ఆయనకు బాసటగా ఉండాలి. అయితే పక్కలో బల్లెంలా ఉన్న పాక్ పాలకులు కాశ్మీర్‌లో ఆజ్యం పోస్తూ ఉగ్రవాదులను ఎగదోస్తున్నారు. భారత్‌లో అలజడి సృష్టించేందుకు పాక్ చేస్తున్న ప్రయత్నాలు ఈ నాటివి కాదు. భారత్ నుంచి విడివడ్డ నాటి నుంచి అంటే 1947 నుంచి కుట్రలు పన్నుతూనే ఉంది. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు సృష్టించి తీవ్రవాదులను దేశం దాటించాలని అక్కడి సైన్యం చూస్తోంది. సరిహద్దుల్లో తీవ్రవాదలును చొప్పించేందుకు సిద్దంగా ఉన్న పాక్ సైన్యం కాల్పుల ద్వారా తరచూ దృష్టి మరల్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. సరిహద్దులో పాకిస్థాన్ పదేపదే కాల్పులకు తెగబడుతున్న తీరు దాని కుత్సిత బుద్ధికి నిదర్శనంగా చెప్పుకోవాలి. పాక్‌కు మాటలతో సమాధానం చెప్పలేమని గతానుభవాలను బట్టి తెలుసుకోవాలి. పాక్‌లో అంతర్గ సంక్షోభాలు వచ్చినప్పుడల్లా ఇలా భార్‌తపైకి దాడులకు దిగుతారు. పాకిస్తాన్ ప్రజలను రెచ్చగొట్టేందుకే కాశ్మీర్ విషయంలో ఎప్పుడూ వివాదం సృష్టిస్తూనే ఉంటారు. ఆక్రమిత కాశ్మీర్ ఇప్పటికీ ఈ సమస్య రాజుకుంటూనే ఉంది. దౌత్య పరంగా తప్పటడుగుల వేయడంతో భారత్‌కు తిప్పలు తప్పలేదు. ఇప్పటికైనా మోడీ దీని పరిష్కారాన్ని చేతల్లోకి తీసుకోవడం ద్వారా శాశ్వత పరిష్కారానికి తెగువ చూపారు.

# అఖిలపక్షంతో చర్చలు ఎల్లవేళలా అవసరమే!

రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడ్డ తెలంగాణ ప్రభుత్వంపనితీరును పరిశీలిస్తే.. ప్రజా స్వామ్యయుతంగా ముందుకు సాగుతున్నదనే చెప్పాలి. కలిసి చర్చించిడం, ఉమ్మడిగా నిర్ణయాలు తీసుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామం. తాజాగా తెలంగాణ గీతాన్ని ఆమోదించే క్రమంలోనూ అఖిల పక్షాన్ని పిలిచి, వారితో చర్చించి, వారు ఆమోదించిన తరవాత గీతాన్ని ఆమోదించారు. తెలంగాన అవతరణ దినోత్సవాన జూన్ 2న దీని ఆవిష్కరణ జరుగనుంది.ఇలాంటి నిర్ణయాలు మంచి సంప్రాదాయన్ని తెలియ చేస్తాయి. తెలంగాణ ఏర్పడ్డ తొమ్మిదన్నరేళ్ల కెసిఆర్ పాలనలో అఖిలపక్షాలు లేవు. సంప్రదింపులు లేవు. చర్చలు లేవు. ఏదైనా ఏకపక్ష నిర్ణయాలు... ఫామ్‌హౌజ్ చర్చలు అన్నచందంగా మారింది. ప్రజాస్వా మ్యాన్ని పాతరేసిన కల్వకుంట్ల వారు ఇప్పుడు ప్రజల గురించి మాట్లాడడం ప్రజలు కూడా జీర్ణించుకోలేక పోతున్నారు. అయితే ఎన్నికలు జరగడం.. ఫలితాల్లో ఓ పార్టీ అధికారంలోకి రావడం తో మిగతా ఎన్నికైన వారిని పాలనకు దూరంగా పెట్టడం సరికాదు. వారు కూడా ప్రజలు ఎన్నుకుంటేనే ఎమ్మెల్యేలు, ఎంపిలుగా ఎన్నికయ్యారు. కాబట్టి ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని చర్చించాలి. ప్రజలకు తెలియచేయాలి. ఏకపక్ష నిర్ణయాలు సరికాదని గుర్తించాలి. సిఎం రేవంత్ రెడ్డి కూడా మున్ముందు మరింత పారదర్శకంగా, ప్రజాస్వామ్యయుతంగా నిర్ణయాలు తీసుకుని ఆదర్శ పాలనకు శ్రీకారం చుట్టాలి. దశాబ్ది ఉత్సవాల వేళ అందెశ్రీ గీతాన్ని రాష్ట్ర గీతంగా ఆమోదించడం, అఖిలపక్షంలో చర్చించడం ఆహ్వానించదగ్గ నిర్ణయం. మాజీ సిఎం కెసిఆర్‌ను కూడా ఉత్సవాలకు ఆహ్వానించడం రేవంత్ నాయకత్వంతో పాటు, ఆయన హుందాతనానికి ప్రతీకగా నిలుస్తుంది. ఇక పాలనా పరంగా ఉన్న అనేకానేక సమస్యలను కూడా ప్రజా ప్రతినిధుల, క్షేత్రస్థాయి నాయకులతో చర్చించి నిర్ణయాలు తీసుకుని ప్రజలకు మేలు జరిగేలా చేయాలి. ఏయే అంశాలపై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారో వాటిని ముందుకు చర్చించాలి. తెలంగాణ ఏర్పడ్డ తరవాత గత దశాబ్ద కాలం పరిశీలిస్తే సిఎం కెసిఆర్ కీలక నిర్ణయాలు తీసుకుని ప్రజలకు సంబంధం లేకుండా పాలన చేశారు. దీంతో అప్పులు చేసి తెలంగాణను అథఃపాతాళానికి నెట్టారు. దీనిపై మాట్లాడితే.. తెలంగాణ పరువు తీస్తున్నారని కెటిఆర్, హరీష్ రావులు అంటున్నారు. అప్పులు చేసినట్లు చెబితే తప్పెలా అవుతుందో చెప్పాలి. ప్రధానంగా సాగునీటి రంగంలోనూ, విద్యుత్ రంగంలోనూ కీలక నిర్ణయాలు తీసుకు న్నట్లు చెప్పి, ఆయా రంగాల్లో పెద్ద ఎత్తున అప్పులను చేశారు. ఆర్థిక పరమైన నిర్ణయాల్లో విచ్చలవిడి కారణంగా రాష్ట్రంలో మరిన్ని సమస్యలకు దారితీసింది. ఇప్పుడు అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి గుదిబండగా మారింది. ఈ సమస్యలపై రేవంత్ ప్రత్యేక దృష్టి సారించాల్సి అవసరం ఉంది. ఇక రైతు రుణమాఫీ అన్నది కూడా నిరంతరాయంగా కొనసాగించడం సరికాదు. రైతులకు కావాల్సింది మాఫీలు కాదు.. పంటలు పండగానే కొనుగోలుచేసి వారు రోడ్డెక్కకుండా చేయగలగాలి. విత్తనాలు, ఎరువుల అందుబాటులో ఉంచాలి. ఏ పొలంలో ఏ పంట వేయాలన్నది క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారుల ద్వారా చెప్పించాలి. అదేపనిగా వరి వేయడం కాకుండా డిమాండ్ ఉన్న పంటలను పండించేలా..వాటిని కొనుగోలు చేస్తామన్న భరోసాను రైతులకు కలిగించాలి. మార్కెట్ యార్డులు, రైతు సంఘాలను బలోపేతం చేయాలి. కెసిఆర్ హయాంలో రైతుబంధు సమితి నేతలు ఏనాడూ క్షేత్రస్థాయిలోకి వెళ్లి రైతుల సమస్యలపై ఆరా తీయలేదు. అలాకాకుండా రైతులు ఏం కోరుకుంటున్నారో చేయగలగాలి. పత్తివిత్తనాల కోసం ఆదిలాబాద్‌లో రైతులు చేస్తున్న ధర్నాలను సీరియస్‌గా తీసుకుని అక్కది నేతలు నేరుగా వెళ్లి పరిష్కరించే చొరవ చూపాలి. ఉత్సవ విగ్రహం లాంటి నేతలను పక్కన పెట్టాలి. అలాగే ఉచిత విద్యుత్‌పైనా నియంత్రణ ఉండాలి.వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టి విద్యుత్ వినియోగాన్ని అంచనా వేయాలి. అలాగే వ్యవసాయా నికి నిజంగానే ఎంత కరెంట్ అవసరమో అంతే ఉచితంగా ఇవ్వాలి. దుబారాకు కళ్లెం వేయకపోతే దాని ప్రభావం కూడా ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా ఉంటుంది. ఉచిత బస్సులను కూడా తాహతును బట్టి,పేద,బడుగు మహిళలకే పరిమితం చేయాలి. జూన్ 2న అవతరణ దశాబ్ది దినోత్సవాలు జరుపుకుంటున్న వేళ కఠిన నిర్ణయాలతో తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి ముందుకు సాగాలి. వివిధ రంగాల్లో గట్టి నిర్ణయాలు తీసుకోవడం ద్వారా తెలంగాణ పురోగమనంలో కీలక అడుగులు వేయాలి. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుకుంటూనే తెలంగాణ ముఖచిత్రం మార్చేలా నిర్ణయాలకు శ్రీకారం చుట్టాలి. బిఆర్ఎస్ ప్రభుత్వం ఆచరించిన, అనుసరించిన, అవలంబించిన అన్ని విధానాలను సమీక్షించుకుని ముందుకు సాగడం అలవర్చుకోవాలి. సిఎం రేవంత్‌పై ప్రజలు విశ్వాసాన్ని ఉంచినందున.. అందుకు తగ్గట్లుగా హామీలను నెరవేర్చే బాధ్యతలను చిత్తశుద్ధితో అమలు చేయాలి. తెలంగాణ కోటి రతనాల వీణగా భాసిల్లా లంటే అందుకు కావలసిన సంకల్పబలాన్న చాటాలి. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి. ఉచిత విద్యుత్ పథకం మంచిదే



అయినా సమీక్షించుకుని పక్కాగా అమలు చేయాల్సి ఉంది. ఉచిత విద్యుత్‌కు విఘాతం కలిగించకుండా మీటర్లు పెట్టి విద్యుత్ వాడకాన్ని లెక్కించుకోవడం అన్నది అకౌంటబులిటీని తెలియ చేస్తుంది. ఇదే తరహాలో తెలంగాణలో మీటర్లు పెట్టి ఏ రైతులకు ఎంత పొలం ఉంది.. వారు ఏ పంటలు వేస్తున్నారో లెక్కలు తీయాలి. ఏ పంటకు ఎంత విద్యుత్ అసవరమో అన్నది గుణించాలి. అన్నింటికి మించి పాతబస్తీలో అక్రంగా వాడుతున్న కరెంట్‌పై కన్నేయాలి. ఇలా దౌర్జన్యం చేస్తున్న వారిని పట్టుకుని కేసులు పెట్టాలి. దొంగ కరెంట్ వాడకం అన్నది నేరంగా గుర్తించి, దీనిని అరికట్టగలగాలి. లేకుంటే బిల్లులు కట్టే వారిపైనే అధిక భారం పడుతూ పోతోంది. ఇదే సందర్భంలో ఖజనాకు భారంగాను, ప్రజలకు భారంగానూ మారుతున్న పథకాలను సమీక్షించుకోవడంలో తప్పులేదు. విద్యుత్ వాడకంపై నియంత్రణ లేకుంటే ఉచిత పథకాలు మెడకు చుట్టుకుంటాయి. ఇదే సందర్భంలో దుబారాను అరికట్టకపోతే మరింత భారం తప్పదు. ఇది ఉభయ తెలుగు రాష్ట్రాలకు వర్తిస్తుంది. దశాబ్ది ఉత్సవాల వేళ రేవంత్ సర్కార్ మంచి నిర్ణయాలతో ప్రజలకు మరింత చేరువ కావడానికి ముందుకు సాగాలని ఆశిద్దాం.

# కార్పోరేట్ స్కూళ్ల దోపిడీకి కళ్లెం వేసేదెవరు

## - ధనార్జనే ధ్యేయంగా ఫీజుల వసూళ్లు - చోద్యం చూస్తున్న ప్రభుత్వాధికారులు

**హైదరాబాద్:** జూన్ 12న స్కూళ్లు ప్రారంభం కానున్నాయి. అకడమిక్ కేలండర్‌ను ఇటీవలే ప్రభుత్వం ప్రకటించింది. అయితే ప్రైవేట్ స్కూళ్లపై అజమాయిషీ మాత్రం చేయడం లేదు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వానికి కార్పోరేట్ స్కూళ్ల నుంచి వాటాలు ముట్టేవని, అందువల్ల ఫీజులను తగ్గించలేకపోయారు. అలాగే కార్పోరేట్ స్కూళ్లి తమ ఇష్టానుసారం ఫీజులను నిర్ణయిస్తున్నాయి. విధిలేక కొందరు తల్లిదండ్రలుఉ చెమటోడ్చి పిల్లల చదువల కోసం వెచ్చిస్తున్నారు. అయినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అయినా పట్టించుకుంటుందా లేదా అన్నది మరో పక్షం రోజుల్లో తేలనుంది. ఇప్పటికే వచ్చే ఏడాదికి సంబంధించి అడ్మిషన్ల వ్యవహారం పూర్తయ్యింది. ప్రైవేట్ స్కూళ్లు యధావిధిగా వసూళ్లకు తెగబడ్డాయి. వివిధ రకాల ఫీజులు, తదితరాలతో తల్లిదండ్రులను పీల్చి పిప్పిచేసే పనిలో పడ్డాయి. ఈ క్రమంలో వీరి దృష్టి అంతా వసూళ్లపైనే ఉంది. విద్యార్థులు, టీచర్లపై వారికి దృష్టి ఉండడం లేదు. టీచర్లకు సకాలంలో జీతాలు ఇవ్వాలన్న లక్ష్యం పక్కకు పోయింది. కరోనా కాలంలో తామే దివాళా తీసామని ఏడుపు మొఖాలు పెడుతున్నాయి. ఫీజలును పెంచేసి డబ్బులు లాగేయాలన్న లక్ష్యంతో కార్పోరేట్ స్కూళ్లు తల్లిదండ్రులను వేధించడం అలవాటుగా చేసుకున్నాయి. ప్రైవేట్ విద్యాసంస్థలు తమ డబ్బు కోసం విద్యావ్యాపారాన్ని నిర్లజ్జగా కొనసాగిస్తున్నారు. తమ ఫీజులను రాబట్టుకనే క్రమంలో వారు ఎంత కఠినానికైనా దిగజారుతున్నారు. అంతా మీ పిల్లల కోసమే అని చెప్పి పరోక్షంగా తప్పించుకుంటున్నారు. ఈ క్రమంలో ఫీజుల నియంత్రణపై కాంగ్రెస్ ప్రభుత్వం రంగంలోకి దిగాలి. ఇబ్బడిముబ్బడిగా లక్షల్లో పెంచేసిన ఫీజులను నియంత్రించాలి. అదే క్రమంలో ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి భవిష్యత్తులో సామాజిక మార్పునకు దోహద పడుతుందని రుజువు చేయాలి. అలాగే ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు చదువును కొనే దుస్థితి నుంచి బయటపడేలా చేయాలి. సామాన్యులకు చదవును దగ్గర చేసేందుకు ఎంతయినా ఖర్చు చేయాలి. అప్పుడే విద్యారగం పటిష్టం కాగలదు. ప్రజలపై ఆర్థిక భారం తగ్గగలదు. లేకుంటే విద్య కోసం పేదలు సైతం లక్షల్లో ఖర్చు చేసేందుకు అప్పుల బారిన పడుతున్నారు. కార్పోరేట్ స్కూళ్ ఫీజు దోపిడీలను అరికట్టాలి. నిర్ణీత ఫీజులు ఉండేలా చూడాలి. అందుకు తెలుగు రాష్ట్రాల్లో గట్టి కృషిజరగాలి. గతంలో తెలంగాణలో కెజి టూ పిజి విద్యకు ప్రణాళిక ప్రకటించినా ఎందుకనో అది పట్టాలకెక్క లేదు. కులరహిత హాస్టళ్లు ఉండకూడదని కూడా చెప్పారు. ఇంతటి ఉదాత్తమైన పథకం ఎందుకనో ముందుకు సాగడం లేదు. కామన్ ఎడ్యుకేషన్ అన్నది సమాజాంలో అంతరాలను తొలగిస్తుందని తెలిసినా దాని గురించి పట్టించుకోవడం లేదు. పేదపిల్లలకు కార్పోరేట్ విద్యాసంస్థలను తలదన్నే విధంగా చదువు, సౌలభ్యాలు, మౌలిక వసతులు సర్కార్ స్కూళ్లోనే లభించాలి. గతంలో బాగా పనిచేసిన ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేయకుండా ముందస్తు చర్యలకు దిగాలి. ప్రముఖులు



లేదా నిపుణుల సలహాలతో ముందుకు సాగాలి. సామాన్యులకు విద్యను చేరువచేసే లక్ష్యంతో అనేక విధాలుగా ప్రయత్నాలు మొదలు పెట్టాలి. ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలన్నీ పూర్తిగా మార్చేందుకు పక్కాగా కార్యక్రమం అమలు చేయాలి. నిధుల కేటాయింపులో విద్యావైద్యరంగాలకు పెద్దపీట వేయాలి. ప్రతి పిల్లాడిని చదివించడమే కాదు.. వారు భావితరంతో పోటీ పడాలన్న లక్ష్యం మేరకు ముందుకు సాగేలా చేయాలి. వీటన్నింటితో పాటు తెలుగును తప్పనిసరి స్జబెక్టుగా చేయాలి.. దీంతో కార్పోరేట్ స్కూళ్ల ఫీజు దోపిడీకి కళ్లెం పడనుంది. వేలకోట్లు ప్రజల నుంచి పీలుస్తున్న విద్యాసంస్థలకు ముకుతాడు పడనుంది. ప్రభుత్వమే నాణ్యమైన విద్యను, ఇంగ్లీష్ మీడియాన్ని ప్రకటించి ముందుకు సాగితే విద్యారంగంలో విప్లవం రాకమానదు.

# గుదిబండ పథకాలను సమీక్షించాలి

## ఆర్థికంగా దెబ్బతీస్తున్న వాటిని సంస్కరించాలి

**హైదరాబాద్ :** ఆర్థికంగా రాష్ట్రం దివాళా తీసిన క్రమంలో ఇప్పటికే జీతాలకు, పెన్షన్లకు కష్టంగా మారింది. పథకాల అమలు కూడా భారంగా మారబోతున్నది. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెటీలు కూడా ఆర్థికంగా ఇరుకున పెట్టేవే. ఈ క్రమంలో దుబారా పథకాలను పక్కన పెట్టే నిర్ణయాలను రేవంత్ సర్కార్ తీసుకోవాలి. ఈ క్రమంలో పథకాలను సమీక్షించుకుని కఠిన నిర్ణయాలతో ముందుకు సాగాలి. ప్రధానంగా జిల్లాల విభజన, కొత్త జిల్లాల ఏర్పాటు ఆర్థికంగా భారంగా మారింది. అలాగే అడ్డదిడ్డంగ ఆమారింది. 10 జిల్లాలు ఉన్న తెలంగాణను పాలనా వికేంద్రీకరణలో భాగంగా 33 జిల్లాలో చేశారు. దేశంలో ఇంతటి అరుదైన నిర్ణయం తెలంగాణలో మాత్రమే జరిగింది. ఆశలను కల్పించడం వేరు.. వాటిని సాకారం చేయడం వేరు. తెలంగాణ కలను సాకారం అయిన సందర్భంలో జిల్లాల విభజన అన్నది పద్ధతి ప్రకారం జరగలేదు.ఇలా అనేక విషయాలను సమీక్షించుకుంటే తప్ప ముందుకు సాగడం కష్టం. ఒక్కో మెట్టు ఎక్కుతూ ఒక్కో హామీని సాకారం చేసే దిశగా అడుగులు వేస్తూనే, ఆర్థికంగా నిలదొక్కుకోగలగాలి. ప్రజలు భాగస్వాములైతే తెలంగాణ పురోభివృద్ధి లో కీలకం కానుంది. ఇక మరో విశేషమేమంటే సమైక్య రాష్ట్రం అవసరాలకు అనుగుణంగా రూపొందించిన అనేక పథకాలను, చట్టలాను మార్పు చేసుకుంటే తెలంగాణ అస్తిత్వానికి అనుగుణంగా సాగగలదు. పేదలు కూడా గౌరవంగా బతికేలా అందరికీ ఇళ్లు కట్టించే ఆలోచన మంచిదే. అయితే ప్రజలు స్వయం సమృద్ధితో ఎదిగిలే పథకాలు రూపొందించాలి. రెండు పడకగదుల ఇళ్లు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందిలో కొత్త ఆశలు చిగురింపజేశాయి. అయితే అది సాకారం కాలేదు. ఇప్పుడు ఇందిరమ్మ ఇల్లు అలా కాకుండా చూసుకోవాలి. ఇదే సందర్భంలో గత తొమ్మిదిన్నరేళ్లలో తీసుకున్న నిర్ణయాలను సమీక్షించుకునే తరుణం ఇది. అనేక పథకాలు గుదిబండగా ఉన్నాయి. ఆర్థికంగా దెబ్బ తీస్తున్న పథకాలను సమీక్షించుకోవాలి. లేకుంటా ఖజానాపై తీవ్ర ప్రభావం పడనుంది. అలాగే దండగ మారి పథకాలను సమీక్షించుకోవాలి. కిలో రూపాయి బియ్యం పథకం తక్షణం సవరించాలి. కొత్త కార్డుఉల ఇచ్చే ముందు పాతకార్డుల్లో ఎంతమంది అర్హులో తేల్చాలి. అలాగే కిలో బియ్యం పథకాన్ని సమీక్షించి కనీసం కిలో ఐదుతో ప్రారంభించాలి. అలాగే రైతుబంధునుంచి అనర్హులను కూడా తొలగించాలి. పెన్షన్ స్కీమ్‌ను 60 ఏళ్లనుంచే మొదలు పెట్టేలా కొనసాగించాలి. అందులోనూ అనర్హులను గుర్తించే ప్రక్రియ చేపట్టాలి. లేకుంటే ఇవన్నీ కూడా ఖజానాపై తీవ్ర ప్రభావం చూపుతాయి. పేదలకు ఉచిత విద్యను అందించే క్రమంలో ఆరోగ్యశ్రీ ని అందుబాటులోకి తేవడం మంచిదే అయినా..క్షేత్రస్థాయిలో ఆస్పత్రులను కూడా బలోపేతం చేయాలి. గతంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పునరుద్దరించి పటిష్టం చేయాలి. చేపట్టిన పనిని చివరి వరకు వదలకుండా చేసే ధైర్యం, స్థయిర్యం ఉన్న సిఎంగా రేవంత్ పేరు తెచ్చు కోవాలి. ఆర్థిక సంస్కరణల్లోనూ ముందుండాలి. ఈ సారి కూడా రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి వచ్చింది. అందుకు తగ్గట్టుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే పంటల కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు నష్టపోతున్నారు. ఇవన్నీ సమీక్షించుకుంటేనే ప్రజలకు మేలు చేసిన వారు అవుతారు. విత్తనాల కోసం పోరాడుతున్న వారికి స్వాంతన కలిగేలా తక్షణ చర్యలకు దిగాలి.

# క్రీడారంగానికి ప్రోత్సాహం పెరగాలి

## మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలి

**నిజామాబాద్ :** క్రీడలకు సరైన ప్రోత్సహకాలు లేక ఎంతోమంది భావి క్రీడాకారులు మట్టిలో మాణిక్యాలవలే మిగిలిపోయారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు కూడా దినసరి కూలీలాగా చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ కాలం వెళ్ళదీస్తున్న ఘటనలు చూస్తూనే ఉన్నాం. అలాగే క్రీడాకారులకు ఉద్యోగాల్లో 2శాతం రిజర్వేషన్లు కల్పిస్తే గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. తమ ప్రతిభ ద్వారా దేశానికి, రాష్ట్రాలకి కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టే క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత. ర్యాంక్‌లు, మార్కులకోసం పోటీపడే ప్రస్తుత కాలంలో ఆటలు ఆడితే పిల్లలు పాడవుతారని, చదువుల్లో వెనకబడతారనే తల్లిదండ్రులు ఆలోచిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు క్రీడా సాంస్కృతిక కళల పట్ల ఆసక్తి చూపించడం లేదు. దానికి కారణాలు కూడా లేకపోలేదు. గ్రామస్థాయిలో సరైన సదుపాయాలు లేకపోవడం, క్రీడలను ప్రోల్సహించేలా పరికాలు, క్రీడా సామాగ్రి లేకపోవడం, ఆడుకోవడానికి మైదానాలు లేకపోవడం వంటి కారణాలూ ఉన్నాయి. విద్యా సంస్థలు సైతం వీటిని ప్రోత్సహించడం లేదు. హైదరాబాద, తదితర పట్టణాల్లో కార్పోరేట్ స్కూల్ కల్చర్ వచ్చాక క్రీడలను పూర్తిగా విస్మరించారు. కేవలం ఇరుకుగదుల్లో పిల్లలను బందీలను చేశారు. పుస్తకాలను బట్టీ పట్టించడం తప్ప మరోటి వారికి తెలియకుండా చేస్తున్నారు. క్రీడా పోటీలలో పాల్గొన్న విద్యార్థులు ఏక కాలంలో చదువులపై, ఆటలపై దృష్టి సారించలేరు. అటువంటి విద్యార్థులకు ఉన్నత చదువులలో రిజర్వేషన్ సౌకర్యం ఉండాలి. ఉద్యోగాలలో రిజర్వేషన్ల వల్ల క్రీడాకారులకు భవిష్యత్ ఉపాధికి హామీ ఉంటే క్రీడల్లో తమ పిల్లల్ని ప్రోత్స హించే తల్లిదండ్రుల సంఖ్య క్రమంగా పెరగడానికి అవకాశాలు ఉంటాయి. నిజామబాద్ నుంచి సౌమ్య ఫుట్‌బాల్‌కు ఎన్నిక కావడం ఆనందించదగ్గ విషయం. అలాగే మాలావత్ పూర్ణ అంతర్జాతీయంగా పర్వతారోహకులుగా పేఎన్నిక గనడం స్ఫూర్తిదాయకం. ఇలాంటి వారికి ప్రభుత్వ ప్రోత్సాహం కూడా దోహదపడింది. క్రీడా రిజర్వేషన్లను అమలు చేయాలని నిర్ణయించడం ద్వారా వారిలో ప్రోత్సాహాన్ని నింపాలి. దొంగ సర్టిఫికెట్లకు అవకాశం లేకుండా నిజమైన క్రీడాకారులకు రిజర్వేషన్ల ఫలాలు దక్కేలా అన్ని శాఖలు సమిష్టి కృషి చెయ్యాలి. ఈ ఫలితాలు పొందిన క్రీడాకారులు భావి క్రీడాకారులను ప్రోత్సహించాలి.విద్యా ఉద్యోగాల్లో క్రీడాకారులకు రెండు శాతం రిజర్వేషన్లను వర్తింప చేస్తే మరింత మంచి ఫలితాన్ని రాబట్టగలం. ఇది క్రీడాభివృద్ధికి దోహదం చేస్తుందని విద్యారంగ నిపుణులు సైతం అభినందిస్తున్నారు. ఇది ఓ రకంగా క్రీడాకారులకు ఎంతో మేలు చేసే నిర్ణయంగా చూడాలి. దీంతో తమకు ఉద్యోగాలు దక్కగలవన్న భరోసా వారిలో ఏర్పడుతుంది. తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తరువాత పలు సందర్భాల్లో క్రీడారంగ రిజర్వేషన్లపై అనేక విజ్ఞప్తులు వచ్చాయి. ఇలా అన్ని రంగాల్లో విద్యార్థులు విజయాలు సాధించేలా మన విద్యారంగాన్ని తీర్చిదిద్దుకోవాలి.

# సత్వర న్యాయం లక్ష్యం కావాలి !

మన న్యాయవ్యవస్థ ఇంకా బ్రిటిష్ కాలంనాటి పరిస్థితులకు అనుగుణంగానే సాగుతోంది. న్యాయ వ్యవస్థతో పాటు చట్టాలు, శిక్షల్లో భారతీయీకరణ జరగాల్సి ఉంది. ఇటీవల మన ఐపిసి స్థానంలో కొత్త చట్టాలు ప్రవేశ పెట్టిన దరిమిలా దీనిపై చర్చ చేయాలి. ఎందుకంటే పెరుగుతున్న నేరాలు, కొత్తకొత్త మోసాలు, ఐటి మోసాలు, అత్యాచారాలు వంటి వాటిని పరిశీలించి చట్టాలను మార్పు చేసుకోవాల్సి ఉంది. అంబేద్కర్ మహాశయుడి ఆలోచనలకు అందని విధంగా మన రాజకీయాలు మారుతున్నాయి. సామాన్యులకు న్యాయం అందకుండా పోతోంది. నిరంతరం రాజకీయ కేసులు తప్ప సామాన్యుల పక్షాన న్యాయవ్యవస్థ బలంగా నిలబడడం లేదు. నేటికీ ఎందరో చేయని నేరాలకు జైళ్లలో మగ్గుతున్నారు. ఇలాంటి వారిని ఎలా బయటకు తీసకుని వస్తారన్నది కూడా ముఖ్యం. అలాగే ఎలాంటి కేసునైనా కనీసం 3నెలల్లో ముగించి తీర్పును ఇచ్చేలా కఠిన చట్టాలను అమలు చేయాలి. ఇటీవల తెలంగాణలో పలువురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడింది. దీనిపై కొందరు సుప్రీంను ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. నిజానికి ఎన్నికలయిన ఓ నెలరోజుల్లో గా ఎన్నికైన ప్రజాప్రతినిధులపై ఏవైనా కేసులు ఉంటే తేల్చేయాలి. ఏళ్లతరబడి కేసునలు నాన్చేయడం వల్ల ఐదేళ్ల పుణ్యకాలం గడిచిపోతోంది. చిట్టచివరకు ఎన్నికల ముందు తీర్పులు వ్యతిరేకంగా వచ్చినా చేయగలిగేది ఏమీ లేదు. కనుక వీటిపైనా దృష్టి సారించాల్సి ఉంది. న్యాయవ్యవస్థలో సమూల మార్పులు జరగాలని గుర్తు చేసుకోవాలి. ప్రధానంగా స్థానిక భాషల్లో కోర్టు కార్యకలాలపాలు సాగాలి. కోర్టుల్లో న్యాయ చర్చలను స్థానిక భాషల్లో చర్చించేలా చట్టం చేసుకోవాలి. గతంలో ప్రధాని మోడీ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. కాబట్టి ఇప్పుడీ విషయంపై చర్చించాల్సిన అవసరం ఉంది. ప్రజలకు అర్థంకాని భాషలో కాకుండా ప్రజలకు అర్థం అయ్యే భాషలో న్యాయచర్చలు సాగాలి. కోర్టుతీర్పులు స్థానిక భాషల్లో విడుదల చేయాలి. పాలకులు పేదలకు న్యాయన్ని చేరువ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలి. అనేక సంస్కరణలు తీసుకుని వచ్చామని చెబుతున్న ప్రధాని మోడీ ఈ న్యాయవ్యవస్థలో ఉన్న లోటుపాట్లను గుర్తించి తక్షణ చర్యలకు పూనుకోవాలి. పార్లమెంట్ వేదికగా దీనికి శాశ్వత పరిష్కారం చూపాలి. ఇప్పటివరకు పనిచేసిన న్యాయమూర్తులు ఆయా సందర్భాల్లో తమ విలువైన సూచనలు చేశారు. వాటిని సలహాలుగా తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగాలి. ప్రజలకు ఏంచేస్తే సత్వర న్యాయం అందుతుందో ఆలోచించాలి. అవసరమైతే మాజీ ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తుల సలహాలు తీసుకోవాలి. ప్రతిపేదవాడికి న్యాయం అందించడమే న్యాయమూర్తి ప్రధాన లక్ష్యం కావాలి. దేశంలో న్యాయం పట్ల జరుగుతున్న ఆలస్యాన్ని గుర్తించి సత్వర న్యాయం అందేందుకు అసవరమైన చర్యలను చేపట్టాలి. నిర్ణిత కాలంలోగా న్యాయ విచారణలు, తీర్పులు వచ్చేలా నట్టబద్దం చేసుకోవాలి. ఇదే సందర్భంలో పెండింగ్ కేసులు సమస్యగా మారాయని కూడా గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలి. ప్రతి తీర్పులోనూ ప్రజలకు న్యాయం జరిగిందన్న భావన కలగించాలి. రాజకీయ నాయకుల కేసుల విషయలంఓ త్వరగా విచారణ జరిపి శిక్షలు వేస్తే మంచిది. కోర్టు తీర్పులను అమలు చేయని ప్రభుత్వాలపై కఠిన చర్యలకు అవకాశం ఉండాలి. ఇటీవల పలువురు సుప్రీం చీఫ్ జస్టిస్‌లుగా పనిచేసిన వారు న్యాయవ్యవస్థలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇవన్నీ కూడా పేదలకు సత్వర న్యాయం అందాలన్న తపనతో చేసినవే తప్ప మరోటి కాదు. భారత న్యాయ వ్యవస్థ సాధారణ ప్రజలకు ఎంతో దూరంలో నిలిచిందన్న ఆరోపణల్లో వాస్తవాలను గుర్తించాలి. ఇప్పటికీ కోట్ల మంది అణగారిన వర్గాల ప్రజలకు న్యాయ సహాయం అవసరం ఉంది. తమకు అన్యాయం జరిగిందని భావించిన ప్రతి వారూ కోర్టులకు వెళ్లడం లేదు.

# అభివృద్ధి అన్నది..ఓ అందమైన అబద్ధం !

గతంలో భారత్ వెలిగి పోతోతందంటూ బిజెపి నేతృత్వంలోని అటల్ ప్రధానిగా ఎన్‌డిఎ ప్రభుత్వం ఊదర గొట్టింది. ఆ తరవాత ఎన్నికల్లో బిజెపి ఓటమి పాలయ్యింది. తరవాత పదేళ్ల పాటు యూపిఎ పాలన అంతా కుంభకోణాలమయంగా మారింది. వారూ ఓటమి చెందారు. తరవాత 2014లో మరోమారు బిజెపి అధికారం లోకి వచ్చింది. ఇప్పుడు పదేళ్లుగా మోడీ నేతృత్వంలోని బిజెపి పాలన సాగుతోంది. గత 20 ఏళ్ల కాలానికి పోలిస్తే దేశంలో అభివృద్ధి అన్నది ఎండమావిగానే గుర్తించాలి. భారత్ వెలిగిపోలేదు..దేశం అభివృద్ధిలో ముందుకు సాగడం లేదు. సామాన్యులు బతకడమెలా అన్నది ఆలోచించడం లేదు. సామాన్యుడు తనకుతానుగా బతకగలిగినప్పుడే నిజమైన అభివృద్ధికి గీటురాయిగా చూడాలి. వచ్చే ఐదేళ్లలో భారత్ అద్భుతమైన ప్రగతి సాధించబోతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొనడం చూస్తే..దేశం మరో ఐదేళ్లపాటు వేచి చూడాలన్నమాట. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడ మే లక్ష్యంగా పనిచేస్తున్నామన్న మాటలన్నీ డొల్లగా చూడాల్సిందే. అప్పటికి వందేళ్ల స్వాతంత్ర్య భారతం అవుతుంది. గత పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం అని నిర్మలా సీతారామన్ చెప్పారు. అలాగే 80 కోట్ల మందికి ఉచిత రేషన్ అందిస్తున్నామని చెప్పారు. నిజానికి అభివృద్ధి జరిగివుంటే ఈ దుస్థితి ఎందుకని ప్రశ్నించుకోవాలి. ప్రజలు తిండిగింజలను కొనుక్కునే పరిస్థితిలో లేరని చెప్పకనే చెప్పారు. పేద మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కాల ఎండమావిగా మారింది. పేదలు, మహిళలు, యువకులు, రైతులపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదు. అంతెందుకు జిఎస్టీ అన్నది ప్రజల రక్తామాంసాలను పీల్చి పిప్పి చేస్తోంది. జిఎస్టీ వసూళ్లు నెలకు లక్షా 40 వేల కోట్ల వసూళ్లను చూసి అభివృద్ధి అనుకుంటున్నారు. కానీ అదంతా ప్రజలను జలగల్లా పీల్చి వసూలు చేస్తున్న డబ్బుగా చూడడం లేదు. ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు కట్టలేని దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సంస్కరణలు ఫలితాలిస్తాయని ఆశించారు. దేశ ప్రజలు భవిష్యత్‌పై ఆశతో ఉన్నారు. పేదలకు ఉచిత రేషన్ ఇస్తున్నామంటేనే..ప్రజల కొనుగోలు శక్తి లేకుండా పోయిందని గుర్తించడం లేదు. దాదాపు 80 కోట్ల మంది దీని వల్ల లబ్ది పొందారని గర్వంగా చెప్పుకోవడం సిగ్గుచేటు.. రైతులకు కనీస మద్దతు ధరలు అన్నవి రావడం లేదు. కానీ బియ్యం, ఉప్పు,పప్పుల ధరలు మాత్రం ఏటికేడు ఆకాశాన్ని అంటుతున్నాయి. అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం అని వివరించడం అందంగా మోసగించడం తప్ప మరోటి కాదు. దేశంలో ఎన్నో సమస్యలు పరిష్కరించడం వేరు..కానీ పేదలు, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వం అండలేకుండానే జీవించగలగాలి. కానీ ఈ పదేళ్లలో అలాంటి అవకాశాలు లేకుండా చేశాయి.

సామాన్యులు ఇల్లు కొనుక్కునే పరిస్థితి లేదు. బ్యాంక్ వడ్డీ రేట్లు దారుణంగా ఉన్నాయి. భూములు, సిమెంట్, స్టీలు ధరలను అడ్డం పెట్టుకుని బిల్డర్లు దోపిడీ చేస్తున్నారు. హైదరాబాద్ లాంటి నగరంలో కోటిన్నర లేనిదే ఓ అపార్ట్‌మెంట్ రావడం లేదంటే ఇది అభివృద్ధి అవుతుందా.. లేక సామాన్యులకు ఇల్లు అందుబాటులో లేకపోవడమా అన్నది ఆలోచన చేయాలి. ఇందులో జిఎస్టీ పదినుంచి 12 లక్షలు, రిజస్ట్రేషన్‌కు ఓ పది లక్షలు కట్టాలంటే ఎంత భారం పడుతుందో ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. బడ్జెట్ పద్దులు ప్రజలను ఆదుకునేలా ఉండాలి. అందమైన ఎసి గదుల్లో కూర్చుని ఆలోచిస్తే ఎన్నటికీ అంటే 2047 నాటికి కూడా ప్రజల బతుకులు బాగుపడవని గుర్తించాలి. సామాజిక న్యాయం కేవలం రాజకీయ నినాదంగా మాత్రమే ఉండేదని,కానీ, మేం దాన్ని అమలు చేసి చూపుతున్నాం. సామాజిక రుగ్మతగా మారిన వ్యవస్థీకృత అసమానతలను రూపుమాపుతున్నాం అన్న పదాలు వినడానికి బాగానే ఉంటాయి. గత పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక గుణాత్మక మార్పులు వచ్చాయని చంకలు గుద్దుకోవడంతో సరిపుచ్చితే మార్పు రాదు. పీఎం ఫసల్ బీమా యోజన కింద నాలుగు కోట్ల మంది రైతులకు పంట బీమా సాయం అందుతోందని బడ్జెట్‌లో చెప్పారు. నిజానికి దేశంలో ఎక్కడ ఎలాంటి పంటలు పండుతున్నాయి. వాటికి ఎంత ఖర్చవుతుంది. రైతులు ఏంకోరుకుంటున్నారన్న చర్చ చేయడం లేదు. వ్యవసాయ చట్టాలు ఎత్తేశాక వాటి గురించి చర్చించడం లేదు. పన్ను వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ట్యాక్స్ చెల్లింపుదారుల సంఖ్య పెరిగింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల పొదుపులు, పెట్టుబడులకు భద్రత ఏర్పడిందంటున్నారు. నిజానికి ఇదొక్కటే దేశాన్ని, ప్రజలను అగాధం లోకి నెట్టుతోందని ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చిందన్న మాటలు శుద్ధ అబద్ధం. ఆర్థిక వ్యవస్థ బలోపేతమై ప్రజలకు ఉపాధి లభించేలా ప్రజా ప్రయోజనాల కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు రూపొందించాల్సి ఉంది. బ్యాంకులను సంస్కరించాల్సిన అవసరం ఉంది. అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్‌ను రూపొందించడం జరిగిందన్న విషయంలో అబద్దాలను అందంగా చెప్పారు. 2014కు ముందు దేశం అనేక సవాళ్లను ఎదుర్కొందన్న ఆర్థిక మంత్రి.. ఇప్పుడు పరిస్థితులు చక్కబడ్డాయని చెప్పడం మోసం చేయడం తప్ప మరోటి కాదు. పేదల అభివృద్ధే దేశ అభివృద్ధి. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందంటే వారు బాగుపడ్డ దాఖలాలు కనబడాలి. 80 కోట్ల మందికి ఫ్రీ రేషన్‌తో ఆహార సమస్య తీరిందని పేర్కొనడంతోనే దేశం ఏ మేరకు అభివృద్ధి చెందిందో అర్థం చేసుకోవచ్చు. గ్రామీణ ప్రజల ఆర్థిక వికాసం సాధ్యం అవుతోందని చెప్పకుండా ఉంటే బాగుండేది. కోట్లాది మంది రైతులకు నేరుగా నగదు బదిలీ చేస్తున్నామంటేనే వారికి తగిన గిట్టుబాటు ధరలు, వ్యవసాయ పనిముట్లు అందడం లేదని అర్థం చేసుకోవాలి. ఇన్ని సమస్యలను చర్చించకుండా బడ్జెట్‌లో అంతా బాగుందని చెప్పడం ద్వారా భారత్ వెలిగిపోతోందని అంటే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరని గుర్తించాలి.

# ఆర్థిక వ్యవస్థపై కార్పొరేట్ ప్రభావం

- కుదేలవుతున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థ
- మాంద్యం నుంచి ఒడ్డున పడే చర్యలు శూన్యం

**న్యూఢిల్లీ :** పాలకుల తీరు కారణంగా దేశంలో ధనిక, పేద వ్యత్యాసం బాగా పెరిగిపోయింది. ఆర్థిక మాంద్యం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, కుల, మత, వర్ణ వివక్ష తీవ్ర రూపం దాల్చాయి. కేవలం కొన్ని కుటుంబాలే సంపద ఫలాలు అనుభవిస్తున్నాయి. మోడీ సర్కార్ వచ్చాక ఆయన తీసుకున్న నిర్ణయాలు కేవలం ధనికవర్గాలకే మేలు చేశాయి. మోదీ ప్రభుత్వం దేశాన్ని విపత్తులోకి నెట్టేసింది. కార్పొరేట్ శక్తుల అనుకూల, ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తోంది. నోట్ల రద్దు మొదలుకుని జీఎస్టీ వల్ల సామాన్య ప్రజల్లో కష్టాల్లో మగ్గుతున్నారు. నల్లధనాన్ని వెలికితీస్తానన్న మోదీ.. ఆ దిశగా చర్యలేవీ చేపట్టలేదు. మహిళలు, దళితులు, మైనారిటీలపై వందల సంఖ్యలో దాడులు పెరిగిపోయాయి. నిరుద్యో గాన్ని నిర్మూలించడంలో మోదీ విఫలమయ్యారు. ఫలితంగా రెండేళ్లలో దేశంలో 3.5శాతం మేర నిరుద్యో గం పెరిగింది. భాజపా ప్రభుత్వం పూర్తిగా నియంతృత్వ ధోరణిని అవలంబిస్తోంది. ఈ ప్రభుత్వ వైఖరితో ప్రజాస్వామ్య ఉనికికే ప్రమాదం ఏర్పడింది. రైతులు, కార్మికులు, మహిళలు, మైనారిటీలు, యువత.. ఇలా అన్ని వర్గాల్లోనూ అసంతృప్తి నెలకొంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తంగానే ఆర్థికమాంద్యం దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ఉన్న ద్రవ్యోల్బణానికి విరుగుడుగా ఆర్థికమాంద్యాన్ని ప్రయోగిస్తున్నారు. ఇటువంటి పరిస్థితిలో ఎగుమతులు పెరగడం మాట అటుంచి తగ్గే ప్రమాదం ఉంది. ఇక గృహాల, భూముల మార్కెట్ విలువలను కృత్రిమంగా పెంచడం ద్వారా మన దేశంలో అంతగా ఫలితాన్ని సాధించడం లేదు. ఒక చిన్న సామాజిక తరగతిని మరింత ధనవంతులుగా చేయడానికి మాత్రమే అది తోడ్పడుతుంది. మొత్తంగా చూస్తే మన దేశ ఆర్థిక వృద్ధి అనేది పెరుగుతుందని ఆశించడానికి ఏ కారణమూ కనిపించడం లేదు. పైగా అది తగ్గుముఖం పడుతోందని చెప్పడానికి తగిన కారణాలు ఉన్నాయి. పెట్టుబడుల వృద్ధి రేటు తగ్గుతోంది. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్న నేపథ్యంలో వినిమయం తగ్గుతోంది. ఐఎంఎఫ్ కూడా ప్రైవేటు వ్యక్తుల వినిమయంగాని, పెట్టుబడులు గాని పెరగని కారణంగానే భారతదేశ ఆర్థికవృద్ధి తగ్గుముఖం పట్టనున్నట్టు చెప్తోంది. ఇంత తేడా ఉన్నప్పుడు ప్రభుత్వ వ్యయం పెంచడం ద్వారా దానిని అధిగమించగలిగే పరిస్థితి ఎటుతిరిగీ లేనే లేదు.ఇన్ని పరిమితులు ఉన్నప్పటికీ ప్రభుత్వం తాను ఏయే పద్దుల మీద ఖర్చు చేస్తోందో ఆ ఖర్చు కేటాయింపులను మార్చితే మన ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని ప్రేరేపించే అవకాశాలు ఉన్నాయి.సరుకుల ఉత్పత్తి ప్రధానంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో జరుగుతుంది. ఆ పరిశ్రమలకు మిగిలే లాభాలు చాలా తక్కువగా ఉంటాయి. అంతేగాక, ఆ చిన్న పరిశ్రమల యజమానులు తమ వద్దకు వచ్చిన సొమ్మును మళ్ళీ పెట్టుబడి రూపంలోనో, ఖర్చు రూపంలోనో మార్కెట్ లోకి మరోసారి పంపిస్తారు. ఆ విధంగా శ్రామిక ప్రజలకు నేరుగా అందేలా ప్రభుత్వం ఖర్చు చేస్తే అది రెండు, మూడింతలు మార్కెట్ లో వినిమయం జరగడానికి, అంటే డిమాండ్ పెరగడానికి దోహదపడుతుంది. అదే మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తే అప్పుడు ఆ ఖర్చులో ఎక్కువ భాగం దిగుమతుల కోసం గాని, ప్రాజెక్టులు చేపట్టిన కార్పొరేట్ల దగ్గర మిగులు రూపంలో గాని ఉండిపోతుంది. మార్కెట్ లోకి ఎక్కువ భాగం రావడం అనేది ఉండదు. అందువలన మార్కెట్ లో డిమాండ్ పెరగడానికి అంతగా దోహదపడదు. ఈ క్రమంలో దేశీయ ఆర్థిక విధానం అవసరం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు అవసరమైన చర్యలకు ఉపక్రమించాలి.

# రాజీకాయాల్లో రాణించిన నటులు అరుదు !






సినీపరిశ్రమ నుంచి రాజకీయాల్లోకి వచ్చి..అధికారం చేపట్టి, ప్రజల్లో ప్రభావం చూపిన వారు చాలా తక్కువ మందే ఉన్నారు. తమిళనాట ఎంజి రామచంద్రన్ ఇలా ప్రజల మనిషిగా నిలబడ్డారు. తరవాత జయలలిత కూడా అదేకోవలో ప్రజల్లో చిరస్థాయిగా నిలిచారు. చిత్రపరిశ్రమ నుంచే వచ్చిన కరుణానిధి కూడా తమిళ నాట ప్రభావం చూపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీ రామారావు కూడా రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. తనకంటూ ఓ స్థానం ఏర్పరచుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చిరంజీవి కూడా ప్రజాప్రస్థానం పెట్టి తరవాత దానిని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. కేంద్రమంత్రిగా కూడా పనిచేశారు. ఇప్పుడాయన తమ్ముడు పవన్ కళ్యాణ్ కూడా జనసేనతో ఎపిలో దూసుకుపోతున్నారు. అయితే ప్రజల్లో విపరీతమైన ప్రభావం చూపగలిగిన వారు చాలా తక్కువమందే ఉన్నారు. ప్రముఖ తమిళ నటుడు విజయ్ రాజకీయాల్లో ప్రవేశిస్తున్నట్లు శుక్రవారం ప్రకటించడంతో మరోసారి రాజకీయ సినిమా రంగం సంబంధాల అంశం తెరపైకి వచ్చింది. రాజకీయ పార్టీ స్థాపించిన మొదటి నటుడు విజయ్ కాదని, అలాగే ఆయనే చివరి వాడు కాదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావును రాజకీయాల్లో అత్యంత రాణించిన నటుడుగా చెప్పుకోవాలి. ఎన్‌టి రామారావు 1982 మార్చి 29న తెలుగుదేశం పార్టీని స్థాపించారు. తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి రావడంతోపాటు వినూత్న సంస్కరణలను తీసుకొచ్చి చరిత్రలో చెరగని ముద్ర వేశారు. సినీ ప్రముఖులు రాజకీయాల్లోకి రావడ మనేది కొత్తేమీ కాదు. ఎందుకంటే సినిమాలకు, రాజకీయాలకు మధ్య అవినాభావ సంబంధం ఉంది. భారతీయ చిత్ర పరిశ్రమలో అనేక మంది నటులు రాజకీయరంగ ప్రవేశం చేసి, ప్రజాసేవ చేశారు. ముఖ్యంగా దక్షిణాదిలో ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. వెండితెరను ఏలిన చాలామంది కథానాయకులు, తర్వాతి కాలంలో రాజకీయాల్లో నాయకు లుగా ఓ వెలుగు వెలిగారు. వారిలో కొందరు సొంతంగా రాజకీయ పార్టీని స్థాపించి ప్రజల్లోకి వెళ్తే, మరి కొందరు ఇతర పార్టీలలో చేరి రాణించారు. మన దేశంలో అత్యధికంగా తమిళనాడు రాజకీయాల్లోనే సినీ తారల పాత్ర ఎక్కువగా ఉంటుంది. ఇప్పుడు తాజాగా కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ కొత్త పార్టీ ప్రకటించ డంతో మరోసారి ఈ అంశం చర్చకు వచ్చింది. అన్నాదొరై, ఎంజీఆర్, జయలలిత, కరుణానిధి, నుంచి కమల్ హాసన్, విజయ్ వరకూ.. రాజకీయాల్లోకి వచ్చిన తమిళ నటులు కొందరే తమ ప్రభావం చూపారు. కంజీవరం నటరాజన్ అన్నాదురై.. స్వతంత్ర భారత దేశంలో కొన్ని తమిళ సినిమాల్లో హీరోగా నటించ డంతో పాటు స్టోరీ, స్క్రీన్ ప్లే రైటర్‌గా కూడా వర్క్ చేశారు. పెరియార్ ఇ.వి.రామస్వామికి అనుయాయిగా పేరున్న ఆయన, ద్రవిడ కళగం పార్టీలో ఉన్నత స్థానానికి ఎదిగారు. ప్రత్యేక ద్రవిడ రాష్ట్ర ఉద్యమానికి, రాజకీయాలకు సినిమాలని వాడుకున్నారు. అయితే పెరియార్‌తో తలెత్తిన అభిప్రాయాభేదాల కారణంగా బయటకి వచ్చి, 1949లో 'ద్రవిడ మున్నేట్ర కళగం' (డిఎంకె) పార్టీని స్థాపించారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి చివరి ముఖ్యమంత్రిగా, తమిళనాడు రాష్ట్రానికి మొట్ట మొదటి ముఖ్యమంత్రిగా అన్నాదొరై చరిత్రకెక్కారు. నడిగర్ తిలకం' శివాజీ గణేశన్ గురించి ప్రత్యేక పరిచయాలు అవసరం లేదు. డీఎంకే పార్టీలో చేరిన శివాజీ.. అప్పట్లో తిరుపతి ఆలయాన్ని సందర్శించడంపై విమర్శలు రావడంతో బయటకు వచ్చి, తమిళ నేషనల్ పార్టీలో చేరారు. ఇందిరాగాంధీ హయాంలో ఆయన రాజ్యసభ సభ్యునిగా చేశారు. 1988–1989 కాలంలో సొంతంగా తమిళగ మున్నేట్ర మున్నాని అనే రాజకీయ పార్టీని స్థాపించారు. తమిళ సినీ రాజకీయాల్లో అత్యంత ప్రజాదరణ పొందిన వ్యక్తి మరుదూర్ గోపాలన్ రామచంద్రన్. 1953 వరకు కాంగ్రెస్‌లో ఉన్న ఎంజీఆర్, అన్నాదొరై స్ఫూర్తితో డీఎంకేలో చేరారు. అయితే కరుణానిధి డీఎంకే నాయకత్వ బాధ్యతలు చేపట్టి సీఎం అయిన తర్వాత ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడినందుకు ఎంజీఆర్‌ను బహిష్కరించారు. ఆ తర్వాత అఖిల భారత అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం ఎఐడిఎంకె పార్టీని స్థాపించారు. 1977 – 1987 మధ్య కాలంలో రెండుసార్లు తమిళనాడు ముఖ్యమంత్రిగా చేసి, మరణించే వరకు ఆ పదవిలో ఉన్నారు. మరణానంతరం ఆయనకు భారతదేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న లభించింది. ఎంజీఆర్ సతీమణి జానకి రామచంద్రన్ కొన్ని అనివార్య పరిస్థితుల్లో ఎంజిఆర్ మరణం తరవాత సిఎం అయ్యారు. తరవాత ఐఎడిఎంకె ప్రధాన కార్యదర్శిగా పురట్చి తలైవి జయలలిత తమిళ రాజకీయాల్లో పెను సంచలనమనే చెప్పాలి. అన్నాడీఎంకే కు ఏకైక నాయకురాలిగా ఎదిగారు. 1991 – 2016 మధ్య కాలంలో జయలలిత ఆరుసార్లు తమిళనాడు ముఖ్యమంత్రిగా పనిచేశారు. కొన్నేళ్ల పాటు సినీ అభిమానులను అలరించిన కెప్టెన్ విజయ్ కాంత్, 2005లో దేశీయ ముర్పోక్కు ద్రవిడ కజగం అనే పార్టీని స్థాపించారు. 2011 నుంచి 2016 వరకు ప్రతిపక్ష నేతగా కూడా పనిచేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తమిళ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారు కానీ, తన పార్టీని అధికారం లోకి తీసుకురాలేకపోయారు. విజయకాంత్ గత డిసెంబర్‌లో కన్నుమూశారు. సీనియర్ నటుడు శరత్ కుమార్ సైతం రాజకీయాల్లో ప్రవేశించారు. 2007లో తమిళనాడులో ఆల్ ఇండియా సమతువ మక్కల్ కట్చి అనే సొంత పార్టీని స్థాపించాడు. రాజకీయవేత్త కె. కామరాజ్ విలువలను పాటిస్తామని ప్రకటించుకున్నాడు. ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచి శాసనసభలో అడుగుపెట్టారు. గత కొన్ని దశాబ్దాలుగా సినీ అభిమానులను అలరిస్తున్న విశ్వ నటుడు కమల్ హాసన్.. రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నించి విఫలం అయ్యారు. సీనియర్ నటి ఖుష్బు గత 14 ఏళ్లుగా తమిళనాడు రాజకీయాల్లో ఉన్నారు. 2010లో డీఎంకేలో పార్టీలో చేరి, నాలుగేళ్లలోనే కాంగ్రెస్‌లోకి వచ్చి చేరారు. ఆ తర్వాత 2020లో బీజేపీలో చేరి, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా ఉన్నారు. మరో సీనియర్ నటి గౌతమి సైతం పాలిటిక్స్ లోకి వచ్చారు. 1997 నుంచి భారతీయ జనతా పార్టీలో కొనసాగుతున్నారు. దివంగత కరుణానిధి మనవడు, ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తనయుడు ఉదయనిధి స్టాలిన్ కూడా రాజకీయాల్లో ఉన్నారు. గత ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం చేసి డీఎంకే పార్టీ భారీ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. ఎంఎల్ఏగా గెలిచి తమిళనాడు శాసనసనలో అడుగుపెట్టారు. కోలీవుడ్ స్టార్ హీరోల్లో ఒకరైన దళపతి విజయ్ కూడా ఇప్పుడు పాలిటిక్స్ లో ఎంట్రీ ఇచ్చారు. ఎన్నో ఏళ్లుగా ప్రచారంలో ఉన్న వార్తలను నిజం చేస్తూ, ఫిబ్రవరి 2న 'తమిళగ వెట్రి కళగం' అనే పేరుతో సొంత రాజకీయ పార్టీని ప్రకటించారు. ఇకపోతే రాధా రవి, సీమాన్, టి. రాజేందర్, తంబి రామస్వామి, కరుణాస్, ఎంఆర్ కృష్ణన్ వంటి పలువురు సినీ ప్రముఖులు కూడా రాజకీయాలలో ఉన్నారు. సూపర్ స్టార్ రజనీకాంత్ కూడా పాలిటిక్స్ లోకి రావాలని భావించారు. అయితే తన ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని చివరి నిమిషంలో తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు.

## మామిడి రైతులు సలహాలు తీసుకోవాలి

**సంగారెడ్డి :** మామిడి సాగు చేసిన, సాగుచేసే రైతులు ఉద్యానశాఖ అధికారులు ఇచ్చే సూచనలుసద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం మంచుతో పూత దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ముందస్తుగా సంరక్షణ చర్యలు చేపడితే దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని తెలిపారు. రబీ పంటల బీమా కోసం ప్రీమియం చెల్లించడంలో జిల్లా అన్నదాతలు పెద్దగా స్పందించడం లేదు. ఇప్పటి వరకు ముందుకు వచ్చిన రైతుల సంఖ్య తక్కువగా ఉంది. గతంతో పోలిస్తే రుణాలు తీసుకోని రైతులు ఆసక్తి కనపర చలేదు. దేశ వ్యాప్తంగా కూడా రబీ పంటలు సాగు చేసి రుణాలు తీసుకోని రైతులు ప్రీమియం చెల్లించేందుకు ముందుకు రాని వారి సంఖ్య ఎక్కువగా ఉంది. రబీ కాలంలో జిల్లా వ్యాప్తంగా బోరు బావులు, బావులు, కాలువల కింద ప్రధానంగా వేరుసెనగ, వరి, మినుము, నువ్వులు, పొద్దు తిరుగుడు, పసుపు, వర్షాధారం కింద జొన్న, తదితర పంటలతో పాటు ప్రధానంగా పేరుకు రబీ అయినా వర్షాధారం కింద అన్ని పంటల కంటే ఎక్కువగా శనగ సాగు చేశారు.



# ప్రత్యర్థులు లక్ష్యంగా రాజకీయ వేధింపులు

## ఇడి విచారణలపై విపక్ష నేతల ఆందోళన

**న్యూఢిల్లీ :** రాజకీయ ప్రత్యర్థులను వేధించడమే లక్ష్యంగా మోడీ సర్కారు కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడానికి బరితెగిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. తమకు అనుకూలంగా ఉన్నవారిని ఒక రకంగా లేనివారిని మరో రకంగా చూస్తున్నారు. తాజాగా టిడిపి నేత వర్ల రామయ్య జగన్ విషయంలో చేసిన ఆరోపణలపై బిజెపి నేతలు స్పందించడం లేదు. జగన్ లోపాయకారిగా బిఇజెపికి అనుకూలంగా ఉన్నాడని విమర్శలు ఉన్నాయి. తెలంగాణలో కూడా కెసిఆర్ అనుకూలంగా ఉన్నందువల్లే ఆయనపైనా ఈగ వాలనీయలేదని అంటుఎన్నారు. ఈ విషయమై ఎన్ని విమర్శలు చేసినా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో నామమాత్రపు మార్పు కూడా కనిపించడంలేదు. ప్రతిపక్షాలన్నీ కలిసి మూకుమ్మడిగా అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. అయినా.. ఇడి, సిబిఐ వంటి సంస్థలను తమ జేబు సంస్థలుగానే మోడీ ప్రభుత్వం భావిస్తోంది. ప్రతిపక్షనేతలను నయానో, భయానో లొంగదీసుకోవడానికి, అలా లొంగని వారిని కేసులతో వేధించడానికి ఆ సంస్థలను దుర్వినియోగపరుస్తున్న తీరుపై రాజకీయ పార్టీలో ఆందోళన చెందుతున్నాయి. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను ఇడి అధికారులు ఏడు గంటలకు పైగా ప్రశ్నించి, అరెస్ట్ చేయడం బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీయాదవ్‌ను లక్ష్యంగా చేసుకోవడం దర్యాప్తు సంస్థల దుర్వినియోగానికి తాజా నిదర్శనం. బిజెపి నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా గట్టిగా పోరాడుతున్నందునే ఇడి వీరిని లక్ష్యంగా చేసుకుంది. బీహార్లో మహాకూటమి ప్రభుత్వం నుండి నితీష్ కుమార్ వైదొలిగి బిజెపి పంచన చేరిన మరుసటి రోజే ఇడి విచారణ ప్రక్రియ ప్రారంభం కావడం గమనార్హం. సిబిఐ నమోదు చేసిన కేసు ఆధారంగా తేజస్వీ తండ్రి, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌కు కూడా ఇటీవలే ఇడి నోటీసులు జారీ చేసింది. బిజెపి, ఆర్ఎస్ఎస్‌లకు వ్యతిరేకంగా దశాబ్దాల తరబడి లాలూ సాగిస్తున్న పోరాటం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దేశ రాజధాని ఢిల్లీలోనూ ఇదే స్థితి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆప్ అధ్యక్షుడు కేజ్రీవాల్‌తో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఇడి బాధితులుగా మారడానికి కారకులెవరో అందరికీ తెలిసిందే. ప్రత్యేకహోదా కోసం నిలదీసినందుకు ఇడి తనను వేధిస్తోందంటూ గుంటూరు ఎంపి గల్లా జయదేవ్ ఏకంగా రాజకీయాలకు గుడ్‌బై చెప్పడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇలా చెప్పుకుంటూ పోతే బిజెపి దుర్నీతికి, దుర్వినియోగానికి ఉదాహరణాలెన్నో! 2014వ సంవత్సరంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి గత ఏడాది జనవరి వరకు దేశ వ్యాప్తంగా 121 మంది రాజకీయ నేతలపై ఇడి కేసులు పెట్టి విచారణ చేపట్టింది. వీరిలో 115 మంది అంటే 95 శాతం మంది ప్రత్యర్థి రాజకీయ పార్టీలకు చెంది, బిజెపిని గట్టిగా వ్యతిరేకించేవారే కావడం గమనార్హం. ఇలా కేసులు నమోదైన వారు బిజెపిలో చేరితే వెంటనే వారిపై నమోదైన కేసులను ఎత్తివేయడం, వారిలో కొందరికి ప్రభుత్వ పదవులను సైతం కట్టబెట్టడం మోడీ సర్కారు బరితెగింపునకు మరో నిదర్శనం. మరోవైపు ఇడి కేసుల్లో నేరం రుజువై శిక్షపడినవి చాలా తక్కువ. అధికారిక లెక్కల ప్రకారం 2011 నుండి ఇడి 1600 కేసులు నమోదు చేసి, 1800 దాడులను ఇడి నిర్వహించింది. అయితే, నేరం రుజువై శిక్ష పడింది మాత్రం కేవలం 10 మందికి మాత్రమే! గడిచిన 18 ఏళ్లలో ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్ఏ) కింద 5,422 మందిపై ఇడి కేసులు పెట్టి దర్యాప్తు చేయగా, 23మందికి మాత్రమే శిక్ష పడింది. ఇది కేవలం 0.5శాతం మాత్రమే! అయినా, భయపడుతున్నారంటే ఇతర దర్యాప్తు సంస్థలకు లేని ప్రత్యేక అధికారాలు ఇడి కి ఉండటమే కారణం. ముఖ్యంగా న్యాయస్థానాల అనుమతి లేకుండానే ఆస్తులు జప్తు చేసే అధికారం ఒక సారి కేసు నమోదైతే నేరం చేయలేదని రుజువు చేసుకునే బాధ్యత నిందితునిపైనే మోపడం వంటి అధికారాలను ఇ.డి కి అప్పగించారు. ప్రస్తుత పార్లమెంటులోని ప్రతిపక్ష సభ్యుల్లో దాదాపు 90 శాతం మంది ఏదో ఒక కేంద్ర దర్యాప్తు సంస్థ నిఘానీడలో ఉన్నట్లు ఇటీవల విడుదలైన ఒక నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలోనే తమిళనాడు, పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలు ఇడి దాడులను అడ్డుకోవడంతో పాటు, ఆ సంస్థ సిబ్బందిపై కేసులు నమోదు చేశాయి. తాజాగా జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ కూడా ఇడి అధికారులు తన ప్రతిష్టను దెబ్బతీస్తున్నారంటూ కేసు దాఖలు చేశారు. తీవ్ర స్థాయిలో జరుగుతున్న ఈ అధికార దుర్వినియోగాన్ని అరికట్టి, దర్యాప్తు సంస్థల నిష్పాక్షికతపై ప్రజానీకంలో తిరిగి నమ్మకం కలిగించాల్సి ఉంది. దీనిపై ఉమ్మడిగా పోరాడాల్సి ఉందని సిపిఎం నేత సీతారాం ఏచూరి అభిప్రాయపడ్డారు.

# జనం కోసం పనిచేసే వారికే జనబలం !

జనగళం మేమే..జనబలం మేమే. గులాబీదళం..పార్లమెంటులో ఉండాల్సిందే.. ఓటమి తరవాత ఇప్పుడు గులాబీ దళానికి ప్రజలు గుర్తుకు వస్తున్నారు. ప్రజలకు మేమే అండ అని చాటుకోవాలని తపన పడుతు న్నారు. అయినా అహంకారం వీడినట్లుగా కానరావడం లేదు. తమ తప్పుల వల్లనే ఓటమి చెందా మని యువరాజావారు భావించడం లేదు. చేసిన తప్పులపై సమీక్ష చేసుకుని ఉంటే బాగుండేది. కానీ కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వంపై అప్పుడే నిందలు వేసే పనిలోపడ్డారు. నిలదీసే చర్యలకు పూనుకుంటున్నారు. మేడిగడ్డ అక్రమాలపై చీమకుట్టినట్లు లేదు. విద్యుత్ అప్పులపైనా నిజాలు చెప్పడం లేదు. అప్పుల చిట్టా విప్పితే ఆస్తులు సంపాదించి పెట్టామని గొప్పలు చెబుతున్నారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేకనానా తిప్పలు పెట్టారు. 20 ఏళ్లనాటి జర్నలిస్టుల భూ సమస్యను పరిష్కరించలేదు. సుప్రీం తీర్పు ఇచ్చినా ఖాతరు చేయలేదు. రైతుబంధు లాంటి పథకాలతో వేలకోట్లు దుర్వినియోగం చేశారు. దళితబంధులోనూ అదే జరిగింది. వీటిపై విచారణ జరపాలన్న డిమాండ్‌ను సిఎం రేవంత్ రెడ్డి పట్టించుకుంటారా లేదా అన్నది చూడాలి. ఇకపోతే కాలేశ్వరంపై సిబిఐ విచారణ చేయించాలని సన్నాయి నొక్కులు నొక్కుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బిజెపి నేతల తీరు కెసిఆర్‌ను రక్షించే ఎత్తుగడ తప్ప మరోటి కాదు. సిబిఐకి అప్పగిస్తే.. ఏం జరుగుతుందో తెలియంది కాదు. అందువల్ల పదేళ్ల పాపాలపై రాష్ట్రంలోనే విచారణ జరగాలి. ఇన్ని పాపాలు చేసి..ఓడిపోయాక కూడా ఆత్మపరిశీలన చేసుకోకుండా అహంకారం ప్రదర్శించే నేతలు అవసరమా అన్నది ప్రజలు ఆలోచన చేయాలి. అలాగే ఇలాంటి వారు మన నాయకులని చెప్పుకోవడానికి సిగ్గుపడాలి. సమీక్షల పేరుతో ఇప్పుడు పార్లమెంటులో అడుగు పెట్టడం ఎలా అని ఆలోచన చేస్తున్నారు. ఆధునిక రాజకీయాల్లో రాటుదేలడమన్నది అంత సులువు కాదు..ప్రజల ఆదరణ పొందడం అన్నదీ మరీ అంత సులవూ కాదు...ప్రజల నాడి తెలుసుకోవాలి. ప్రజల్లో ఆదరణ పొందాలి. ఓట్ల కోసం కాదు..జనం కోసం ఆరాటపడే తపన అన్నది ఎంతమందిలో ఉంటుంది. ప్రజలంతా పార్టీలకు అతీతంగా తమ నాయకు డు ఫలానా అని చెప్పగలిగిన వారు ఎంతమంది ఉంటారు..? అలా ప్రజల గుండెల్లో గూడుకుట్టు కుంటే అంతకుమించిన అదృష్టం ఉంటుందా..? అలా ఎంతమంది చేస్తారు..ఎంతమంది జనం నాడి పడతారు... ఎంతమంది జనం గుండెచప్పుడు అవుతారు...అలా జనం గెండెచప్పుడుగా మారుతారు. ఇవీన్ని ఉన్నాయని నమ్మి తెలంగాణ ఉద్యమంలో ప్రజలంతా కెసిఆర్‌ను తమ నాయకుడిగా గుర్తించి తలపైకి ఎత్తుకున్నారు. తెలంగాణ యావత్ సమాజం కూడా కెసిఆర్ వెంటే నడిచారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత కూడా రెండుసార్లు అధికారం కట్టబెట్టారు. కానీ జరిగిందేమిటి..?ప్రజలతో నాకు పనిలేదన్నారు. సిఎంను కలవాల్సిన అవసరం ప్రజలకు ఏమిటని ప్రశ్నించారు. నేనే తెలంగాణ తెచ్చానని తలపొగరు ప్రదర్శించారు. నిస్వార్థ రాజకీయాలను ఔపోసన పట్టే వారు ఎంతమంది...? ప్రజలతో ఓట్లు వేయించుకుని..వారిని దూరం పెట్టి..ఎన్నికల ముందు వంగివంగి సలామ్ కొట్టే ఈ రోజుల్లో అరుదైన నేతలూ ఉన్నారు. అలాంటి వారిలో ఒడిశా సిఎం నవీన్ పట్నాయక్ ముందుంటారు. జనం గుండె చప్పుడుగా మారుతున్నారు. వారి కాలుకు ముల్లు గుచ్చుకుంటే తీయలేకపోవచ్చు..కానీ వారికి నేనున్నాననే ధైర్యం..భరోసా ఇవ్వగలిగే నాయకుల్లో తప్పుకుండా ఉండేవారు అరుదుగా కనిపిస్తారు. అలాంటి వారిలో చప్పున చెప్పుకునే నేత నవీన్ పట్నాయక్. అంతెందుకు మనదగ్గర ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కూడా అలాంటి వారి కోవలోకే వస్తారు. కానీ ధరణిలో ఆయన భూమి కూడా ఆగమయ్యిందని తెలిసాక...కెసిఆర్ హయాంలో జరిగిన అకృత్యాలు తలచుకుంటేనే బాధేస్తోంది. ప్రజల సమస్యలను ఏనాడూ పట్టించుకోలేదు.

తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం
సోమవారం 3-3-2025



# ఉపాధిపై సమన్వయ లోపం !



**హైదరాబాద్ :** గ్రామీణ ఆర్థికాభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు లేకుండానే కేంద్ర,రాష్ట్రాల పాలన సాగుతోంది. గ్రామాలను పరిపుష్టం చేసే ప్రయత్నాలు చేయడం లేదు. గ్రామాల్లో ఉపాధి, ఉద్యోగాల కల్పన అన్నది జరగడం లేదు. దీంతో పట్టణాలకు వలసలు పెరుగుతున్నాయి. అయినా దీనిని పట్టించుకోవడం లేదు. వ్యవసాయాధారిత పనులకు కూలీల కొరత ఏర్పడుతోంది. నీరుగారుతున్న ఉపాధిహామీ పథకం ప్రగతి వైపు పరుగెత్తేలా చేస్తేనే.. గ్రామాల్లో అభివృద్ధి సాకారం కానుంది. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో నిధులకు కోత విధించారు. మొత్తంగా దీనిని ఎత్తి వేస్తారన్న ప్రచారం సాగుతోంది. ఉపాధికి నిధులు తగ్గించడంపై అన్నిపార్టీల వారు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఉపాధిని మరింత పటిష్టంగా అమలు చేసి గ్రామాల అభివృద్ధి దోహద పడాల్సి ఉంది. దీంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం కాగలదు. గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే ఆస్తులను సృష్టించడానికి నిధులను ఉపయోగించాల్సి ఉంది. అన్ని గ్రామాలకు కచ్చితంగా బీటీరోడ్లు ఉండేలా రహదారుల వ్యవస్థను నిర్మించాలి. గ్రామాల్లో జరుగుతున్న పనులను అధికారులు ఎప్పటికప్పుడు ఆకస్మికంగా తనిఖీ చేయాలి. పనులు జరుగుతున్నాయా లేదా అన్నది సమీక్షించాలి. నిధులు దుర్వినియోగం కాకాకుండా ప్రతి పైసా సద్వినియోగం అయ్యేలా చూసుకో వాలి. ఇలా చేస్తూ పోతే కొంతకాలానికైనా అభివృద్ధి కళ్లకు కనిపి స్తుందనడంలో సందేహం లేదు. ఓ పక్క గ్రామాల్లో కూలీ దొరక్క అల్లాడుతున్న పేదలకు నిరాశను మిగిలిస్తోంది. కూలీ దొరకడం లేదని కూలీలు అంటున్నారు. కూలీలు దొరక్క అవస్థలు పడుతున్నామని రైతులు అంటున్నారు. గ్రామాల్లో ప్రజలు కూడా ఇదే బాధను వ్యక్తం చేస్తున్నారు. మరి వీరంతా ఏమవుతున్నారు. ఎక్కడ లోపం ఉంది. ఎక్కడ సమన్వయం లోపించింది. అన్నదే అంతుచిక్కని వ్యవహారంగా ఉంది. ప్రధానంగా కేంద్ర,రాష్ట్రాల మధ్య సమన్వయం కుదరడం లేదు. పనుల విషయంలో ప్రణాళికలు లేవు. వేలాది కోట్లు ఉపాధిహామీలో వెచ్చిస్తున్నా బూడిదలో పోసిన పన్నీరులా తయార య్యింది. గ్రామాల్లో పనులు దొరక్క..చేతిలో డబ్బులు లేక.. నిత్యావసర సరకులు కొనలేక ఇబ్బందులు పడుతున్న అనేకమంది పేదలకు పనులు కల్పించి ఆర్థిక భరోసా అందించాలనే ఉద్దేశంతో కేందప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రారంభంలో కొన్ని పనులకే పరిమితమైన ఈ పథకం.. 52రకాల పనులకు ఈ పథకాన్ని వర్తింపజేసింది. గ్రామాల్లో నీటి సంరక్షణ కోసం చేపడుతున్న పనులు, వ్యవసాయ బావుల నిర్మాణం, ఇంకుడుగుంతలు, మట్టికట్టలు, బావుల పూడికతీత, నాడేపు కంపోస్టు, వర్మీకంపోస్టు నిర్మాణాలు, వంట గదులు, పాఠశాలల మరుగుదొడ్లు, శ్మశానవాటికలు తదితర వాటిని చేపట్టాల్సి ఉంది. పనులు చాలా ఉన్నప్పటికీ.. వాటిని చేయించడంలో గ్రామీణ స్థాయిలో సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తు న్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దశాబ్దంన్నర దాటినా ఇంతకాలం ఉపాధి పనులను చూస్తే బూడిదలో పోసిన పన్నీరుగా మారుతోంది. ఉపాధి హామీని గ్రామాల అభివృద్ధికి ఉపయోగించుకునే వెసలుబాటు ఉండాలి. ఆస్తులను సృష్టించేలా కార్యక్రమాలు ఉండాలి. నిధులను సంపూర్ణంగా వినియోగిం చుకునేలా ఉండాలి. అలాగే ఆయా రాష్ట్రాల సలహాలు తీసుకుని..వారి స్వేచ్ఛమేరకు ఉపాధి పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. గ్రామాల్లో హరితహారం, వైకుంఠ ధామాలు, చెరువుల పునరుద్దరణ, గ్రామీణ రోడ్లు, పేదలకు ఇంటి నిర్మాణాలు, కాలువల నిర్మాణాలు,రైతులకు కల్లాల నిర్మాణం ..ఇలా అనేకానేక పనులను గుర్తించాలి. ముందుగా రాష్ట్రాలను సంప్రదించడం ద్వారా ఏయే పనులు చేపట్టవచ్చో కేంద్రం రాష్ట్రాల నుంచి సమాచారం తెప్పించుకోవాలి. సర్పంచ్‌లకు శిక్షణ ఇవ్వడం ద్వారా దీనిని గ్రామాల అభవృద్ధికి మూలకేంద్రం చేయాల్సి ఉంది.. వారంతా ఉపాధి పథకం,నిధులు, వినియోగంపై తెలుసుకుని తమ గ్రామాలను అభివృద్ధి చేసుకునే ప్రణాళికలు సిద్ధం చేయాలి. అప్పుడే గ్రామాల్లో అభివృద్ధి పట్టాలకు ఎక్కుతుంది. నరేగా నిధులతోపాటు రాష్ట్ర బడ్జెట్ నిధులు, ఎంపీ, ఎమ్మెల్యేల నియోజకవర్గ అభివృద్ధి నిధులు కూడా ఉపయోగించుకొని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి. నరేగా పథకం కింద కేంద్రం రాష్ట్రానికి ఎంత మొత్తంలో డబ్బులు ఇస్తుందో అంతే మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా చేయాలి. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలోనే నరేగా పనులు జరుగాలి. హరితహారం, శ్మశానవాటికల నిర్మాణం, గ్రామీణ రోడ్లు, రైతులకు కల్లాలు,చెరువుల పునరుద్దరణ వంటివన్నీ నిర్మాణం చేయాలి. ప్రతి గ్రామంలో మొక్కలు నాటి, రక్షించాలి. గుంతలు తవ్వడానికి, నీళ్లు పోయడానికి, ఇతరత్రా పనులకు ఉపాధి నిధులను పూర్తిగా వినియోగించుకోవాలి. అటవీశాఖ అధికారుల సలహాలు, సాంకేతిక సహకారంతో గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. మొక్కలు పెట్టడం, వాటిని రక్షించడం లాంటి బాధ్యతలు గ్రామపంచాయతీలు చేపట్టాలన్న సూచనలు సర్పంచ్‌లకు స్ఫూర్తి కావాలి.ఎందరో తమ గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందారు. వారందరికి నిధులకు ఇబ్బంది లేకుండా ఉపాధి జోడింపు కావాలి. ఇకపోతే రహదారులు లేని గ్రామాలు అనేకం ఉన్నాయి. విద్యుత్ లేని గ్రామాలు ఉన్నాయి. అలాంటి గ్రామాల సర్పంచ్‌లు చొరవ తీసుకుని ముందుకు సాగాలి. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలకు కచ్చితంగా బీటీ రోడ్లు ఉండాలని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి. దరిమిలా వీరంతా తమ గ్రామాలకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. వీటికోసం వెంటనే ప్రతిపాదనలు తయారుచేసి, పనులు ప్రారంభించేలా కార్యక్రమాలు రూపొందాలి. అప్పుడే గ్రామీణ నిరుపేదలకు కూలీ కల్పించడంతో పాటు ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన ఉపాధిహామీ పథకం లక్ష్యం నెరవేరగలదు. ఇంతకాలం సిబ్బంది నిర్లక్ష్యం.. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేమితో ఉపాధి పథకం నీరుగారి పోతోంది. దీంతో పాటు ప్రభుత్వం నుంచి ఉపాధిహామీ డబ్బులు సైతం సకాలంలో రాకపోవడంతో కూలీలు ఈ పనులకు వెళ్లేందుకు అనాసక్తి చూపుతున్నట్లు సమాచారం.

# పౌరసరఫరాల అక్రమాలపై దృష్టి

## బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు



**హైదరాబాద్:** ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు సరఫరా చేస్తున్న నిత్యావసర సరకుల అక్రమ రవాణాకు అడుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలతో పటిష్టంగా వ్యవహరిస్తున్నారు. బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలకు ఉపక్రమించారు. వివిధ స్థాయిల్లో కొనసాగుతున్న అక్రమ దందాకు చెక్‌పెట్టేందుకు ఐదు బృందాలతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. పలు అవినీతి అరోపణలను ఎదుర్కొంటున్న పౌరసరఫరాల శాఖ పనితీరును మెరుగుపరచడంతో పాటు ఆ వ్యవస్థను పటిష్టం చేసేందుకు ఈ సారి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేశారు. ధాన్యం సేకరణలో రైతుకు కనీస మద్దతు ధర, సీఎంఆర్ పథకం కింద బియ్యానికి మెరుగుపెట్టడం, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలు, ఇతర పథకాలకు పౌరసరఫరాల సంస్థ రైసుమిల్లర్ల నుంచి సన్నబియ్యం కొనుగోలు చేస్తోంది. ఏటా సుమారు రూ. 10 వేల కోట్లకు పైగా వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్న శాఖలో అధికారులు, సిబ్బంది కొరతతో పాటు నిర్లక్ష్యంతో వందల కోట్ల రూపాయల సరకులు పక్కదారి పడుతున్నాయి. సరకులను పక్కదారి పట్టిస్తున్న అక్రమదారులను గుర్తించినా స్థానిక అధికారులు వారిపై చర్యలు తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీంతో యథేచ్ఛగా జరుగుతున్న అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా బృందాన్ని ఏర్పాటు చేసింది. పౌరసరఫరాల సంస్థ బోర్డు సమావేశంలో ప్రత్యేక నిఘా బృందాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఐదు బృందాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఏర్పాటు చేస్తూ పౌరసరఫరాల శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రైసుమిల్లుల యాజమానులు, బియ్యం రవాణా గుత్తేదార్లు, చౌక ధరల దుకాణ డీలర్ల అక్రమాలను అరికట్టడమేగాక నాణ్యమైన సరకులను సరఫరా చేయడం కోసం విశ్రాంత పోలీసు అధికారులతో సహా వాణిజ్యపన్నుల శాఖ, రెవెన్యూ శాఖలకు చెందిన 20 మంది సభ్యులతో పౌరసరఫరాల శాఖ ఐదు బృందాలుగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం పౌరసరఫరాల శాఖకు సంబంధించిన అధికారులు అక్కడక్కడ దాడులు నిర్వహించినప్పటికి పూర్తిస్థాయిలో అక్రమ రవాణా అరికట్టలేక పోతున్నారు. పౌర సరఫరాల విభాగంలో వివిధ స్థాయిలో వాటి పనితీరుపై తనిఖీలు నిర్వహిస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ గోదాంలను నిరంతరం పరిశీలిస్తారు. మొదటి దశ, రెండో దశ, రవాణా తనిఖీలు చేస్తారు. ఈ బృందాలు రాష్ట్ర వ్యాప్తంగా వారికి కేటాయించిన ప్రాంతాల్లో పర్యటిస్తూ అక్రమ రవాణాదారులపై కేసునమోదు చేయనున్నారు. సమాచారాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ, కలెక్టర్, ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తారు. వీటి ఆధారంగా ఆక్రమణదారులపై కలెక్టర్ చర్య తీసుకుంటారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకున్నా మార్పు రాకుండా అలాగే రవాణా చేస్తే పీడీ యాక్టు కింద కఠిన చర్యలు చేపడతారు. అవసరమైతే రైసుమిల్లర్స్, రవాణా గుత్తేదారులపై చర్యలు తీసుకుంటారు.

# అవినీతి నేతల పీచమణచాల్సిందే !

ఢిల్లీ లిక్కర్ కేసు చాలా నచిన్నది అంటూ ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యానించారు. కాళేశ్వరంలో అసలు అవినీతే జరగేలదని బిఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతున్నారు. ఎపిలో జగన్ అన్నిరంగాల్లో అవినీతికి తెరతీసారు. అయినా అవినీతికి తావులేకుండా అని మాట్లాడుతున్నారు. మిగతా రాష్ట్రాల సంగతి ఎలా ఉన్నా తెలుగు రాష్ట్రాల్లో అవినీతి తారాస్థాయికి చేరింది. అవినీతి జరిగిందని చెబుతున్న కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని బిజెపి నేతలు ఇంచుమాత్రం కూడా చర్యలకు సిద్దంగా లేరు. అవినీతి నేతలను కాపాడుతూ వస్తున్నారు. ఇదో రకమైన అవినీతిగానే గుర్తించాలి. మోడీ అవినీతి చర్యలన్నీ కక్షసాధింపు చర్యలుగానే ఉన్నాయి. తనకు అనుకూలంగా లేని పార్టీల నేతల అవినీతినే భూతద్దంలో చూస్తున్నారు. తెలంగాణలో కెసిఆర్ , ఆయన కుటుంబ అవినీతి, జగన్ అవినీతిని పట్టించుకోవడం లేదు. మొత్తంగా దేశంలో ఇప్పుడు అక్రమాలకు, అన్యాయాలకు పాల్పడుతున్నది కేవలం రాజకీయనేతలు మాత్రమే. వారే అవినీతిలో కూరుకుపోతున్నారు. అధికారం చేపట్టిన ఏడాదిలోనే రాజమందిరాలు నిర్మించుకోవడం, కోట్లు కూడబెట్టడం, అక్రమాలకు పాల్పడడం చూస్తున్నాం. ఇలా అక్రమ సంపాదనలో మునిగి తేలుతూ ఎన్నికల్లో డబ్బులు పెట్టి ఓట్లను కొల్లగొడుతూ అధికారం చేజారకుండా చూసుకుంటున్నారు. ఒకరని చెప్పడానికి లేదు. అన్నీ ఒకే తాను ముక్కలు. అక్రమాలపై నిలదీస్తే ..ఎదరుదాడి చేయడం అలవాటు చేసుకున్నారు. మోడీ అక్రమాల గురించి ఆధారాలు ఉంటే నిలదీయాల్సిందే. బిజెపి నేతల అక్రమాలు ఉన్నా నిలదీయాల్సిందే. సోషల్ మీడియా ప్రస్తుతం చురుకుగా ఉంది. చీమ చిటుక్కుమన్నా..కోడై కూస్తోంది. ఈ క్రమంలో ఎవరి అక్రమాలను వేలెత్తి చూపినా..వాటి నుంచి బయటపడేందుకు విచారణలను ఎదర్కోవాలి. కడిగిన ముత్యంలా బయట పడాలి. అంతేగానీ ఇడి,సిబిఐ,ఐటిలను తిడుతూ..అధికార పార్టీ బిజెపిపై దండెత్తడం ద్వారా లేదా, ఎదురుదాడి విమర్శలు చేయడం ద్వారా ఎవరు కూడా తమ అక్రమాలను కప్పి పుచ్చుకోవడం కుదరదు. గతేడాది కర్నాటకలో ఓ బిజెపి ఎమ్మెల్యే తనయుడు లక్షలు లంచంగా తీసుకుంటూ అడ్డంగా దొరికి పోయాడు. అక్కడ పర్సంటేజీ ప్రభుత్వం అన్న ప్రచారం రావడంతో ప్రజలు బిజెపిని ఓడించి వాతలు పెట్టారు. మీడియా ఏకి పారేసింది. బిజెపిని తూర్పారా బట్టింది. అలాగే ఎపి సిఎంగా ఉన్న జగన్ తన తండ్రి అధికారాన్ని అడ్డంగా పెట్టుకుని చేసిన అక్రమాలకు జైలులో ఉండివచ్చాడు. ఆ కేసులేమీ తొలగిపోలేదు. ఎప్పటికైనా విచారణ ఎదుర్కోవాల్సిందే. బెయిల్‌పై ఉంటూ పాలన చేస్తున్నారు. తెలంగాణలో కూడా కెసిఆర్ అవినీతి మర్రి ఊడలా పాకింది. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేశారు. వస్తున్న విమర్శలను పట్టించుకోలేదు. కేంద్రం కూడా చర్యలు తీసుకోలేదు. అందుకే ప్రజలు కెసిఆర్‌ను పక్కన పెట్టారు. అయినా ఇప్పటికీ మేకపోతు గాంభీర్యంతో కొత్తగా వచ్చిన ప్రభుత్వంపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇకపోతే లాలూ ప్రసాద్ యాదవ్, తృణమూల్ మంత్రులు, ఆప్ నేతలు అంతా కూడా అక్రమ సంపాదలో దొరికిన వారే. లిక్కర్ స్కామ్‌లో ఇంకా నేరం రుజువు కాలేదు. అయితే ఆరోపణలు మాత్రమే వస్తున్నాయి. ఈ క్రమంలో ఎమ్మెల్సీ కవితను విచారణకు పిలిస్తే తాను మహిళను అంటూ వాదిస్తున్నారు. సుప్రీంలో కేసు వేసి విచారణ నుంచి తప్పించుకోవాలని చూస్తున్నారు. అయినా సిబిఐ మరోమారు విచారించేందుకు రంగం సిద్దం చేశారు. అయినంత మాత్రాన ఇడినో, సిబిఐనో విమర్శించడం తగదు. ఇలాంటి చర్యలతో కేసీఆర్‌ను, బీఆర్‌ఎస్ పార్టీని లొంగ తీసుకోవడం కుదరదని బీజేపీ తెలుసుకోవాలంటూ కవిత చేసిన వ్యాఖ్యలు ఆమె అహంకారాన్ని బయటపెడుతున్నాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగాడుతూనే ఉంటామని ప్రకటించిన నేపథ్యంలో..దానిని వదులుకోమని ఎవరూ చెప్పడం లేదు. దేశ అభ్యున్నతి కోసం గొంతెత్తాల్సిందే. బిజెపి అవినీతిని కూడా ఎండగట్టాల్సిందే. అయితే తమ అవినీతి గురించి మాత్రం మాట్లాడవద్దంటే కుదరదని కవితమ్మ తెలుసుకోవాలి. తనపై వచ్చిన కేసులను తెలంగాణతో ముడిపెట్టి.. తెలంగాణ తలవంచబోదని చెప్పడంలో అహంకారం తప్ప అర్థం లేదు. తెలంగాణ యావత్తుకు కవిత ప్రతినిధి ఏమీ కాదు. తెలంగాణ తలవంచదు కనకనే పోరాటం చేసింది. అందుకే కెసిఆర్ అహంకారన్ని దించేసింది. కేసులు ఎదుర్కోవడం వేరు..అధికార బిజెపిని నిలదీయడం వేరు. ఈ రెండు విషయాలు వేర్వేరని కవిత గుర్తించాలి. అవినీతి కేసులో విచారణ వేరు..రాజకీయ పోరాటం వేరు. లిక్కర్ స్కామ్ బయటకు వచ్చినప్పుడే కవిత అరెస్ట్ తప్పదన్న సంకేతాలు వచ్చాయి. నిజానికి లిక్కర్ స్కామ్ విచారణకు ..విమర్శలకు పొంతన లేదు. ఈ విషయం బిఆర్‌ఎస్ నేతలు మరోలా మాట్లాడుతున్నారు. నిజానికి కవిత తనకు ఎలాంటి సంబంధంలేదని..కడిగిన ముత్యంలా వస్తే తప్పులేదు. ఆమెకు జనం బ్రహ్మరథం పడతారు. నిజానికి ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసు తెలుగు రాష్ట్రాలనే కాదు.. యావత్ దేశాన్నే కదిలిస్తోంది. ఇదే కేసులో ఏపీకి చెందిన వైఎస్ఆర్ సీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుమారుడు రాఘవరెడ్డి ఇప్పటికే అప్రూవర్‌గా మారారు. దీంతో ఏపీలో కూడా దీనిపై చర్చ సాగుతోంది. వైసీఆర్ సీపీ సైతం ఆచితూచి స్పందిస్తోంది.

# ఇసుక మేటలతో ఇబ్బందులు

## ఫలితంగా నీరు నిల్వలకు దెబ్బ




**కాకినాడ:** ప్రతి ఏడూ నదిలో డ్రెడ్జింగ్ పనులు జరక్కపోవడంతో ఇసుకమేటలు వేస్తున్నాయి. ఫలితంగా నీరు నిల్వలు ఉండట్లేదు. దీనికి తోడు ఎత్తిపోతల పథకాల నిర్వహణ కూడా సరిగా లేకపోవడంతో ఇవి అక్కరకు రాకుండా పోతున్నాయి. ప్రస్తుతం గోదావరిలో నీటి నిల్వలు అడుగంటడంతో రబీకి నీరు అందట్లేదు. అంగులూరు క్వారీకొండ వరకు వచ్చిన నది అక్కడి నుంచి రెండు పాయలుగా విడిపోయింది. ఎక్కువ భాగం పశ్చిమకు పోగా, మిగిలినది తూర్పు వైపున పారుతోంది. తొర్రిగడ్డ ఎత్తిపోతలు ఆ ప్రదేశంలోనే నిర్మించడంతో నదిలో నీటిమట్టం ఎప్పుడూ 14 మీటర్లకు తగ్గక నిరాటకంగా నీరు అందుతుందని అధికారులు తెలిపారు. ఉన్న పథకాలన్నింటిలో అక్కడే ఎక్కువ లోతు ఉందన్నారు. పుష్కర ఎత్తిపోతల పథకాల ద్వారా రబీలో మెట్టకు నీటి విడుదలకు అవకాశమే లేదు. ఒక ఏడాది రబీలో తొర్రిగడ్డ ఎత్తిపోతల ద్వారా మొక్కజొన్న పంటకు నీరివ్వని విషయం తెలిసిందే. ఇప్పుడు మెట్టకు పుష్కర 1,2 పథకాల ద్వారా నీరిచ్చే ప్రసక్తే లేదని యంత్రాంగం పేర్కొంది. కొత్తగా చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టు పనులు పూర్తి కావాలంటే ప్రస్తుతం పోలవరం, పుష్కర పథకాల కాల్వల్లో చుక్క నీరు ఉండకూడదు. ఉన్న నీటినే ఎక్కడికక్కడే తోడివేయాల్సి ఉంటుంది. వర్షాలు ఎక్కువగా ఉండటం, గోదావరికి వరదలు ఉండటంతో ఎత్తిపోతల పథకాల కిందకు నీరు అందుతుంది. అనంతరం నీటి నిల్వలు లేకపోవడంతో ఎత్తిపోతల పథకాలు పనికిరాకుండా ఉంటున్నారు. జనవరి నుంచి మే వరకు 8 పంపుసెట్లను ఓవరాయిలింగ్ చేసి మరమ్మతులు పూర్తి చేసి జూలైకు మెట్టకు నీరు విడుదల చేసే పనిలో ఉన్నామని అధికారులు వివరించారు.

## మహిళలపై అత్యాచారాలకు

# అడ్డుకట్ట ఏదీ?

### కఠిన చర్యలు తీసుకోవడంలో పాలకుల విఫలం



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను ఏటా జరుపుకుంటున్నా..వారి గురించి ఘనంగా చెప్పుకుంటున్నా దేశ వ్యాప్తంగా మహిళలు, పిల్లలపై అత్యాచారాలు, హింస బాగా పెరిగాయి. ప్రతిరోజూ దేశంలో ఏదో ఒక మూల మహిళలపై అత్యాచారం, హింస, దాడులు, హత్యలు జరుగుతు న్నాయి. ఇండ్ల దగ్గర నుంచి వసతి గృహాల వరకు ఆడపిల్లలను లైంగిక అవసరాలకు వాడుకొనే వికృత స్థితి వ్యాపించింది. అత్యాచారం, అక్రమ రవాణా, హత్యలు సాధారణ విషయాలైపోతున్నాయి. దేశంలో నెలకొన్న పరిస్థితులు మహిళలు, పిల్లల జీవితాలకు భద్రత లేకుండా చేస్తున్నాయి. దేశంలో మహిళలు, బాలికలు ముఖ్యంగా దళిత బాలికలపై అత్యాచారాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. వీటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. పని ప్రదేశాల్లో శ్రామిక మహిళలు వివక్ష, వేధింపులకు గురవుతు న్నారు. మహిళలకు సమాన హక్కులు, శ్రమకు గుర్తింపు, సమాన వేతనాలు, సమాన హక్కుల కోసం, మహిళలపై అత్యాచారాలు, హింసను అరికట్టడం, నేరస్థులకు కఠిన శిక్షలు అమలు చేయడంలో విఫలమైనందకు పాలకులు సిగ్గు పడాలి. మహిళలపై హింసకు పాల్పడ్డవారిని శిక్షించటానికి బదులు, ఇటువంటి ఆంక్షలతో మహిళలకే శిక్ష విధిస్తున్నారు. బేటీపడావో,..బేటీ బచావో నినాదాం వినడానికే పరిమితం అయ్యింది. మహిళా సాధికారత గురించి చెప్పడమే తప్ప అవకాశాలు రావడం లేదు. పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం వచ్చి ఐదేండ్లు దాటిపోయినా కనీసం ప్రభుత్వ రంగంలోనైనా ఈ చట్టం సరిగ్గా అమలు కాకపోవటం అన్యాయం. ఒకప్పుడు మహిళ అంటే వంటింటికే పరిమితమన్న భావన అందరిలోనూ ఉండేది. కానీ నేడు ఎందులోనూ తీసిపోమంటూ మహిళామణులు ముందుకు దూసుకెళ్తు న్నారు. పలురంగాల్లో ప్రతిభను కనబరుస్తూ అద్భుతాలు సృష్టిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు రాజకీయాల్లో రాణిస్తూ ప్రజాస్వామ్యానికి ప్రాణం పోస్తున్నారు. అయినా చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు తదితర సమస్యలకు పరిష్కారం కరువైంది. ఇంటి పని, వంట పని, గృహ నిర్వహణ, పెద్దల, పిల్లల, సంరక్షణ, నీళ్ళు, వంట చెరుకు తీసుకురావటం మొదలైన పనులతో మహిళలు రోజు మొత్తం శ్రమిస్తున్నారు. భారతదేశంలో మహిళలు తమ ఇల్లు, పిల్లలు, పెద్దల కోసం చేస్తున్న జీతభత్యంలేని శ్రమ విలువ కట్టలేం. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని రైతు, వ్యవసాయ, గ్రామీణ కార్మికకుటుంబాల్లోని స్త్రీలు వీటితో పాటు పశువుల పెంపకం, వ్యవసాయ పనులు కూడా చేస్తారు. మంచినీరు, వంటచెరకు, పిల్లలు, వృద్ధుల సంరక్షణా కేంద్రాలు, ఆరోగ్య వసతులు అందుబాటులో లేకపోవడంతో ఈ మొత్తం బాధ్యత, పనులు ఆడవారి మీదే పడుతున్నాయి. ఇన్ని బాధ్యతలు మోస్తున్నా వారిని మనం పనివస్తువుగా చూడడం సిగ్గుచేటు. రావటంతో వారి సమయం, శక్తి మొత్తం ఈ వేతనం లేని శ్రమకే వెచ్చిస్తున్నారు. ఇటువంటి వేతనంలేని సంరక్షణ పనుల కోసం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు రోజులో 5 గంటలకుపైగా వెచ్చిస్తున్నారు. వీటన్నిటితో పాటు పని ప్రదేశాలలో శ్రామిక మహిళలు వేతనాలు, సర్వీసు కండీషన్లు, గౌరవం, పదోన్నతుల విషయంలో తీవ్ర వివక్షకు, అవమానాలకు గురవుతున్నారు. పని భారం కారణంగా అత్యధిక మంది మహిళలు తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యోగాలు వదిలేస్తున్నారు. మన దేశంలో సగం మంది మహిళలలో అత్యధిక మంది సంరక్షణ, సేవ పనులు చేస్తున్నారు. ఆరోగ్య సంరక్షణ, అనుబంధ పౌష్టికాహారాన్ని అందించే అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు మొదలైన స్కీమ్ వర్కర్లను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించటం లేదు. ఇక అత్యాచార దోషులను శిక్షించడానికి బదులు దోషులతో మననేతలు అంటకాగుతున్నారు. చివరికి 3,4 ఏండ్ల పసిపిల్లలను కూడా వదలటంలేదు. ఆడవారు ఏ రకమైన బట్టలు ధరించాలి, ఎవరితో మాట్లాడాలి, ఎక్కడికి వెళ్లాలి అనే విషయాలపై ఆంక్షలు విధిస్తున్నారు. ఇంటిని చక్క దిద్దుకుంటునే ఉద్యోగ భాధ్యతలు నిర్వహిస్తోంది. పొలంలోనే కాదు.. సమస్యలపై పోరాటల్లోనూ అగ్రభాగాన నిలుస్తోంది. రంగం ఏదైతేనేమీ అన్నింటా తనదైన ముద్ర వేస్తోంది. ప్రస్తుత సమాజంలో రాజకీయాల్లోనూ మహిళలు రాణిస్తున్నారు. పొలిటికల్‌లో కీలకమైన పదవులను అలంకరిస్తూ శాసిస్తున్నారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు పోతూ అన్ని రంగాల్లో ఉనికి చాటుతున్నారు. అయితే ఇప్పటికీ మహిళల పట్ల వివక్ష కొనసాగుతూనే ఉంది.రోజురోజుకూ మహిళలపై వేధింపులు పెరిగిపోతున్నా మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయడం లేదు. తల్లి దండ్రులతో పాటు సమాజంలో ఆడ పిల్లలపై వివక్ష కొనసాగుతూనే ఉంది. ఈ వివక్షను పారద్రోలిన నాడే నిజమైన మహిళా దినోత్సవంగా గుర్తించాలి.

# బిఆర్ఎస్ లక్ష్యంగా కాంగ్రెస్, బిజెపిల రాజకీయం !



తెలంగాణలో అధికారం కోల్పోయిన బిఆర్ఎస్‌కు ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించడం అవసరం. ఇప్పుడున్న అంచనాల మేరకు ఒక్కసీటు కూడా రాదని అంటున్నారు. అయితే కనీసం ఓ నాలుగైదు ఎంపి సీట్లు గెలిస్తే తప్ప పార్టీ మనుగడ కష్టం. ఎందుకంటే ఇప్పటికే అనేకమంది బిఆర్ఎస్‌ను వీడి అధికార కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఎమ్మెల్యేలు జారుకుంటు న్నారు. ఎంపిలుగా నిలబెడదామను కున్న వారు వెళ్లిపోయారు. చివరికి కష్టపడి అభ్యర్థులను వెతుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎపిలో విపక్షంగా టిడిపి ఉన్నా బలంగా ఉంది. ఆ పార్టీ నుంచి టిక్కెట్ కోసం డిమాండ్ ఏర్పడింది. అధికార వైసిపికి కూడా టిక్కెట్ల డిమాండ్ ఉంది. అక్కడ వైసిపికి కూటమికి మధ్యన పోటాపోటీ ఉంది. కానీ తెలంగాణలో అలా లేదు. పోటీ కేవలం కాంగ్రెస్, బిజెపిల మధ్యనే ఉంది. ఈ రెండు పార్టీలు 15 సీట్లు లక్ష్యంగా పెట్టుకుని పోరాడుతున్నాయి. దీంతో విపక్ష బిఆర్ఎస లో పోటీ చేసేందుకు ఎవరు కూడా ముందుకు రావడం లేదు. పదేళ్లు అధికారంలో ఉన్న పార్టీ ఇంతగా ప్రజల్లో ఆదరణ కోల్పోవడం కేవలం బిఆర్ఎస్‌లో మాత్రమే కనిపిస్తోంది. ఈ క్రమంలో బిఆర్ఎస్ అత్యధిక ఎంపి సీట్లు గెలిస్తేనే.రాజకీయంగా నిలుస్తుంది. అందుకే మైండ్ గేమ్ ఆడుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా బీఆర్ఎస్ చతికిల బడటం, కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న ప్రచారం, ఎమ్మెల్సీ కవిత మద్యం కుంభకోణంలో జైలుకు వెళ్లడం, ముఖ్యనేతలు అనుకున్న వారంతా కారు దిగి హస్తం పార్టీలోకో, బీజేపీ గూటికో చేరడం వంటి పరిణామాలతో గులాబీ పార్టీ ఉక్కిరి బిక్కిరి అవుతోంది. దీంతో పార్టీ క్యాడర్లో జోష్ నింపేందుకు కేసీఆర్ రంగంలోకి దిగారు. రైతుల పార్టీ బీఆర్ఎస్ అని చెప్పేందుకు జిల్లా యాత్రలు చేపట్టారు. రైతులను పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీతోనే రైతులకు లాభం జరుగుతుందని యాత్ర ద్వారా చెప్పే ప్రయత్నం చేసినా ఫలితం కానరావడం లేదు. అందుకే కాంగ్రెస్ పార్టీ మనుగడ కష్టమని విమర్శలు చేస్తోంది. మాతో 20మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని బీరాలు పలుకుతుంది. అందుకే కెసిఆర్ తనముందున్న అన్ని అస్త్రాలను ఉపయోగి ంచాలని చూస్తున్నారు. అయితే ఇప్పుటి కిప్పుడు బిఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. అయిన పార్లమెంట్ ఎన్ని కల్లో కాంగ్రెస్, బీజేపీలతో పోటీగా బీఆర్ఎస్ గెలుపు కోసం తమ అస్త్ర శస్త్రాల సిద్ధం చేస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితా లను బేరీజు వేసు కుని పార్లమెంట్ ఎన్ని కల్లో సత్తా చాటేందుకు సిద్ధ మవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ గెలుపు అంతా సీఎం రేవంత్ రెడ్డి తన భుజాల మీద వేసుకుని 10-12 స్థానాలు గెలుచుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. మరో జాతీయ పార్టీ బీజేపీకి మళ్లీ మోదీ క్రేజ్ గెలుపు గుర్రమని భావిస్తోంది. గులాబీ పార్టీ గెలుపునకు మాజీ సీఎం ఆ పార్టీ అధినేత కేసీఆర్ రంగంలోకి దిగారు. ఈ మూడు పార్టీలు తమ తమ బలాబలాలను సమీకరించుకుని 17 ఎంపీ స్థానాల్లో మెజార్టీ స్థానాలు గెలవడానికి కృషి చేస్తున్నాయి. దీని కోసం అన్ని పార్టీలవైమైండ్ గేమ్ స్టార్ట్ చేశాయి. గెలుపు తమదేనంటూనే.. ప్రత్యర్థి పార్టీ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారంటూ వ్యాఖ్యలు చేస్తున్నాయి. ఈ ఎన్నికల తర్వాత ప్రభుత్వం కూలుతుందని ఓ పార్టీ అంటే, మరో పార్టీ ఈ ఎన్నికల తర్వాత కొన్ని పార్టీలు ఉనికి కోల్పోతాయని జోస్యం చెబుతోంది. అయితే ఈ మూడు పార్టీలు తమదైన శైలిలో మానసిక యుద్ధానికి తెర లేపాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 64 స్థానాలు గెల్చుకోగా, మిత్రపక్షం సీపీఐ ఒక స్థానంలో గెలిచింది. గ్రేటర్ హైదరాబాద్ మినహా ఉత్తర, దక్షిణ తెలంగాణలో మెజార్టీ అసెంబ్లీ సీట్లను కాంగ్రెస్ గెలుచుకుంది. ఈ లెక్కన దాదాపు 12 సీట్ల వరకు తాము గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ పరిపాలన, ఆరు గ్యారంటీల అమలు, రాహుల్ గాంధీ పాదయాత్ర, బీజేపీ వ్యతిరేక గాలి తమకు కలిసి వస్తుందన్నది హస్తం పార్టీ అంచనా. దీనికితోడు సిఎం రేవంత్‌రెడ్డి తీరుపై సానుకూల దృక్పథం రోజురోజుకూ బలపడుతోంది. అన్నింటికి మించి డొంక పాసలకు దూరంగా ఉంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో చెక్ పెట్టిన బీఆర్ఎస్ మళ్లీ కోలుకోకుండా ఉండేందుకు ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టింది. సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కింది స్థాయి బీఆర్ఎస్ క్యాడర్ లక్ష్యంగా ఈ ఆపరేషన్ సాగుతోంది. తెలంగాణలో తమ ప్రధాన ప్రత్యర్థి బీజేపీనే తప్ప బీఆర్ఎస్ కాదని నేతలు చెబుతున్నారు. బీజేపీ కూడా కాంగ్రెస్ తమ ప్రధాన ప్రత్యర్థిగా చెబుతోంది. అందుకే ఈ రెండు పార్టీలు బిఆర్ఎస్ లక్ష్యంగా విమర్శలకు పదును పెట్టాయి. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ దుకాణం బంద్ అవుతుందని, దాదాపు 25 మంది ఎమ్మెల్యేలు కారు దిగడం ఖాయమని ప్రచారం సాగుతోంది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ లో నలుగురు మాత్రమే ఉంటారని, మిగతా వారంతా బయటకు రావడం ఖాయమని గులాబీ నేతలను మానసికంగా కృంగదీసేలా మంత్రులు తమ వ్యాఖ్యలు ముమ్మరం చేస్తున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో 4 స్థానాల్లో మాత్రమే కమలం పార్టీ విజయం సాధించింది. రామాలయ నిర్మాణం, మోదీ హవాతో ఈ దఫా దక తిరిగి పది స్థానాలకుపైగా తెలంగాణలో దక్కించు కుంటామని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క ఎమ్మెల్యే మాత్రమే బీజేపీ నుంచి గెలిచారు. కాని 4 ఎంపీ స్థానాల్లో ఆదిలాబాద్,నిజామాబాద్, కరీంనగర్, సికింద్రాబాద్ లలో గెలిచి బీజేపీ సంచలనం సృష్టించింది. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తప్పనిసరిగా 10 స్థానాల వరకు గెలుస్తామని కమలం నేతలు చెబుతున్నారు. ఇప్పటికే ఆ పార్టీ కూడా ఆపరేషన్ ఆకర్ష్ స్టార్ట్ చేసి బీఆర్ఎస్, కాంగ్రెస్ అసంతృప్త నేతలను తమ పార్టీలో చేర్చుకుంది. బొటా బోటీ మెజార్టీతో ఉన్న కాంగ్రెస్, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అనుకున్న స్థానాల్లో గెలవకపోతే ప్రభుత్వ మనుగడ కష్టమేనని కమలం నేతలు చెబుతున్నారు. ఏది ఏమైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందా.. ఊడుతుందా అంటూ...పొలిటికల్ మైండ్ గేమ్‌తో అధికార కాంగ్రెస్‌ను డిఫెన్స్‌లోకి నెట్టేందుకు కమలం నేతలు కామెంట్స్ చేస్తున్నారు.

# అభివృద్ధి పేరుతో నయావంచన

**- ఉచిత రేషన్ ఇస్తూనే అభివృద్ధి జపం - పదేళ్లలో తీవ్రంగా ఆర్తిక ఇబ్బందులు**

**న్యూఢిల్లీ:** వికసిత భారత్ లక్ష్యంగా పదేళ్లుగా మోడీ నేతృత్వంలోని బిజెపి పాలన సాగుతోంది. గత 20 ఏళ్ల కాలానికి పోలిస్తే దేశంలో అభివృద్ధి అన్నది ఎండమావి అన్న విమర్శలు ఉన్నాయి. కార్పోరేట్లకే బిజెపి అనుకూలం అన్న ప్రచారం కూడా బలంగా ఉంది. పేదల అభివృద్దే దేశ అభివృద్ధి. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందంటే వారు బాగుపడ్డ దాఖలాలు కనబడాలి. 80 కోట్ల మందికి ఫ్రీ రేషన్‌తో ఆహార సమస్య తీరిందని పేర్కొనడంతోనే దేశం ఏ మేరకు అభివృద్ది చెందిందో అర్థం చేసుకోవచ్చు. గ్రామీణ ప్రజల ఆర్థిక వికాసం సాధ్యం అవుతోందని చెప్పకుండా ఉంటే బాగుండేది. కోట్లాది మంది రైతులకు నేరుగా నగదు బదిలీ చేస్తున్నామంటేనే వారికి తగిన గిట్టుబాటు ధరలు, వ్యవసాయ పనిముట్లు అందడం లేదని అర్థం చేసుకోవాలి. ఇన్ని సమస్యలను చర్చించకుండా బడ్జెట్‌లో అంతా బాగుందని చెప్పడం ద్వారా భారత్ వెలిగిపోతోందని అంటే నమ్మడానికి ప్రజలు సిద్దంగా లేరని గుర్తించాలి.అయితే పాలకులు సామాన్యులు బతకడమెలా అన్నది ఆలోచించడం లేదు. సామాన్యుడు తనకుతానుగా బతకగలిగినప్పుడే నిజమైన అభివృద్ధికి గీటురాయిగా చూడాలి. వచ్చే ఐదేళ్లలో భారత్ అద్భుతమైన ప్రగతి సాధించబోతుందని మోడీ సహా నేతలంతా పేర్కొనడం చూస్తే..దేశం మరో ఐదేళ్లపాటు వేచి చూడాలన్నమాట. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడ మే లక్ష్యంగా పనిచేస్తున్నామంటున్నారు. అప్పటికి వందేళ్ల స్వాతంత్ర్య భారతం అవుతుంది. గత పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం అని మోడీ చెప్పారు. అలాగే 80 కోట్ల మందికి ఉచిత రేషన్ అందిస్తున్నామని చెప్పారు. నిజానికి అభివృద్ధి జరిగివుంటే ఈ దుస్థితి ఎందుకని ప్రశ్నించుకోవాలి. ప్రజలు తిండిగింజలను కొనుక్కునే పరిస్థితిలో లేరని చెప్పకనే చెప్పారు. పేద మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కాల ఎండమావిగా మారింది. పేదలు, మహిళలు, యువకులు, రైతులపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదు. అంతెందుకు జిఎస్టీ అన్నది ప్రజల రక్తామాంసాలను పీల్చి పిప్పి చేస్తోంది. జిఎస్టీ వసూళ్లు నెలకు లక్షా 40 వేల కోట్ల వసూళ్లను చూసి అభివృద్ది అనుకుంటున్నారు. కానీ అదంతా ప్రజలను జలగల్లా పీల్చి వసూలు చేస్తున్న డబ్బుగా చూడడం లేదు. ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు కట్టలేని దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సంస్కరణలు ఫలితాలిస్తాయని ఆశించారు. దేశ ప్రజలు భవిష్యత్‌పై ఆశతో ఉన్నారు. పేదలకు ఉచిత రేషన్ ఇస్తున్నామంటేనే..ప్రజల కొనుగోలు శక్తి లేకుండా పోయిందని గుర్తించడం లేదు. దాదాపు 80 కోట్ల మంది దీని వల్ల లబ్ది పొందారని గర్వంగా చెప్పుకోవడం సిగ్గుచేటు.. రైతులకు కనీస మద్దతు ధరలు అన్నవి రావడం లేదు. కానీ బియ్యం, ఉప్పు,పప్పుల ధరలు మాత్రం ఏటికేడు ఆకాశాన్ని అంటుతున్నాయి. అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం అని వివరించడం అందంగా మోసగించడం తప్ప మరోటి కాదు. దేశంలో ఎన్నో సమస్యలు పరిష్కరించడం వేరు..కానీ పేదలు, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వం అండలేకుండానే జీవించగలగాలి. కానీ ఈ పదేళ్లలో అలాంటి అవకాశాలు లేకుండా చేశాయి. సామాన్యులు ఇల్లు కొనుక్కునే పరిస్థితి లేదు. బ్యాంక్ వడ్డీ రేట్లు దారుణంగా ఉన్నాయి. భూములు, సిమెంట్, స్టీలు ధరలను అడ్డం పెట్టుకుని బిల్డర్లు దోపిడీ చేస్తున్నారు. హైదరాబాద్ లాంటి నగరంలో కోటిన్నర లేనిదే ఓ అపార్ట్‌మెంట్ రావడం లేదంటే ఇది అభివృద్ధి అవుతుందా.. లేక సామాన్యులకు ఇల్లు అందుబాటులో లేకపోవడమా అన్నది ఆలోచన చేయాలి. ఇందులో జిఎస్టీ పదినుంచి 12 లక్షలు, రిజస్ట్రేషన్‌కు ఓ పది లక్షలు కట్టాలంటే ఎంత భారం పడుతుందో ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. బడ్జెట్ పద్దులు ప్రజలను ఆదుకునేలా ఉండాలి. అందమైన ఎసి గదుల్లో కూర్చుని ఆలోచిస్తే ఎన్నటికీ అంటే 2047 నాటికి కూడా ప్రజల బతుకులు బాగుపడవని గుర్తించాలి. సామాజిక న్యాయం కేవలం రాజకీయ నినాదంగా మాత్రమే ఉండేదని,కానీ, మేం దాన్ని అమలు చేసి చూపుతున్నాం. సామాజిక రుగ్మతగా మారిన వ్యవస్థీకృత అసమానతలను రూపుమాపుతున్నాం అన్న పదాలు వినడానికి బాగానే ఉంటాయి. గత పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక గుణాత్మక మార్పులు వచ్చాయని చంకలు గుద్దుకోవడంతో సరిపుచ్చితే మార్పు రాదు. పీఎం ఫసల్ బీమా యోజన కింద నాలుగు కోట్ల మంది రైతులకు పంట బీమా సాయం అందుతోందని బడ్జెట్‌లో చెప్పారు. నిజానికి దేశంలో ఎక్కడ ఎలాంటి పంటలు పండుతున్నాయి. వాటికి ఎంత ఖర్చవుతుంది. రైతులు ఏంకోరుకుంటున్నారన్న చర్చ చేయడం లేదు. వ్యవసాయ చట్టాలు ఎత్తేశాక వాటి గురించి చర్చించడం లేదు. పన్ను వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ట్యాక్స్ చెల్లింపుదారుల సంఖ్య పెరిగింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల పొదుపులు, పెట్టుబడులకు భద్రత ఏర్పడిందంటున్నారు. నిజానికి ఇదొక్కటే దేశాన్ని, ప్రజలను అగాధం లోకి నెట్టుతోందని ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చిందన్న మాటలు శుద్ద అబద్దం. ఆర్థిక వ్యవస్థ బలోపేతమై ప్రజలకు ఉపాధి లభించేలా ప్రజా ప్రయోజనాల కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు రూపొందించాల్సి ఉంది. బ్యాంకులను సంస్కరించాల్సిన అవసరం ఉంది. అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్‌ను రూపొందించడం జరిగిందన్న విషయంలో అబద్దాలను అందంగా చెప్పారు. 2014కు ముందు దేశం అనేక సవాళ్లను ఎదుర్కొందన్న ఆర్థిక మంత్రి.. ఇప్పుడు పరిస్థితులు చక్కబడ్డాయని చెప్పడం మోసం చేయడం తప్ప మరోటి కాదు.

# సెటిలర్ల ఓట్ల పేరిట రాజకీయ వ్యాపారం !

ఎపి విడిపోయిన తరవాత తెలంగాణలో ఆంధ్రా సెటిలర్లు కొంత ఆందోళనకు గురైన విషయం వాస్తవం. మిగతా రాష్ట్రాల ప్రజల్లో ఇలాంటి భయాందోళన ఎప్పుడూ లేదు. కానీ తెలంగాణ ఉద్యమ సమయం నుంచే ఆంధ్రా సెటిలర్లలో ఓ రకమైన ఆందోళన కొనసాగుతూ వచ్చింది. అయితే తెలంగాణ విడివడ్డాక ఈ పదేళ్లలో వారు ఏనాడు కూడా తాము సెటిలర్లమనే భావన వ్యక్త పరచలేదు. ఇతర ప్రాంతాల వారు ఇక్కడ స్థిరపడ్డట్లుగానే వారూ స్థిరపడ్డారు. వారు తెలంగాణలో భాగమైపోయారు. ఎంతగా అంటే ఉమ్మడి ఎపి కన్నా.. విడివడ్డ తెలంగాణలోనే వారు సంతోషంగాను..భయరహితంగానూ ఉన్నారు. హైదరాబాద్ తమదే అన్నంత బంధంతో వారు పెనవేసుకుని పోయారు. ఈ క్రమంలో ఇప్పుడు సెటిలర్లు అన్న పదానికి తెలంగాణలో అర్థం లేదు..అలాగే అలాంటి పదప్రయోగం కూడ ఎక్కడా జరగడం లేదు. ఓ రకంగా ప్రభుత్వం పరంగా కావచ్చు..రాజకీయపరంగా కావచ్చు..వారికి దక్కిన హామీగా చూడాలి. అలాగే వారు కూడా ఏనాడూ తాము విడిపోయామన్న బాధను కూడా ఎక్కడా వ్యక్త పరచడం లేదు. తమకు రెండు రాష్ట్రాలు ఒక్కటే అన్న భావనలో ఉన్నారు. ఇది కూడా ఓ మంచి పరిణమాంగా చూడాలి. ఈ క్రమంలో గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో వారు స్వేచ్ఛగా ఓటు వేశారు. ఇప్పుడు కూడా అలాంటి వాతావరణంలోనే ఉన్నారు. కానీ ఇటీవలి ఘటనలు మరోమారు వారిని ఆందోళనకు గురిచేసేవిగా మారాయి. చంద్రబాబు స్కిల్ స్కామ్ కేసులో అరెస్ట్ అయిన తరవాత వస్తున్న ఎన్నికలు కావడంతో కొందరు పనిగట్టుకుని వారి మనోభావం ఇది.. అన్న రీతిలో విశ్లేషణలు చేస్తున్నారు. కొన్ని పత్రికలు, మీడియా సంస్థలు పనిగట్టుకుని ఇలాంటి పిచ్చికూతలు కూస్తున్నాయి. నిజానికి వారు ఇలాంటి ఆలోచనలేవీ చేయడం లేదు. చంద్రబాబు అరెస్ట్‌కు ఓటింగ్‌కు లంకెపెట్టాలని అనుకోవడం లేదు. సాఫీగా సాగుతున్న వారి జీవితాల్లో కొందరు వంకరగా చూస్తున్న తీరే ఆందోళన కలిగిస్తోంది. విద్య, ఉద్యోగం, ఉపాధి, వ్యాపార అవసరాల నిమిత్తం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అటువారు ఇటు..ఇటు వారు అటు అన్నట్లుగా వెళ్లారు. ఆంధ్రాకు చెందిన లక్షలాది మంది తెలంగాణ రాష్ట్రంలో అనేక దశాబ్దాల క్రితమే స్థిరపడ్డారు. ఇక్కడే ఇళ్లు కట్టుకుని, పొలాలు కొనుక్కుని, వ్యాపారలు పెట్టుకుని స్థిరపడ్డారు. ఒక్క గ్రేటర్ హైదరాబాద్ నగర పాలక సంస్థ పరిధిలోనే ఇరవై లక్షలకు పైగా ఆంధ్రా ప్రాంతానికి చెందిన జనాభా ఉన్నట్లు గణాంకాలు తెలియ చేస్తున్నాయి. అదే విధంగా నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాలతో పాటూ ఇతర తెలంగాణ జిల్లాల్లో పది లక్షల వరకు ఆంధ్రులు స్థిరపడినట్లు అవే గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వీరంతా సెటిలర్లుగా ముద్ర పడినా ఏనాడు ప్రాంతవాసులుగా జగడాలకు దిగిన దాఖలాలు లేవు. రాష్ట్ర విభజన జరిగిన సమయంలో తెలంగాణలో స్థిరపడిన ఆంధ్రులు అందరూ వారి స్వరాష్ట్రానికి వెళ్ళిపోతారని అనేక వార్తలు షికారు చేశాయి. కానీ అలాంటిదేమీ జరక్కపోగా, అనేకులు మళ్లీ వచ్చి హైదరాబాద్‌లో కొత్తగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.

ఇక్కడ రియల్ వ్యాపారంలో వారిదే పైచేయికూడా. కేవలం హైదరాబాద్‌లోని ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలలో బాధ్యతలు నిర్వర్తిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు విభజన కారణంగా మాత్రమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లారు. అమరావతికి మంచి ఊపు ఉంటుందన్న భావనలో కొద్ది మంది స్థిరాస్తి వ్యాపారులు, చిన్న, మధ్య తరహా వ్యాపారవేత్తలు అక్కడికి వెళ్ళడం జరిగింది. అలా హైదరాబాద్ నుంచి వెళ్ళిన వ్యాపార వేత్తలు అక్కడ ఎక్కువకాలం మనుగడ సాగించలేక తిరిగి హైదరాబాద్‌కు తిరిగి వచ్చారన్నది కూడా అంతే వాస్తవం. ఈ పరిణామానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు కావచ్చు..తెలంగాణలో ఉన్న అవకాశాలు కూడా కావచ్చని గుర్తించక తప్పదు. ఇందులో కుల రాజకీయ పరిణామాలు కూడా ఉన్నాయి. ఈ విధంగా తెలంగాణ రాష్ట్రంలో స్థిరపడిన ఆంధ్రులు అందరూ ఎటువంటి ఆటంకాలు లేకుండా సుహృద్భావ వాతావరణంలో తమ జీవనయానం కొనసాగిస్తున్నారు. ప్రశాంతంగా తమ పనితాము చేసుకుంటూ పోతున్న తెలంగాణ ఆంధ్రులను రాజకీయాలలోకి లాగి వారి ఓట్లను తమ ఖాతాలో వేసుకునేందుకు రాజకీయ పార్టీలు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. అందులో తప్పులేదు. కానీ చంద్రబాబు అరెస్ట్‌కు దీనికి లంకె పెట్టి వారిని టిడిపికి నిఖార్సయిన మద్దతుదారులుగా చిత్రీకరించడమే సరికాదు. చంద్రబాబు నాయుడు అరెస్ట్ సందర్భంగా కొంత మంది ఐటి ఉద్యోగులు హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ ప్రాంతంలో వేలాదిగా ఒకచోట చేరి నిరసన వ్యక్తం చేశారు. ఐటి ఉద్యోగుల నిరసనలు హైటెక్ సిటీ ప్రాంతానికి పరిమితం అయ్యాయి. ఇదంతా చంద్రబాబు మీద ఉన్న అభిమానంతో చేసిందే కావచ్చు. కానీ ఇక్కడ స్థిరపడ్డవారిని కేవలం టిడిపికి చెందినవారుగా చూపుతూ ఓట్లవేట పెట్టడం సరికాదు. ఎందుకంటే వారు తమకు నచ్చినవారికి ఓటేసుకునే స్వేచ్ఛను కలిగి ఉన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో రాష్ట్రం అంతా ఉద్యమాలు చేసినా ఎక్కడా ఆంధ్రాప్రాంత వారి భద్రతకు ఎలాంటి భంగం వాటిల్లలేదు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రెండు రాజకీయ పార్టీలకు చెందిన రాజకీయ పరిణామాలతో ముడిపడిన అంశం కనుక వారి ఓట్లు ఎటు అంటూ కొందరు..

తమకే అంటూ కొన్ని పార్టీల వారు చేస్తున్న ప్రయత్నాలు మాత్రం ఏవగింపుగా ఉన్నాయి. చంద్రబాబు అభిమానులగా వారిని చిత్రీకరించి లబ్దిపొందేలా కొన్ని పార్టీలు చేస్తున్న ప్రయత్నాలు కూడా సరికాదు. హైదరాబాద్‌లోని వివిధ కంపెనీలలో విధులు నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐటి ఉద్యోగులను ఓ వర్గానికి చెందిన వారుగా చూడరాదు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు వారిని రాజకీయాలకు వాడుకోవాలని చూడడం ఏమాత్రం సమర్థనీయం కాదు. చంద్రబాబు నాయుడు సామాజిక వర్గానికి చెందిన కులస్థులు కొందరు రాజకీయ పార్టీల పంచనచేరి వారి మద్దతు తమకే అని ప్రాచరం చేసుకోవడం కూడా సరికాదు.

# బడుగుల అండను కోల్పోతున్న బిఎస్పీ

**ఆత్మపరిశీలన చేసుకోని మాయావతి**

హైదరాబాద్: ఒకప్పుడు యూపీ రాజకీయాలను శాసించిన బీఎస్పీ నామావశిష్టంగా మారిపోవడం విషాదం. బడుగు వర్గాలకు అండగా నిలిచిన పార్టీ మట్టి కరచి పోవడం దేశంలో బడుగులకు గొడుగు లేకుండా పోయింది. దీనికితోడు మాయావతి నాయకత్వం కూడా ప్రభావవంతంగా లేదు. ఇలాంటి సందర్భంలో తెలంగాణలో ఐపిఎస్ పదవికి రాజీనామా చేసి బిఎస్పీలో చేరిన ప్రవీణ్ కుమార్ లాంటి వారికి ఈ ఫలితాలు నిస్తేజం కలిగించేవే. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బిఎస్పీ తెలంగాణలో ఎక్కడా ప్రభావం చూపలేదు. అలాగే బిఎస్పీ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ కూడా ఓటమి చెందారు. ఈ క్రమంలో అనూహ్యంగా యాన రాజీనామా చేయడం, బిఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించడంతో పరువు పోగొట్టుకున్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని వమిర్శించి ఇప్పుడు అదే పార్టీలో చేరడం ద్వారా విలువలను తుంగలో తొక్కారు. తానే నామమాత్రపు రాజకీయనేతనని చాటుకున్నారు. దీంతో తెలంగాణలో ఇక బిఎస్పి ప్రస్థానం ముగిసినట్లుగనే భావించాలి. ఒకప్పుడు యూపిని ఏలడంతో పాటు, బడుగులకు ఆశాజ్యోతిగా ఉన్న బిఎస్పీ ఇప్పుడు ఉనికి కోల్పోవడం చూస్తుంటే..బడుగులకు కూడా ఆశలు సన్నగిల్లాయా అన్న అనుమానాలు వస్తున్నారు. అంతేగాకుండా యూపిలో అధికార పీఠానికి దూరంగానే మిగిలిపోయింది. సంక్లిష్ట కుల, ప్రాంత సమీకరణలతో బహుముఖ పోటీ ఉండే యూపీ లాంటి రాష్ట్రం కేవలం బీజేపీ, ఎస్పీల ద్విముఖ పోరుగా మారిపోవడం గమనించాలి. ఈ పోరుతో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)తో పాటు కాంగ్రెస్ కూడా నలిగిపోయింది. ప్రియాంక పగ్గాలు తీసుకొని ప్రచారం చేసినా, యూపీలో 3 శాతం కన్నా తక్కువ ఓట్లకే కాంగ్రెస్ పరిమితమైతే, బిఎస్పీ అంతకన్నా దారుణ పరాభవాన్ని మూటకట్టుకుంది. దశాబ్దాలుగా లేని విధంగా యూపీలో అధికార పక్షాన్నే రెండోసారీ పీఠమెక్కించాయి. గతంలో బిజెపి మద్దతుతో లేదా ఎస్పీ మద్దతుతో అధికారం నడిపిన మాయావతి ఎందుకనో నిస్తేజంగగా మారారు. తాజా రాజకీయాల్లో నామమాత్ర పాత్రకే పరిమితం అయ్యారు. బిఎస్పీ తన పూర్వ ప్రాభవాన్ని పూర్తిగా కోల్పోయింది. గూండాగిరీకి దూరంగా శాంతిభద్రతల పానలపై ప్రచారం యూపీలో బీజేపీకి కలిసొచ్చాయి. ఇంటింటా ఎన్నికలలో గెలుపోటములు ఎక్కువగా సెంటిమెంట్ అంశాల మీదే తప్ప, అసలు వాస్తవాల మీద ఆధారపడి ఉండవు. అయితే ఓటు బ్యాంకును కూడా కోల్పోవడం మాయావతి నాయకత్వ వైఫల్యం తప్ప మరోటి కాదు. కాన్షీరామ్ లాంటి బలమైన నేత ఇప్పుడు బిఎస్పీకి రావాలి. బడుగు బలహీనవర్గాలకు అండగా ఉన్నారన్న ప్రభావం చూపాలి. ధరల పెరుగుదల, ఉపాధి లేమి, రైతు ఉద్యమాలు, మధ్యతరగతి కష్టాలు, అధికారపక్షానికి సాధారణంగా ఎదురయ్యే వ్యతిరేకత లాంటివేవీ బీజేపీ గెలుపును ఆపలేక పోయాయి. భావోద్వేగాలను ప్రేరేపించే ఈ ప్రయత్నం తాజా ఎన్నికల్లోనూ ఫలించింది. పార్టీ అధికారంలో ఉన్న యూపీలో లఖీమ్‌పూర్ ఖేరీ, హాథ్రస్ లాంటి ఘటనలు, ఉత్తరాఖండ్‌లో సీఎంల మార్పులు, గోవాలో అంతర్గత బలహీనతల లాంటి ప్రతికూలతలున్నా ఓటర్ల తీర్పు మాత్రం బీజేపీకే అనుకూలించింది. పోటాపోటీ ఉంటుందన్న ఉత్తరాఖండ్‌లో తుది తీర్పు కాంగ్రెస్‌కు షాక్ కలిగించింది. నిజానికి బిఎస్పీ, కాంగ్రెస్ పార్టీల్లోనే బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట దక్కుతుంది. అలాంటిది ఈ రెండు పార్టీలు ఈ ఎన్నికలతో తమ మూలాలను కోల్పోయాయి. బీజేపీ, మోదీ ప్రభంజనాలకు ఇప్పటికైతే తిరుగులేదనే భావనను ఈ ఎన్నికలు కలిగించాయి. విభిన్న సమీకరణాల ఎన్నికల రాజకీయాల నిర్వహణలో ప్రస్తుతం దేశంలో మరే పార్టీ దానికి పోటీలో లేవని నిరూపితం అయ్యింది. కులాల గురించి పోరాడుతున్న వారు సైతం బిజెపి గొడుగుకిందకు చేరుతున్నారు. ఈ ఫలితాలతో బిఎస్పీ ఆత్మపరిశీలన చేసుకోవాలి. నిజానికి బిఎస్పీలో కూడా మాయావతి తిరుగేలని నియంతలా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఓ రకంగా చెప్పాలంటే బిఎస్పీ, కాంగ్రెస్ ఓటు బ్యాంక్ ఆప్, బిజెపిలకు మళ్లుతోందని గుర్తించాలి. అదే సందర్భంలో పర్మినెంట్ ఓటు బ్యాంక్ కూడా ఇక ఉండబోదన్న సంకేతాలను గుర్తించాలి. కొత్త ఓటర్ల రాక,యువత ఆలోచనలు మారడం లాంటివి కూడా సంప్రదాయ ఓటుబ్యాంక్‌ను దెబ్బతీస్తున్నాయి. మోదీ పాపులారిటీకి యువత ఆకర్శితులు అవుతున్నారు. ఇప్పటికైనా నాయకత్వ లోపాలను సరిదిద్దుకోకపోతే బిఎస్పీకి భవిష్యత్తు కష్టమే.

# అవినీతి వ్యతిరేకతతో అందలం ఎక్కిన కేజ్రీ !

జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్‌కు జరిగిన అవమానమే ఇప్పుడు ఢిల్లీ సిఎం కేజ్రీవాల్‌కు జరిగింది. జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ కూడా ఓ కేసులో ఇడి అరెస్ట్ చేయడంతో సిఎం పదవి కోల్పోయారు. ఆయన ముందే మేల్కొని..ఎన్‌డిఎలో చేరివుంటే ముప్పు తప్పేది. అసోం సిఎం హిమంత బిశ్వ శర్మను అడిగివుంటే సలహా ఇచ్చివుండేవారేమో... అలాకాకుండా ఎవరికి వారు మోడీని ఢీకొంటామంటే..ఏదో ఒక అవినీతి కేసులో అరెస్ట్ కాక తప్పదని హేమంత్ సోరెన్, కేజ్రీవాల్‌ల విషయంలో స్పష్టమయ్యింది. కేజ్రీవాల్‌కు కూడాలిక్కర్ కేసు మెడకు చుట్టుకుంది. అన్నా హజారే స్ఫూర్తితో అవినీతి రహిత పాలన అంటూ ఓ అలలా దూసుకు వచ్చిన కేజ్రీవాల్ అవినీతి చట్రలో ఇరుక్కుపోవడం దారుణం కాక మరోటి కాదు. అవినీతికి వ్యతిరేకంగా.. సుపరిపాలన అందిచడమే లక్ష్యంగా.. అన్నాహజారే ఉద్యమంలోంచి పుట్టిన పార్టీగా దేశ ప్రజల దృష్టిలో ఆకట్టుకుంది. చీపురు గుర్తు ఊడ్చేస్తుందని భావించారు. సామాన్యుడి పార్టీగా అవతరించి దేశ రాజకీయాల్లో సంచలనాలు సృష్టించింది ఆమ్ ఆద్మీ పార్టీ. ఢిల్లీలో మూడుసార్లు అధికారంలోకి వచ్చి పట్టు సాధించిన తర్వాత పంజాబ్‌లో అనూహ్య విజయం సాధించి అధికారాన్ని దక్కించుకుంది. ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో 12.92 శాతం ఓట్లు, ఐదు ఎమ్మెల్యేలను గెలిచి బీజేపీకి సవాల్ విసిరే స్థాయికి చేరింది. గోవాలో గణనీయ ఫలితాలను అందుకున్నది. జాతీయ పార్టీగా గుర్తింపు సాధించి బీజేపీ, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ రాజకీయశక్తిగా ఎదిగే ప్రయత్నాల్లో ఉంది. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో బీజేపీకి ఆమ్ ఆద్మీ పార్టీ కొరకరాని కొయ్యగా మారిపోయింది. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఢిల్లీలో చిత్తుగా ఓడించింది. ఈ నేపథ్యంలో ఆమ్ఆద్మీ పార్టీని బీజేపీ పెద్దలు లక్ష్యంగా చేసుకున్నారనే వాదన బలంగా వినిపిస్తున్నది. ఆప్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగానే కేంద్రంలోని పెద్దలు పావులు కదుపుతున్నారని, ఈ దిశగానే దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తున్నారనే ఆరోపణ ఉంది. అయితే ఇవన్నీ ఒక ఎత్తయితే ఆప్ ఏర్పడ్డ తరవాత ఢిల్లీలో,పంజాబ్‌లో చరిత్ర సృష్టించారు. అతి తక్కువ సమయంలో దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. దేశం మొత్తం పార్టీని విస్తరించేందుకు ఆప్ అధినేత కేజ్రీవాల్ అడుగులు వేస్తూ వచ్చారు. ప్రాంతీయ పార్టీగా ప్రారంభమై.. తక్కువ కాలంలో జాతీయపార్టీగా ఎదిగింది. పంజాబ్‌లోనూ అధికారం చేపట్టింది. అవినీతి వ్యతిరేక ఉద్యమంతో ఎంత వేగంగా ప్రజలను ఆకట్టుకుందో.. అంతే వేగంగా అవినీతి ఆరోపణల్లో ఆ పార్టీ కూరుకుపోయింది. అథఃపాతాళానికి పోయిందనే చెప్పాలి. నిక్కచ్చిగా ఉండివుంటే కేజ్రీవాల్ ప్రత్యామ్నాయ నేతగా ఎదిగి ఉండేవారు. ఎన్‌డిఎలో చేరినా మంచి అవకాశాలు ఉండేవి. కానీ మొండితనం, ఎవరు చెప్పినా వినని తత్వం, కాంగ్రెస్ పంచన చేరడం వంటివి కూడా ఆయనకు ఓ రకంగా మైనస్‌గా మారాయనే చెప్పాలి. ఇకపోతే లిక్కర్ కేసుతో పాటు, పటు కేసుల్లో ప్రస్తుతం ఆప్ సీనియర్ నేతలంతా జైల్లో ఉన్నారు. పార్టీ అధినేత అరవింద్ కేజీవ్రాల్ పరిస్థితి కూడా అక్కడికే దారతీసింది. లిక్కర్ కేసులో ఇప్పటి వరకు ఇడి సమన్లను ఖాతరు చేయకుండా వచ్చారు. అనూహ్యంగా హైకోర్టు అరెస్టును అడ్డుకోలేమంటూ ఉత్తర్వులు ఇవ్వడంతో గురువారం రాత్రి కేజీవ్రాల్‌ను ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఈడీ అరెస్ట్ చేసింది. న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టిన తరవాత రిమాండ్ విధిస్తే జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి తప్పకపోచ్చు. ఈడీ అరెస్ట్ నుంచి ఉపశమనం పొందేందుకు కేజీవ్రాల్ చివరి వరకు ప్రయత్నించారు. 9 సార్లు దర్యాప్తు సంస్థ సమన్లు జారీ చేసినా విచారణకు హాజరుకాలేదు. రాజకీయ కుట్రలో ఈడీ పావుగా మారిందని ఆప్ ఆరోపిస్తూ వస్తోంది. చివరికి అరెస్ట్ నుంచి రక్షణ కల్పించలేమని ఢిల్లీ హైకోర్టు తీర్పునిచ్చిన గంటల వ్యవధిలో ఈడీ అధికారులు కేజీవ్రాల్‌ను అరెస్ట్ చేశారు. పలు కేసుల్లో ఆప్ కీలక నేతలు ఇప్పటికే అరెస్ట్ అయి ఏళ్ల తరబడి జైల్లోనే ఉన్నారు. ప్రస్తుతం ఆమ్ ఆద్మీ పార్టీలో అతిషి, రాఘవ్ చద్దా, గోపాల్ రాయ్, సౌరభ్ భరద్వాజ్‌తో సహా మరికొందరు నేతలు మాత్రమే గుర్తింపు గల ముఖాలుగా కనిపిస్తున్నాయి. అయితే ఢిల్లీలో మినహా దేశ వ్యాప్తంగా ప్రభావం చూపే నాయకులు అయితే పెద్దగా లేరనే చెప్పుకోవాలి. ఆప్ ఏర్పాటుకు అన్నా హజారే ఉద్యమంలోనే పునాది పడింది. అరవింద్ కేజీవ్రాల్‌తో పాటు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, కుమార్ విశ్వాస్ వంటివాళ్లు పార్టీ ఏర్పాటులో కీలక భూమిక పోషించారు. మనీష్ సిసోడియా, సత్యేంద్ర జైన్, సంజయ్ సింగ్, సోమనాథ్ భారతి, అతిషి, రాఘవ్ చద్దా, సౌరభ్ భరద్వాజ్ వంటి నేతలు అరవింద్ కేజీవ్రాల్‌కు అండగా నిలిచారు. కుమార్ విశ్వాస్ లాంటి వారు వెనక్కి వెళ్లారు. దేశ ప్రజలు వీరిపై విశ్వాసం ఉంచారు. దీంతో ఆ పార్టీకి దేశ, విదేశాల నుంచి భారీగా నిధులు వచ్చాయి. ఫలితంగా ఢిల్లీలో అరవింద్ కేజీవ్రాల్ వరుసగా రెండుసార్లు అధికారంలోకి వచ్చారు. అయితే పార్టీ అధినేత అరవింద్ కేజీవ్రాల్ వ్యవహర శైలి, ఆయన విధానాలపట్ల అసంతృప్తితో కొందరు నేతలు పార్టీని వీడారు. ప్రశాంత్ భూషణ్, కుమార్ విశ్వాస్, జర్నలిస్ట్ అశుతోష్ వంటివారు పార్టీని వీడారు. ఆ తర్వాత ఆప్ అన్ని రాజకీయ పార్టీల వంటిదేననే అభిప్రాయం ప్రజల్లో బలంగా నాటుకుంది. అవినీతికి వ్యతిరేకంగా అడుగుల వేసినా చివరకు అన్నా హజారే కూడా ఆ పార్టీని ఈసడించుకున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ వెలుగులోకి రావడంతో ఆ పార్టీకి అది మాయని మచ్చగా మారింది. ఇప్పుడు అన్నా హజారే అండ కూడా ఆపార్టీకి కానీ, కేజ్రీవాల్‌కు కాని లేదు. అవినీతి వ్యతిరేక ఉద్యమంతో బలంగా ఎదిగిన ఆప్.. అవే అవినీతి ఆరోపణల్లో కూరుకుపోవడం దారుణం కాక మరోటి కాదు. అవినీతి ఆరోపణలతో మొదట సోమనాథ్ భారతిని, ఆ తర్వాత సత్యేందర్ జైన్ జైలుకు వెళ్లారు. ఆ తర్వాత ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో అరవింద్ కేజీవ్రాల్ కుడిభుజంగా ఉన్న మనీష్ సిసోడియా తీహార్ జైలులో ఉన్నారు. ప్రస్తుతం అరవింద్ కేజీవ్రాల్‌ను ఈడీ అరెస్ట్ చేసింది.

# ఓట్ల కోసం అంబేద్కర్ జపం !

దళిత జనోద్ధరణలో అన్ని పార్టీలది ఒకటే విధానంగా ఉంది. నేటికీ దళితుల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు లేవు. వారిని ఓటుబ్యాంక్‌గా చూస్తున్నారు తప్ప తమలో ఒకరిగా చూడడం లేదు. దీనికితోడు దళితుల్లో ఉపకులాల ద్వారా వారి ఐక్యతను దెబ్బతీస్తున్నారు. అలాగే మాల, మాదిగ అంటూ దళితులే రోడ్డెక్కేలా చేస్తున్నారు. దీని ఆధారంగా ఓట్లు కొల్లగొట్టే ప్రయత్నాల్లో ఉన్న ఆయా పార్టీల పన్నాగాలను దళితులు గుర్తించడం లేదు. ఏటా అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి ఆయన విగ్రహాలకు దండలేయడం...కొత్తగా విగ్రహాలు పెట్టడం వరకే ప్రభుత్వాలు బాధ్యత వహిస్తున్నాయి. భారీ విగ్రహాలను పెట్టి దళితజనోద్ధరణ అంటూ కాలం గడిపేస్తున్నారు. నేతలు కూడా అంబేద్కర్ విగ్రహాలను పెట్టాలన్న డిమాండ్ తీసుకుని వచ్చి వారిని తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ రకంగా వారిని ఎప్పటికప్పుడు మోసం చేస్తున్నారు. స్వాతంత్ర్యానంతరం దళితులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారే తప్ప వారిని తోటి మానవులుగా రాజకీయ నాయకులు భావించడం లేదు. వారిని సమాజంలో గౌరవం దక్కేలా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం లేదు. గ్రామాల్లో ప్రజలమధ్య వైషమ్యాలు లేకున్నా నాయకుల ఆలోచనలో అవి ఉన్నాయనడానికి మన నాయకుల తీరే నిదర్శనం. అంబేద్కర్ ఆశయాలను పాటించడం.. ఆయన ప్రవచించిన సిద్ధాంతాలను అమలు చేయడం అన్నది పైకి కనిపిస్తున్న ముసుగు మాత్రమే. ఏడున్నర దశాబ్దాల స్వాతంత్ర్య కాలంలో మన నాయకులంతా సమాజాన్ని విచ్ఛిన్నం చేసే దిశగా కులాల కుంపట్లు రగిలిస్తున్నారు.ఇప్పుడు రాజకీయ పార్టీలకు, నాయకులకు ఆయన పేరును జపించడం నిత్యకృత్యం కావడం వెనక ఓటుబ్యాంక్ రాజకీయం తప్ప మరోటి లేదు. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్న చందాన అంబేద్కర్ పేరు చెప్పుకుని అణగారిన వర్గాలను బుట్టలో వేసుకోవడం అన్న కళలో మన నాయకులు ఆరితేరారు. ఆయనకు భారీ విగ్రహాలు పెట్టి దండలు వేసి చేతులు దులుపు కుంటున్నారు. ఆయన ఆశయాలను తుంగలో తొక్కుతున్న భావన రాకుండా నిత్యం అంబేద్కర్ జపం చేస్తున్నారు. ఎంతో జాగ్రత్తగా అన్ని రాజకీయ పార్టీలు అణగారిన వర్గాల ఓట్లకోసం అంబేద్కర్ పేరును వాడుకుంటున్నారు. ప్రతి ఎన్నికల్లో అది



బాగా కనిపిస్తోంది. ప్రధాని మోడీ అయితే అంబేద్కర్ పేరు ఉచ్చరించకుండా ఉండలేకపోతున్నారు. ఆయనకు మేమిచ్చిన గౌరవం మరెవరూ ఇవ్వలేదంటున్నారు. కానీ ఈనాడు నిత్యం అంబేద్కర్ జపం చేస్తున్న వారంతా ఉన్నత కులాలు వారే. వారు ఏనాడు దళితులను ఉన్నతికి తీసకుని వచ్చేందుకు ప్రయత్నించడం లేదు. రాష్ట్రపతిని చేయడం దళిత ఉద్ధరణ అనుకుంటారు. పాలనా పగ్గాలు వారి చేతుల్లో లేకుండా ఉత్సవ విగ్రహాలుగానే వారిని చూస్తున్నారు. దేశంలో పరిస్థితులు చూస్తుంటే అంబేద్కర్, పూలేలు ఎదుర్కొన్న వర్ణవివక్ష, కులవివక్ష జాడ్యాలు ఇంకా సమిసి పోయాయని చెప్పగలమా ? అంటే చెప్పలేం. ఇంతగా విద్య అందుబాటులోకి వచ్చినా ఇంకా వారు అణగారిన వర్గాలు గానే మిగిలిపోతున్నారు. ఒకటి రెండు పదవులు వారి మోహాన పడేసి దళితజన ఉద్ధరణ జరిగిందన్న ప్రచారం చేసుకుంటే మనల్ని మనం మోసం చేసుకోవడమే అవుతుంది. దళితబందు, పెన్షన్లు వంటివి ఇచ్చి ఆహా..ఓహో అంటూ కాలం గడుపుతున్నారు. దళిత ఉద్ధరణ గురించి గొప్పగా చెప్పుకునే కాంగ్రెస్ జగ్జీవన్ రామ్‌కు ప్రధాని అయ్యే ఛాన్స్ వచ్చినా అడ్డుకున్న చరిత్రను మరచిపోలేం.. అందుకే దళితనేతను పాలనకు దగ్గరగా చేసిన చరిత్రను చూడడం లేదు. దళితులను సిఎం చేస్తానన్న కెసిఆర్ సైతం వారిని ఓటుబ్యాంక్ కోసం మభ్యపెట్టారు. తొలి దళిత ముఖ్యమంత్రి అంటూ ఊదరగొట్టి తెలంగాణ సమాజాన్ని మోసం చేసి, పదేళ్ల పాటు ఆయనే సిఎంగా కొనసాగారు. దళితబంధు పేరుతో అక్రమాలకు తెరతీసారు. నిజంగానే మనం అంబేద్కర్ మహాను భావుడి ఆశయాలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నామా లేదా అన్నది నేతలతో పాటు దళితులు కూడా ఆలోచన చేయాలి. ఎన్ని దళిత వాడలను పురుద్ధరించారో.. ఎందరికి చదువు, ఉద్యోగాలు కల్పించారో ఆత్మవిమర్శ చేసుకోవాలి. అంబేద్కర్ ఆశించిన ఆశయాలను ముందుకు తీసుకుని వెళ్లడంలో రాజకీయ పార్టీలు చేస్తున్న మోసాలు గుర్తించాలి. దళితులంతా ఒక్కటే అన్న పట్టుదలతో సాగితే రాజకీయాల్లో పట్టు సాధించగలమని దళితులు గుర్తించాలి. అంతరాలు లేని సమాజం నిర్మించేందుకు ప్రయత్నించిన దాఖలాలు లేవు. రాజకీయ నాయకులే కులాల కుంపట్లు సృష్టించి దేశంలో అసమానతలను పెంచి పోషిస్తున్నారు. దీంతో కులవ్యవస్థ మరింత బలంగా వేళ్లూనుకుని సమాజాన్ని అతలాకుతలం చేస్తోంది. రాజకీయ నాయకులు ఎలాగూ మంచి చేయరు. కనీసం ప్రజలుగా మనమంతా ఆ మహనీయుడికి నివాళి అర్పించేందుకు ఆయన చూపిన మార్గంలో నడిచే ప్రయత్నం చేయాలి.అంటరాని కులాలు ఆర్థికంగా బలపడనిదే, రాజకీయాధికారం పొందనిదే వారి సమస్యకు సమగ్రమైన పరిష్కారం దొరకదని అంబేద్కర్ ఆనాడే ప్రకటించారు. వారికి రాజ్యాధికారం వస్తే తప్ప ఈ అంటరానితనం, చిన్నచూపు చూడడం వేరుగా చూడడం వంటి సమస్యలు సమిసిపోతాయని భావించాడు. భారత జాతీయ కాంగ్రెస్ నడిపే జాతీయోద్యమంలో అంటరానితన నిర్మూలన కోసం గాంధీ కృషి చేస్తూ ఉంటే ఆ కృషికి కాంగ్రెస్ సభ్యులనుండి పూర్తిస్థాయిలో మద్దతు లభించనేలేదు. గాంధీజి వర్ణ వ్యవస్థను భారత సమాజం ప్రత్యేక లక్షణమని, ఎవరి కుల వృత్తిని వారు అనుసరించడం వల్ల ఎటువంటి పోటీలేని ఆర్థిక వ్యవస్థ భారత సమాజంలో ఉన్నదని సమర్థించాడు. ఆనాడే అంబేద్కర్‌ను ప్రధాని చేయాలన్న ఆలోచనకూడా గాంధీజీకి రాలేదు. ఇప్పటికైనా దళితులు ఐక్యత ప్రదర్శించాలి. అంబేద్కర్ పేరుతో చేసే రాజకీయాలను దునుమాడాలి. ఎన్నికల్లో ఐక్యత చాటాలి. తమను రాజకీయంగా వాడుకుంటున్న నేతల నిజస్వారూపాలను గుర్తించాలి. అప్పుడే అంబేద్కర్ మహాశయుడి ఆశయాలను సాధించగలం.

# పౌల్ట్రీ పరిశ్రమలో నష్టాలే ఎక్కువ

**- ధరలు పెరుగుతున్నా నష్టాలే అధికం**
**- పరిశ్రమల యజమానుల ఆవేదన**



**విజయవాడ:**కరోనా దెబ్బతో తొలినాళ్లలో పౌల్ట్రీ పరిశ్రమ విలవిల్లాడుతోంది. చికెన్ అమ్మకాలు తగ్గాయి. పలు ప్రాంతాల్లో అయితే ఏకంగా కోళ్లను బొందపెట్టారు. అమ్ముకోలేక, కోళ్లను సాకలేక రైతులు నానాయాతన పడ్డారు. చికెన్ కిలో ధర 50కి పడిపోయింది. కానీ ఇప్పుడు మళ్లీ ధరలు పెరిగాయి. కిలో 300కుచేరువలోకి వచ్చింది. దీనికితోడు ఎండాకాలం కావడంతో మరింతగా ధరలుపెరిగే అవకాశం ఉంది. అయినా నష్టాలు తప్పడం లేదని పౌల్ట్రీరైతులు ఆందోళన చెందుతున్నారు. గత రెండేళ్లలో కరోనా దెబ్బకు అన్ని రంగాల్లో మాంద్యం నెలకొంది. మార్కెట్లు కుప్పకూలాయి. బంగారం ధరలు అందుకోలేనంతగా పెరుగుతున్నాయి. ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నవారికి ప్రభుత్వం పారిశ్రామిక రాయితీలు ఇస్తూ వస్తోంది. కానీ ధరలతో దెబ్బతింటున్న సామాన్యులకు మాత్రం ఊరట దక్కడం లేదు. రాష్ట్రంలో పౌల్ట్రీరంగం దాదాపు 25 లక్షల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నది. కోళ్లు, గుడ్లు మంచి ప్రొటీన్ అని, ఎలాంటి అనుమానాలు లేకుండా తినాలని.. వస్తున్నప్రచారం నేపథ్యంలో ఇప్పుడిప్పుడే పౌల్ట్రీ పరిశ్రమ మళ్లీ పుంజుకుంటోంది. కరోనా కారణంగా పౌల్ట్రీ రంగం కుదలేయ్యింది. మనిషి ప్రాణాలతో చెలగాటమాడుతున్న మాయదారి మహమ్మారి కరోనా.. అన్నిరంగాలను దెబ్బేసింది. దీనికి తోడు వేసవిలో సాధారణంగా వచ్చే వైరస్‌తో కోళ్లు చనిపోతుండడం కూడా పరిశ్రమకు శాపంగా మారింది. బర్డ్ ఫ్లూ వచ్చినపుడు ఎలాంటి పరిస్థితి ఉందో కరోనా కారణంగా పరిస్థితి ఘోరంగా ఉంది. కేవలం అపోహల వల్లే పరిశ్రమ దారుణంగా దెబ్బతింది. బర్డ్‌ఫ్లూ సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పావలా వడ్డీకి రుణాలు ఇప్పించాయి. ఇప్పుడు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆదుకోకపోతే పౌల్ట్రీ రంగం నామరూపాల్లేకుండా పోతుంది. దీనిపై ఆధారపడ్డ అనేక అనుబంధ పరిశ్రమలూ దెబ్బతింటాయి. దీని నుంచి గట్టెక్కకపోతే ఈ రంగంపై ఆదారపడి జీవిస్తున్న లక్షలాదిమందికి ఉపాధి దెబ్బతినే ప్రమాదం ఉంది.

# రైతులను ఆదుకోలేని బీమా పథకాలు

ఎన్నికల్లో హామీలు ఇవ్వడం..గెలిచిన తరవాత నాలుక మడతేయడం నాయకులకు అలవాటుగా మారింది. రైతుల ఆదాయం రెండింతలు చేస్తామన్న మోడీ హామీ పదేళ్లయినా నెరవేరలేదు. నిజానికి దేశంలో పుష్కలంగా నీటివనరులు, సారవంతమైన భూములు ఉన్నా వాటిని సద్వినియోగం చేసుకునే ఇంజనీరింగ్ నైపుణ్యాలను పాలకులు ప్రదర్శించడం లేదు. నదీజలాలు సముద్రం పాలుకాకుండా...ఏటా వరదలతో అతలాకుతలం కాకుండా...ఆనకట్టలు కట్టాలన్న స్పృహలేకుండా పోతోంది. డబ్బుల కక్కుర్తితో కట్టిన కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు పనికారాకుండా పోతున్నాయి. నదుల అనుసంధానం అన్న మాటే మోడీ ఎత్తడం లేదు. దేశంలో అన్నిరకాల పంటలకు అనువైన నేలలు ఉన్నా, సమగ్ర పంటల విధానం రావడం లేదు. దీంతో రైతులకు పంటలను పండించడం ఎంత కష్టంగా మారిందో..అమ్ముకోవడం అంతకుమించిన భారంగా మారుతోంది. పంటల కొనుగోళ్లు,బీమాల విషయంలో ప్రభుత్వాలు స్పష్టమైన జాతీయ విధానాల ను అవలంబించడం లేదు. దీంతో పంటలు చేతికి వచ్చినప్పుడు ధరలు లేక పోవడం..పంటలు నష్టపోయి నప్పుడు బీమా సొమ్ము అందక పోవడం షరామామూలుగా మారింది. ప్రధానంగా వాణిజ్యపంటల విషయంలో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. దీనిని సవాల్‌గా తీసుకుని రైతులకు అండగా నిలవాల్సిన పాలకులు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నారు. ఇప్పటికీ దేశవ్యాప్తంగా సరైన బీమా విధానం లేదు. ఉన్నా రైతులకు అవగాహన లేదు. దీనిని జాతీయ విధానంగా తీసుకుని రవాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా పంటలు నష్టపోతున్నరైతులకు సరైన బీమా సౌకర్యం అందడం లేదు. గ్రామాల వారీగా కాకుండా పంట వారీగా బీమా సౌకర్యం రావాల్సి ఉంది. వ్యవసాయం చుక్కాని లేని నావలా తయారవగా వాణిజ్య పంటల సాగు జూదాన్ని తలదన్నింది. మునుపటి ఏడాది మిర్చికి కాస్త రేటు పడటంతో ఖరీఫ్‌లో రైతులు అటు మళ్లారు. రికార్డు స్థాయిలో ఎపిలో లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఎకరానికి రూ.లక్ష పెట్టుబడి అయింది. కౌలు రైతులకైతే లక్షన్నర. పెట్టుబడులు పూర్తిగా నష్టపోయిన రైతులు న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో మిర్చికి తామర తెగులు పలు రాష్ట్రాల్లో వ్యాపించినందున జాతీయ విపత్తుగా ప్రకటించి సాయం చేయాల్సిన కేంద్రం చేతు లెత్తేసింది. రాష్ట్రం కేంద్రాన్ని నిలదీయకుండా లేఖలతో సరిపెట్టింది. వీరిద్దరి మధ్య రైతులు సమిధలవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వమైనా మిర్చి రైతులను ఆదుకుందా అంటే అదీ లేదు. అధ్యయన కమిటీల పేరుతో కాలక్షేపం చేసింది. అలాగే గతంలో వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు స్వల్ప విస్తీర్ణానికి పదో



పరకో ఇచ్చి చేతులు దులిపేసుకుంది. ఎంత మందికి ఎంత మొత్తంలో ఎప్పటికి ఇన్సూరెన్స్ వస్తుందో పెద్ద పజిల్‌గామారింది. ఒక వైపు అంతుబట్టని తెగుళ్లు, వైరస్‌లు ఇంకో వైపు నకిలీ, కల్తీ విత్తనాల కారణంగా విపరీతంగా నష్ట పోతున్నారు. వీటిని తట్టుకోలేని రైతులు ఉసురు తీసుకుంటున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఆదుకోవడానికి సమగ్ర పంటల బీమా ఉండాల్సిందే. రైతులు ఏ రకంగా పంటలు నష్టపోయినా అండగా ఉండేలా బీమా సౌకర్యం రావాల్సి ఉంది.పట్టెడన్నం పెట్టే రైతులు తమకు చిన్నబాధ వచ్చినా తట్టుకోలేని దైన్య స్థితిలో ఉన్నారు. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో పత్తి,మిర్చి పంటలతో పాటు,పసుసు రైతులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రధానంగా మిర్చి రైతులు తెగుళ్ల కారణంగా లక్షలాది రూపాయాల నష్టాన్ని మూటగట్టుకున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో సాగయ్యే రెండు ప్రధాన వాణిజ్య పంటలు మిరప, పత్తి రైతాంగం ఆసాంతం పెట్టిన పెట్టుబడులు కోల్పోయి ప్రభుత్వ పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. మిర్చికి ఇటీవల రికార్డు ధరలు పెరిగాయి. కానీ ధరలు పలికిన సమయానికి మిర్చి బాగా దెబ్బతింటోంది. ఎపిలో ఎప్పటి నష్టాలకు అప్పుడే పరిహారం అంటున్న సర్కారు మిర్చి, పత్తి విషయంలో నాన్చుడు దారి పట్టి రైతులను క్షోభకు గురి చేస్తోంది. తామర తెగులు సోకి మిర్చి, నకిలీ విత్తనాల వలన పత్తికి నష్టం వాటిల్లగా, ఈ నష్టాలకు ప్రభుత్వ పూచీ ఏమిటో ఇప్పటికైతే స్పష్టత లేదు. వివిధ కారణాలతో పంట నష్ట పోయిన రైతులకు తక్షణం పరిహారం అందించి ఆసరా కల్పించాల్సిన సర్కారే సాకులు చెప్పి పరిహాసం ఆడటం అమానవీయం. పరిహారంపై రైతులకు కనీసం భరోసా సైతం కల్పించకపోవడం అన్యాయం. ప్రభుత్వ తీరుపై ఆగ్రహించిన మిర్చి, పత్తి రైతులు రోడ్డెక్కుతున్నారు. పత్తి రైతుల గోడు చెప్పనలవి కాదు. నకిలీ, కల్తీ, నాసిరకం విత్తనాల వలన పంట నష్టపో యిన రైతులకు కంపెనీల నుండి పరిహారం ఇప్పించేందుకు 2011లో ప్రభుత్వం ఇచ్చిన జీవో పైనా ఇలాగే కంపెనీలు కోర్టుకెళ్లాయి. ఇక్కడా ప్రభుత్వ స్పందన లేదు. దాంతో ప్రభుత్వం కంపెనీలకు అనుకూలంగా ఉందనే భావన కలుగుతోంది. గతంలోనూ నకిలీ మిర్చి నారు, మిర్చి విత్తనాలతో రైతులు నష్టపోయారు. ఇంతా జరుగుతున్నా ఆర్‌బికెలు, గ్రామ సచివాలయాలు, ఇంటెలిజెన్స్, పోలీస్, వ్యవసాయ శాఖలు ఏం చేస్తున్నాయో తెలీదు. నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఆ దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాలి. నష్టపోయిన మిర్చి, పత్తి రైతులను సత్వరం ఆదుకోవాలి. వారికి జాతీయస్థాయిలో పంటల బీమాను తీసుకుని రావాలి. అప్పుడే వారికి న్యాయం జరుగుతుంది. ఈ వైపుగా ఆలోచనలు చేసి సమగ్ర పంటల బీమా అమల్లోకి తీసుకుని రావాల్సి ఉంది. అలాగే నకిలీ విత్తనాలు అంటగట్టే వ్యాపారులపై కఠిన చర్యలకు అవకాశం ఉండాలి.

# దేశ సమస్యలపై స్పష్టమైన హామీ ఏదీ ?

దేశంలో మళ్లీ తమదే అధికారం అని బిజెపి ఘంటాపథంగా చెబుతోంది. ఎన్‌డిఎ 400 సీట్లు సాధిస్తుందన్న ధీమాలో ఉంది. కాంగ్రెస్ తమకు పోటీ కాదని, ఇండియా కూటమికి ప్రజల అండలేదని ప్రచారం చేసు కుంటోంది. ఈ క్రమంలో బిజెపి పదేళ్ల పాలనను గీటురాయిగా తీసుకుంటే..అనేక విషయాలు చర్చించాల్సి ఉంటుంది. ప్రధానంగా పెట్రో, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. జిఎస్టీ పేరుతో ప్రజల నడ్డి విరుస్తు న్నారు. నోట్ల రద్దు కారణంగా సామాన్యులు పడ్డ ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. నిరుద్యోగం చెప్పడానికి లేదు. ఉద్యోగాల కల్పన, ఉద్యోగాల భర్తీ, ఉపాధి అవకాశాలు అసలు లేకుండా పోయాయి. యువత సర్టిఫికెట్లు పట్టుకుని విదేశాలకు చెక్కేస్తున్నారు. ఈ దేశంలో బతకలేమని కూలీలు గల్ఫ్ దేశాలకు వెళు తున్నారు. రైతులకు మద్దతు ధరలు దక్కడం లేదు. బియ్యం ధరలు అమాంతంగా పెరిగాయి. ఉప్పులు,పప్పులు మొదలు నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయి. గృహసంబంధ సిమెంట్, ఇసుక, ఇనుము తదితర వస్తువుల ధరలు విపరీతంగా పెంచేస్తున్నారు. సామాన్యులు ఇల్లు కొనుక్కుని బతికే అవకాశం లేకుండా చేశారు. కేవలం ప్రభుత్వం కట్టించే ఇళ్లపై ఆధారపడేలా చేస్తున్నారు. ఇదంతా కూడా అభివృద్ధికి చిహ్నమా అన్నది చర్చించాలి. ప్రధాని మోడీ చెబుతున్న వికసిత్ భారత్‌కు ఇదంతా నిదర్శనంగా చూడాలి. బేటీపడావో..బేటీ బచావో నినాదంగా మారింది. అమ్మాయిలు చదువుకునే పరిస్థితి లేదు. కనీసం బాలికా విద్యకు అవసరమైన రుణాలకు కూడా వెసలుబాటు లేదు. ఈ క్రమంలో బిజెపి ప్రకటించిన మేనిఫెస్టోలో ఈ అంశాలేవీ చర్చించలేదు. సరికదా స్పృశించలేదు. దేశంలో రైతులు కీలకమైన ఓటు బ్యాంకుగా ఉన్నారు. దీంతో ఈ వర్గాన్ని ఆకట్టుకునేందుకు రెండు పార్టీలు ప్రయత్నించాయి. వ్యవసాయాన్ని సాంకేతికతను జోడించడంతో పాటు.. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను బలోపేతం చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. కనీస మద్దతు ధరపెంచుతామని తెలిపింది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన విధంగా చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో తెలిపింది. వ్యవసాయ ఫైనాన్స్‌పై శాశ్వత కమిషన్ ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చింది. నిజానికి వ్యవసాయ రంగం అతిపెద్ద పరిశ్రమగా పాలకులు గుర్తించడం లేదు. దీనిని గుర్తించి అనుబంధ పరిశ్రమలు చేపడితే దేశంలో సగం నిరుద్యోగం పోతుంది. అలాగే దేశీయంగా పంటలకు ప్రాధాన్యం పెరుగుతుంది. కానీ రెండు పార్టీలు ఈ రంగంపై పెద్దగా విశ్లేషణ చేయడం లేదు. మహిళా సాధికారత సాధించే దిశగా గ్రామీణ మహిళలను లక్షాదికారులు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపింది. అలాగే మహిళల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తామని బీజేపీ మేనిఫెస్టోలో తెలిపింది.మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి పేదింటి మహిళకు షరతులు లేకుండా ఏడాదికి లక్ష రూపాయిలు నేరుగా ఖాతాల్లో జమచేస్తామని తెలిపింది. 2025 నుంచి మహిళలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 50శాతం రిజర్వేషన్లు. ప్రతి జిల్లాలో కనీసం ఒక సావిత్రీబాయి పూలే హాస్టల్‌తో వర్కింగ్ ఉమెన్ హాస్టళ్ల సంఖ్యను రెట్టింపు చేస్తామని తెలిపింది. సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ కోసం రూ. 25 లక్షల వరకు నగదు రహిత ఆరోగ్య సేవలు పొందే విధంగా బీమా పథకం అమలు, పబ్లిక్ హెల్త్ సెంటర్లలో అన్ని పరీక్షలు, మందులు ఉచితంగా అందిస్తామిన కాంగ్రెస్ తెలిపింది. . ఇలాగే వెళితే దేశంలో సామాన్యులు, పేదలు, మధ్యతరగతి వాళ్లు బతకడం కష్టం కాగలదు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు కావడం లేదు. పేదలు మరింత పేదలుగా, ధనవంతులు మరింత ధనవంతులుగా మారేలా ప్రభుత్వ విధానాలు ఉంటున్నాయి. దేశంలో సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఈనెల 19న తొలివిడత పోలింగ్ జరగనుంది. ఏడు విడతల్లో ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. గెలుపు కోసం రాజకీయ పార్టీలు వ్యూహాలను సిద్ధం చేశాయి. ముందు ప్రజలను ఆకర్షించేందుకు మేనిఫెస్టోలతో అన్ని పార్టీలు సిద్దం అయ్యాయి. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీలు తమ మేనిఫెస్టోలను విడుదల చేశాయి. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్తున్నాయి. తమను గెలిపిస్తే ఏం చేస్తామో ప్రజలకు వివరిస్తున్నారు. కాంగ్రెస్ 'న్యాయ్ పత్ర్ ' పేరుతో బీజేపీ 'సంకల్ప్ పత్ర్' పేరుతో ఎన్నికల ప్రణాళికను విడుదల చేశాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు, కాంగ్రెస్, బీజేపీ తమ తమ మేనిఫెస్టోలను విడుదల చేశాయి. మోదీ గ్యారెంటీ క్యాప్షన్‌తో బీజేపీ సంకల్ప్ పత్ర్ విడుదల చేయగా.. మహిళలు, యువత, నిరుపేదలు, రైతులు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ న్యాయ పత్ర్‌ను రూపొందించింది. ఓ రకంగా చెప్పాలంటే రెండు పార్టీలు యువతను ఆకర్షించే ప్రయత్నం చేశాయి. ఎందుకంటే యువ ఓటర్ల సంఖ్య దేశంలో గణనీయంగా పెరిగింది. బీజేపీ తన మేనిఫెస్టోలో పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా చట్టాలు చేస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను సత్వరమే భర్తీ చేశామని, స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపింది. కానీ పదేళ్ల పాలనా కాలంలో ఉద్యోగాల కల్పన అన్నది లేకుండా పోయింది. ప్రచారాడంబరం తప్ప ఉద్యోగాలు లేక యువత రోడ్డున పడుతోంది. ఉన్నత చదువులు చదివినా కొలువులు కానరావడం లేదు. దేశాన్ని గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చి ఉపాధి అవకాశాలు పెంచుతామని బిజెపి మరోమారు యువతను మోసం చేసే ప్రయత్నం చేసింది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మద్దతుగా ముద్ర రుణాల పరిమితిని పెంచుతామని కూడా పేర్కొంది. కానీ ప్రభుత్వ ఉద్యోగాల కల్పనపై స్పష్టమైన హామీని ప్రకటించలేదు. అయితే ఇందుకు భిన్నంగా నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి యువ న్యాయ్ కార్యక్రమం అమలు చేస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో తెలిపింది. డిప్లొమా, గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన 25 ఏళ్లలోపు యువకుల కోసం రైట్ టు అప్రెంటీస్‌షిప్ చట్టం తీసుకొస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో 30 లక్షల ఖాళీలను భర్తీ చేస్తామిన తెలిపింది. అధికారంలో ఉన్న బిజెపి మాత్రం ప్రభుత్వ ఖాళీల భర్తీకి ముందుకు రాలేదు. ఇకపోతే సీనియర్ సిటిజన్ల కోసం రెండు పార్టీలు తమ మేనిఫెస్టోలో వివిధ హామీలు ఇచ్చాయి. 70 ఏళ్లు పైబడిన వారికి ఆయుష్మాన్ భారత్ పథకం కింద వైద్య సేవలు అందిస్తామని తెలిపింది. తీర్థయాత్రలు చేపట్టే సీనియర్ సిటిజన్లకు రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపింది. దివ్యాంగుల హక్కుల చట్టం 2016ను కఠినంగా అమలు చేస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పేర్కొంది. సీనియర్ సిటిజన్లు, వితంతువులు, దివ్యాంగులకు జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం కింద పెన్షన్‌ను వెయ్యి రూపాయిలకు పెంచుతామని చెప్పింది. సీనియర్ సిటిజన్లకు ప్రజా రవాణాలో ప్రయాణ రాయితీలను పునరుద్దరిస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పేర్కొంది. రెండు పార్టీలు అన్నివర్గాలను ఆకట్టుకునే విధంగా తమ మేనిఫెస్టోలో పథకాలను పొందుపర్చాయి. కానీ సమస్యలను పరిష్కరించే చిత్తశుద్ధి ఈ రెండు పార్టీలకు లేదని గతంలో వీరి పాలనా కాలం తీరు చూస్తే అర్థం చేసుకోవచ్చు

# ప్రజల ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

**- ప్రధాన సమస్యలపై ఫోకస్ పెట్టని విపక్షం - మోడీ వికసిత భారత్ పేరుతో డంబాచారం**

**న్యూఢిల్లీ:** వికసిత భారత్ పేరుతో ప్రకటనలు మార్మోగుతున్నాయి. ప్రజలకు ఎలా మేలు చేశారో మోడీ గ్యారెంటీలతో ప్రకటనలు గుప్పిస్తున్నారు. కానీ సామాన్యులకు మాత్రం ఏం మేలు జరిగిందో చెప్పడం లేదు. ఉచిత రేషన్ అంటున్నారు. కోట్లాది ఇళ్లు కట్టామని అంటున్నారు. ఇన్ని చేసినా ప్రజల జీవితాలు మాత్రం మారలేదు. కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న ఆర్థిక విధానాలు సామాన్యులకు గుదిబండగా మారుతున్నాయి. వారి ఆర్థిక జీవనచిత్రం ఛిద్రం అవుతోంది. తాజాగా కేంద్ర ఆర్థికశాఖ తీసుకున్న నిర్ణయం సామాన్యులకు శరాఘాతంగా మారింది. ఈ విషయాలపై పార్లమెంటులో ఎక్కడా చర్చించడం లేదు. రాజకీయంగా తమకు లబ్ది చేకూర్చే విషయాలపై మాత్రమే విపక్షాలు గొంతెత్తుతున్నాయి. అందుకోసం పార్లమెంట్ సమావేశాలను స్తంభింప చేస్తున్నాయి. నిజానికి అంతకు మించిన సంక్షోభం ఇప్పుడు ప్రజలు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా పాన్ నంబర్‌తో ఆధార్ లింక్ చేయడం...వచ్చే ఆర్థిక సంవత్సరం జీవితబీమా మొత్తంపై టాక్స్ విధిస్తూ తీసుకున్న నిర్ణయాలు పేద,మధ్య తరగతి ప్రజలపై పెనుభారంగా మారబోతోంది. ఈ దొంగ దోపిడీ నిర్ణయాలను విపక్షాలు కనీసం గమనించినట్లుగా కూడా లేదు. ఇప్పటికే పాన్‌తో ఆధార్ లింక్ అయివుంటే ఫర్వాలేదు.. కానీ లింక్ చేయాల్సిందే. దీనికి కూడా ఐటి విభాగం ఒక్కో వ్యక్తికి వేయ రూపాయలు వసూలు చేస్తోంది. ఇక నెట్ సెంటర్లలోకి వెళ్లి లింక్ చేసుకోవాలంటే అదనంగా మరో 200 రూపాయలు కట్టాల్సి వస్తోంది. ఇది సామాన్యులపై ఎంతగా భారం పడుతుందో కేంద్ర పాలకులు గమనించడం లేదు. ప్రతి పనికీ ఆధార్, పాన్ అవసరం కావడంతో ప్రజలు తప్పనిసరిగా లింక్ చేసుకుం టున్నారు. ఇదికూడా కేంద్రానికి ఆదాయ వనరుగా మారింది. ఇలా లింక్ చేయడం వల్ల కేంద్రానికి కనీసంగా ఓ 40,50వేల కోట్ల ఆదాయం సమకూర బోతోంది. అలాగే లింక్ చేయకుంటే 50వేలకు పైగా లావాదేవీలపై పదివేల వరకు పెనాల్టీ కట్టాల్సి వస్తుంది. ఇది ప్రజల్లోకి పెద్దగా వెళ్లడంలేదు. దీనిని వెంటనే ప్రజలు గమనించి ముందుకు వెళితే మంచిది. ఇకపోతే ప్రజలు పైసాపైసా పొదుపు చేసుకుని కట్టే జీవితబీమా పాలసీపైనా ఇప్పటికే జిఎస్టీ వసూలు చేస్తున్నారు. హెల్త్ పాలసీలపైనా జిఎస్టీ పేరుతో దండుకుంటున్నారు. గత ఏప్రిల్ నుంచి ఇది అమల్లోకి వచ్చింది. ఎవరైనా కూడా కొత్తగా జీవితబీమా చేయదల్చుకుంటే... పాలసీ మెచ్యూరిటీ అయిన తరవాత వచ్చే రాబడిపైనా పన్ను విధించబోతున్నారు. ఇది కనీసం 6శాతంగా ఉండబోతోంది. మోడీ ప్రభుత్వం ఇలా ప్రజలను వేపుకుతింటున్న తీరును ప్రజలు గమనించాలి. ఇప్పటికే గ్యాస్ సిలిండర్ ధరలు మోత మోగిస్తున్నాయి. అయితే తెలివిగా ఎన్నికల ముందు వంద రూపాయలు తగ్గించారు. పెట్రోధరలు మంటపెడుతున్నాయి. పెద్దనోట్ల రద్దు మొదలు జీఎస్‌టీ వరకు ప్రజల జీవితాలను మోడీ ఆర్థిక విధానాలు అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఢిల్లీలో కూర్చుని తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా సామాన్యులు అతలాకుతలం అవుతు న్నారు. అచ్ఛేదిన్‌కు నిర్వచం లేకుండా పోయింది. కేవలం కొందరి స్వార్థం కోసం, కొందరి ప్రయోజనాల కోసం 90శాతం భారతీయులు ఇబ్బందులు పడాల్సిన దుర్భర పరిస్థితులు దేశంలో నెలకొన్నాయి. అయినా తమేదో ఘనకార్యం చేస్తున్న ట్లుగా బిజెపి పాలకులు బాకాలు ఊదుతు న్నారు. కాంగ్రెస్ కూడా ఇలాంటి సమస్యలపై ఫోకస్ చేయడం లేదు. వారు కూడా ఓట్ల కోసం నగదు బదిలీ పథకాలనే నమ్ముకున్నారు. మహిళలకు ఏటా లక్ష వరకు ఖాతాల్లో వేస్తామని ప్రకటించారు. ఇప్పటికే జీఎస్టీ భయాలు వెన్నాడు తున్నా వాటిని సవరించి ఆదుకుంటామన్న ఒక్కమాట కూడా ప్రభుత్వం నుంచి రావడం లేదు. దీంతో ప్రజలకు ఈ ప్రభుత్వం భరోసగా లేదన్న విషయం అర్థం అవుతోంది. విపక్షాలు కూడా సమస్యలను చర్చించడానికి పార్లమెంట్‌లో అవకాశాలు వచ్చినా వదులుకుని, గొడవలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సమస్యను సమస్యగా చర్చించడంలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు పూర్తిగా విఫలమయ్యారు. పార్లమెం టులో సమస్యలను ప్రస్తావించడం కన్నా గొడవ చేసి వాయిదా వేయించడంలోనే గత పదదేళ్ల కాలం గడిపారు.

# మోడీ హయాంలో నిరుద్యోగ భారతం.!

## - ఉద్యోగా,ఉపాధి రంగాలపై వేటు - స్వయం సమృద్దికి అవకాశాలు మృగ్యం


**న్యూఢిల్లీ:** గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తుడుము కోవడం బిజెపికి అలవాటుగా మారింది. సత్యాలను కూడా అంగీకరించలేని స్థితికి ఆ పార్టీ చేరింది. విలువలతో కూడాని రాజకీయాలు నెరిపే బిజెపికి ఇప్పుడు అసత్యాలు మాట్లడడమే అలవాటుగా చేసుకుంది. ఎందుకంటే విలువలు కలిగిన నేతలను పార్టీలో దూరంగా పెట్టారు. కనీసం వారికి మర్యాద ఇచ్చి మాట్లాడే స్థితిలో కూడా లేరు. అందుకే పార్టీలో అన్నీ అవలక్షణాలు చోటుచేసుకున్నాయి. కేవంల ఇద్దరి చేతుల్లోనే పార్టీ ఉంది. వారిద్దరే అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారు. కార్పోరేట్ల సలహాలతో వారు చెప్పిన రీతిలోనే పాలన సాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

తాము చెప్పిందే వేదం అన్న రీతిలో పార్టీని నడుపుతూ ప్రజల ఉసురు పోసు కుంటున్నారు. అన్నీ ఘనతలు సాధించామని, భారత్ ఉజ్వలంగా ఉందని గొప్పలకు పోతున్నారు. ఇలాంటి వారికి ఎదుటి వారు చెప్పే నిజాలు చేదుమాత్రగానే ఉంటుంది. దేశంలో నిరుద్యోగం 45 ఏళ్ల గరిష్టానికి చేరింది. సమస్యలపై గొంతుచించుకుని అరిచినా వినిపించుకునే స్థాయిని మోడీ దాటిపోయారు. నిరుద్యోగం పెరిగిందని, ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీస్తున్నా సమాధానం ఇచ్చే ధైర్యం మోడీకి లేదు. విపక్ష పార్టీలు నిజాలు అడిగినంతనే బిజెపి అగ్గిమీద గుగ్గిలం కావడం దాని అసహనాన్ని వెల్లడిస్తోంది. పదేళ్ల పదవీ కాలంలో నిరుద్యోగులను అగాధంలోకి నెట్టిన మోడీ బృందానికి సహజంగానే విమర్శలను జీర్ణించుకునే స్థాయి లేదు. ఉద్యోగ కల్పనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విఫలమయ్యారని గణాంకాలే వెల్లడిస్తున్నా ఒప్పుకునే ధైర్యం చేయడం లేదు. దీనికితోడు ఉన్నప్రభుత్వరంగ సంస్థలను నిస్సిగ్గుగా అమ్ముతున్నా..గట్టిగా నిలదీసే నేతలు బిజెపిలో కూడా లేరు. అంతెందుకు పార్లమెంటులో ఏ సమస్యపైనా చర్చించే ధైర్యం కూడా మోడీ చేయడం లేదు. అసలు తమను పట్టించుకున్న పాపాన పోవడం లేదని అన్ని వర్గాలు వాదిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల ముందు, పార్లమెంటు సమావేశాల సందర్భంగా నీతి వాక్యాలు చెప్పడంతప్ప సమస్యల కోణంలో చూడడం లేదు. కేంద్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏయే రంగాల్లో ఎలాంటి సానుకూల మార్పులు తీసుకు వచ్చిందీ చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసు కోవడం లేదు.

రాష్ట్రాలకు ఒరగబెట్టిందీ ఏమీ లేకున్నా గణాంకాలతో వివరించేందుకు పదేపదే ప్రయత్నాలు చేయడం తప్ప మరేమీ లేదు. పెద్దనోట్ల రద్దు నిర్ణయం లక్షలాదిమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దెబ్బతీసింది. చాయ్ అమ్మానని గొప్పుల చెప్పే ప్రధాని మోడీ,గ్రామాల్లో చాయ్ అమ్మేవాళ్లకు కూడా కష్టకాలం తీసుకుని వచ్చారు. ఎంతోమంది ఆర్థిక వేత్తలు, ఆర్థిక నిపుణులు ప్రస్తుత విపరిణామాలను ఏకరువు పెట్టినా పట్టించుకోవడం లేదు. పలు స్వతంత్ర నివేదికలు ఇప్పటికే ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టాయి. నిజానికి ఇది ప్రతి నిరుద్యోగి చేస్తున్న ఆక్రందన. దేశంలో ఉద్యోగాలు రావు. వస్తూత్పత్తి పెరిగినా అనుబంధ రంగాలు బలపడలేదు. వ్యవసాయం దివాళా తీసింది. పండించిన పంటలకు మద్దతు ధరలు రావడం లేదు. వ్యవసాయానుబంధ పరిశ్రమలు పెట్టి నిరుద్యోగాన్ని రూపుమాపకుండా ఉపన్యాసాలతో కాలం వెళ్ల దీసారు. ఉద్యోగాలు కల్పిస్తానని, మేకిన్ ఇండియా అంటూ ఊదరగొట్టిన మోదీ వైఫల్యాన్ని కాలంగడుపుతున్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీర్చే ప్రయత్నాలు జరిగివుంటే పరిస్థితి ఎందుకింత దారుణంగా ఉంటుంది. దీనికితోడు రూపాయి విలువ పడిపోతూ, ద్రవ్యోల్బణం పెరుగుతూ పోతుందే తప్ప అభివృద్ధి గణాంకాలు ముందుకు సాగడం లేదు. దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు ఎలా సన్నగిల్లాయో లెక్కలుచూస్తే తెలుస్తుంది. దేశంలోని పట్టణ ప్రాంతాల్లో 7.8శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 5.3శాతం చొప్పున నిరుద్యోగిత ఉందని, సగటున 6శాతం పైనేనని గణాంకాలు తెలుపు తున్నాయి. తీవ్రమైన ఉపాధి లేమి ఎన్నికల్లో మోదీ విజయావకాశాలను దెబ్బతీస్తుందన్నది చాలామంది అంచనాలు వేశారు. అయితే మోడీ మేనేజ్‌మెంట్‌తో ఎన్నికల్లో గెలవడంతో ఇక తమకు తిరుగులేదన్న ధోరణిలో ఉన్నారు. ఎన్నో అద్భుతాలను సాధించామని చెప్పుకున్నంత మాత్రాన ప్రజలు నమ్ముతారను కోవడం అవివేకం. నల్లధనాన్ని తవ్వితీయడమనే ప్రకటిత లక్ష్యాన్ని సాధించకపోగా, నలుపును తెల్లగా మార్చి, చక్కగా ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది. అధికారంలోకి వచ్చేముందు కోట్లాది ఉద్యోగ ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత కొంతకాలం అవే మాటలతో మేకిన్ ఇండియా పాట కూడా పాడారు. ఆర్థిక వ్యవస్థ నాశనం చేసి ఇప్పుడు ఆత్మనిర్భర భారత్ జపం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. గత 45 ఏళ్లలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి దాపురించలేదు. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్నా అది అసమతుల్యంగా ఉండడం వల్ల తగినన్ని ఉద్యోగాల సృష్టి జరగక లక్షలాది మంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. గత 45 ఏళ్ళ కాలంలో ఎప్పుడూ లేనంత నిరుద్యోగం ఇప్పుడు ఉన్నదనీ, కోట్లాది ఉద్యోగాలు సృష్టిస్తామన్న మోదీ హామీ ఓ క్రూరమైన జోక్‌గా మిగిలిపోయిందని కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణల్లో నిజం ఉంది.

# కాంగ్రెస్‌లో హిందుత్వ ఎజెండా


## - హిందుత్వకు అనుకూలమన్న భరోసా - రాహుల్,ప్రియాంకలు హిందుత్వ అనుకూల ధోరణి





**న్యూఢిల్లీ:** త్వరలో జరిగే కొన్ని రాష్ట్రాల ఎన్నికలతో పాటు, 2024లో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఎఐసిసి అధ్యక్షుడు రాహుల్ గాంధీని హిందుత్వ అనుకూలవాదిగా సిద్ధం చేయాలని కాంగ్రెస్ ప్లాన్ వేస్తోంది. మోడీని ఢీకొనాలంటే అధికశాంత ఉన్న హిందువుల ఓట్లు ఆకట్టుకోవాలి. అందుకే ఇటీవల హిందూ అనుకూల విషయాల్లో కొంత సాను కూలంగా వ్యవహరిస్తున్నారు. రాహుల్ హిందుత్వవాది అనిపించుకోవాలని పక్కాగా ప్లాన్ వేసినట్లు కాంగ్రెస్ నేతల ద్వారా వెల్లడవుతోంది. ఆలయాలకు వెళ్లడం, పూజ లు చేయడం పెద్దపెద్ద బొట్లు పెట్టుకోవడం వంటివన్నీ అన్నా చెల్లెళ్లు చేస్తున్నారు. ఇటీవల ఫలితాలను బేరీజు వేసుకున్నాక కొంత హిందుత్వ విషయంలో రాహుల్ కూడా ఆలోచన చేస్తున్నట్లుగా క్షేత్రస్థాయికి సమాచారం చేరవేస్తున్నారు. బిజెపిని ఢీకొని అధికారంలోకి రావాలంటే జాతరల్లో ఓట్లను పట్టాలని చూస్తున్నారు. హిందుత్వ ఓట్లు నిజంగానే గంపగుత్తగా బిజెపికి పడివుంటే ఈ దేశంలో కాంగ్రెస్ అధికారంలో ఉండేది కాదు. కానీ ముస్లిం సంతుష్టీకరణపై మాత్రం హిందువుల్లో కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత ఉంది. కాంగ్రెస్ హయాంలో అనేక సందర్భాల్లో ముస్లింల కోసం గీతదాటింది. ఎన్నికల సంవత్సరం ప్రారంభం కావడంతో నేపథ్యంలో బిజెపిని మించి హిందుత్వాన్ని ప్రదర్శించాలని కాంగ్రెస్‌లోని ఓ వర్గం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే రాహుల్‌ను మోడీని మించిన హిందుత్వవాదిగా తయారు చేయాలని చూస్తున్నారు. ఇదిసానుకూల ఫలితం ఇస్తుందా లేదా అన్నది చూడాలి. నిజానికి దేశానికి ఇప్పుడు ఏం కావాలి... మనం ఏం తప్పులు చేశాం... ఏం చేయలేకపోయాం... గతంలో పదేళ్లు ప్రజలు అధికారం కట్టబెడితే ఎందుకు దేశాన్ని సక్రమంగా పాలించలేక పోయాం అన్న ఆత్మపరిశీలనతో ముందుకు వెళితే తప్ప కాంగ్రెస్ మనుగడ సాధించడం కష్టం. కేవలం గుళ్లూగోపురాలు తిరిగితే ప్రజలు ఓట్లు వేస్తారనుకుంటే పొరపాటు. అలా అనుకుంటే దివంగత పివి నరసింహారావు హయాంలో అయోధ్యలో వివాదాస్పద మసీదు కూల్చివేత తరవాత కాంగ్రెస్ ఓటమి పాలయ్యింది. హిందువులు ఈ విషయంలో పివిని ఆదర్శంగా తీసుకుని, హిందువులకు అతనే ప్రతినిధి అని అనుకుని ఉంటే భారీ మెజార్టీతో మళ్లీ గెలిపించే వారు. కానీ అలా జరగలేదు. దేశంలో బీజేపీ క్రమక్రమంగా ఎదుగుతున్న వైనాన్ని మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు గమనించినందువల్లనే బాబ్రీ మసీదు కూల్చివేత సమయంలో ఉదాసీనతతో వ్యవహరించారని, ఆయన వల్లే మైనారిటీలు దూరం అయ్యారని కాంగ్రెస్‌లో ఒక వర్గం ఆనాడు భావించింది. అందుకే తరవాత పివిని దూరం పెడుతూ వచ్చారు. అర్జున్ సింగ్ వంటి నేతలు పి.వి. నరసింహారావు అనుసరించిన హిందూత్వ విధానాలపై లేఖాస్త్రాలు సంధించి ఇరుకున పెడుతూ ఉండేవారు. మాధవరావు సింధియా, చిదంబరం తదితర నేతలు పివిని తక్కువ చేసి చూశారు. పి.వి. హయాంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా ఉన్న గాడ్గిల్ కాంగ్రెస్ రోజురోజుకూ క్షీణించిపోవడానికి కారణం ముస్లింలను బుజ్జగించే ప్రయత్నాలు చేయడమేనని చెప్పేవారు. సోనియా హాయంలో రెండు పర్యాయాలు అధికారం అనుభవించాక ఇంతగా దిగజారి పోవడం ఇదే ప్రథమం. అందుకే కొందరు రాహుల్‌ను హిందూ ప్రతినిధిగా ప్రజలు గుర్తించేలా చేయాలని తపాత్రయపడుతు న్నట్లుగా ఉంది. సోనియా స్వతహాగా క్రిష్టియన్ కావడం, విదేశీ వనిత కావడం వల్ల ఇంతకాలం ఆమె హిందుత్వను అంగీకరించి ఉండకపోయి ఉంటారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏం చేస్తుంది.. ఏం చేయలేక పోయాం అన్న సిద్దాంతాన్ని పక్కన పెట్టి ముందుకు వెళ్లడం అన్నది సైద్ధాంతిక దిగజారుడు తనంగానే చూడాలి. 2014లో నరేంద్ర మోదీ హయాంలో బీజేపీ ప్రభంజనం వీచిన తర్వాత నుంచీ కాంగ్రెస్‌లో ఈ మేరకు అంతర్మథనం ప్రారంభమైనట్లు సంకేతాలు కనపడుతున్నాయి. అప్పటివరకూ మైనారిటీల మద్దతు పొందేందుకు ఎటువంటి చర్యకైనా పూనుకునే దిగ్విజయ్ సింగ్ వంటి కాంగ్రెస్ నేతల వల్ల తమకు నష్టమే కాని లాభం లేదని కాంగ్రెస్ అధిష్ఠానం భావించే స్థితికి చేరుకుంది. ఈ క్రమంలో ఇటీవల మేనిఫెస్టో కూడా ఆకర్శణీయంగా తయారు చేశారు.

# మతి భ్రమించిన మాటలు !





కెసిఆర్‌తో పాటు ఆయన అనుయాయులు, అనుచరులు కూడా శాపనార్థాలకు అలవాటు పడ్డారు. గత పదేళ్లుగా రాజ్యం అనుభవించిన వారు ఇప్పుడు తట్టుకోలేక పోతున్నారు. అధికారం పోయిందన్న బాధలో ఏదేదో మాట్లాడుతున్నారు. అందుకే తెలంగాణ అంతా ఆగం అయిపోయిందన్న రీతిలో గగ్గోలు పెడుతు న్నారు. ఎపిలో జగన్ కూడా నేను లేకుంటే ఇక అంతే సంగతులని చెబుతున్నారు. అంటే వీరు మేము లేకుంటే రాష్ట్రాలు అతలాకుతలం అవుతాయని, అభివృద్ధి ఆగిపోతుందని భావిస్తున్నారు. తెలంగాణ లో పదేళ్లుగా సాగు,తాగునీటికి ఢోకా లేకుండా చేశామని కెసిఆర్ అంటున్నారు. మరి ఈ మూడు నెలల్లోనే ఆ నీరంతా ఎక్కడికి పోయిందో కెసిఆర్ చెప్పాలి. కాళేశ్వరం అవినీతిపైనా, అఆర్థిక దుస్థితిపైనా నోరు విప్పడం లేదు. రైతుబంధు పేరుతో జరిగిన అక్రమాలపై నోరు మెదపని కెసిఆర్ రేవంత్‌పై దుమ్మెత్తి పోస్తున్నారు. లిల్లీపుట్ ప్రభుత్వం అంటూ విమర్శలు చేస్తున్నారు. తన అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి చేస్తున్న ఎత్తుగడలో భాగంగా విమర్శలకు పదను పెట్టారని భావించాలి. ఎందుకంటే ప్రాజెక్టులు కట్టి ఉంటే నీళ్లు ఏమయ్యాయి. మిషన్ భగీరథ సక్రమంగా ఉంటే ఎందుకు ఈ మూడు నెల్లల్లోనే పథకం నీరుగారి పోయింది. అంటే పథకం పేరుతో చేసిన ప్రచారం అంతా ఉత్తిదే అని అర్థం చేసుకోవాలి. ఇంతకాలం అబద్దాలు ప్రచారం చేసి ప్రజలను నమ్మించారని అనుకోవాలి. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ అంశాలపై రెండు మూడు రోజులలో టీవీలలో కూర్చుని మొత్తం చెబుతానని కెసిఆర్ మీడియాతో చెప్పారు. కానీ ప్రకటనలు చేసి..రోజులుగా గడిచిపోతున్నా..ఆయన టీవీల ముందుకు రాలేకపోయారు. లిక్కర్ కేసులో చివరికి కుమార్తె అరెస్టు గరించి కూడా ఒక్క మాట మాట్లాడటం లేదు. కవితను ఈడీ జైలుకు పంపి నెల రోజుల అయింది. ఈ లోపు సీబీఐ కూడా అరెస్టు చూపించింది. అయినా ఎన్నికల బహిరంగసభల్లో కేసీఆర్ రేవంత్ రెడ్డిని వ్యక్తిగతంగా టార్గెట్ చేసుకుంటున్నారు తప్ప నిజాలు వెల్లడించడం లేదు. రాజకీయ వ్యాఖ్యలతో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నంలో రేవంత్ బీజేపీలో చేరబోతున్నారని ఓ రాయి విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోకి వచ్చాక అనేక విషయాలపై ఆరోపణలు వచ్చాయి. అన్నింటికి మించి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం దద్దరిల్లుతోంది. ఇలా కేసీఆర్ ఇంకా అనేక కీలక విషయాలపై స్పందించడం లేదు. కూతురు కవిత అరెస్టుపై ఇంతవరకు స్పందించలేదు. తన కూతురు అరెస్టు అక్రమమని కాని సక్రమమని కాని కేసీయార్ ఇంతవరకు మాట్లాడకపోవటమే ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కూతురును ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో ఈడీ, సీబీఐలు అరెస్టులు చేసినా సైలెంట్ గా ఉన్నారు. తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న టెలిఫోన్ ట్యాపింగ్ అంశంపై విచారిస్తున్న స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఇప్పటికే సుమారు పదిమంది పోలీసు అధికారులను అరెస్టుచేశారు. వీరంతా బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు ప్రత్యర్థుల ఫోన్లను ఎలా ట్యాపింగ్ చేసింది పూసగుచ్చినట్లు చెప్పినట్లు మీడియా లో ప్రచారం జరుగుతోంది. అరెస్టయిన పోలీసు అధికారులు చెప్పిన సమాచారం ప్రకారం ప్రభుత్వంలోని పెద్దతలకాయ ఆదేశాల ప్రకారమే ట్యాపింగ్ జరిగిందని వాంగ్మూలాలు ఇచ్చారని అంటున్నారు. ఇదే విషయమై మంత్రులు, అధికార కాంగ్రెస్ నేతలు, కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి తదితరు లంతా ట్యాపింగ్ కు బాధ్యులుగా కేసీయార్, కేటీయార్, హరీష్ రావులపైనే ఆరోపణలు చేస్తున్నారు. టెలిఫోన్ ట్యాపింగ్ కు బాధ్యత వహించాల్సింది కేసీయారే అని అందరికీ తెలుసు. పైగా తమ హయాంలో ట్యాపింగ్ జరిగిందని స్వయంగా కేటీయారే అంగీకరించారు. కొడుకు ట్యాపింగ్ జరిగిందని అంగీకరించిన తర్వాత ట్యాపింగ్ జరగలేదని కేసీయార్ అనేందుకు లేకుండా పోయింది. ట్యాపింగ్ తో తనకు సంబంధం లేదని తప్పించుకునేందుకూ లేదు. ఇవన్నీ పక్కన పెట్టి కొత్తగా పల్లవి అందుకున్నారు. ఇప్పుడు కేటీఆర్ తో పాటు కేసీఆర్ కూడా.. రేవంత్ రెడ్డి బీజేపీలోకి వెళ్తారని అంటున్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వల్ల రేవంత్ రెడ్డి మీద ప్రజల్లో అపనమ్మకం కలిగించడమా లేక తమకు ఎన్నికల్లో లబ్ది చేకూరుతుందని అనుకుంటున్నారా అన్నది అర్థం కావడం లేదు. రాష్ట్రాన్ని కుదిపివేస్తున్న కీలక అంశాలపై స్పందిం చకుండా రేవంత్ రెడ్డి బీజేపీలోకి వెళ్తారంటే.. బీఆర్ఎస్‌కు ప్రజలు ఓట్లు వేస్తారా అన్న ప్రశ్న కూడా సహజంగానే వస్తుంది. కేవలం రాజకీయ ప్రకటనలతో మభ్య పెట్టడం మానుకోవాలి. ఇప్పటికే ఎన్నికల నాటకంలో బిఆర్ఎస్ నేతలు భంగపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడంతోపాటు ప్రజల అభిమానాన్ని చూరగొన్నట్లు ప్రకటించుకుంటున్నారు. ఇక అంతా బాగు చేశానని ప్రకటించిన సింగరేణి నిధులు కరిగిపోగా.. అప్పుల కోసం వేట మొదలుపెట్టింది. అప్పుల కోసం ఆర్థిక సంస్థల చుట్టూ తిరుగు తోంది. ప్రతి ఏటా భారీ లాభాలను ఆర్జిస్తున్నట్టు ప్రకటనలు చేస్తూనే అప్పుల కోసం అన్వేషించడం మేడిపండు చందంగా కనిపిస్తోంది. ఇచ్చిన హామీలను పక్కన పెట్టడం, ప్రజలను మభ్య పెట్టడం గత పదేళ్లలో కెసిఆర్ బాగా అలవాటు చేసుకున్నారు. ఉన్నది లేనట్లుగా ప్రచారంల చేయడంలో వీరు దిట్టలని తేలిపోయింది. నిజాం షుగర్స్ 9 ఏళ్లయినా తెరుచుకోలేదు. ఆజంజాహీ ముచ్చటేలేదు. ఆసియాలోనే అతి పెద్దదిగా గుర్తింపు పొందిన నిజాం షుగర్ ఫ్యాక్టరీ మూతపడి కార్మికులు రోడ్డుపాలయ్యారు. తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే మూతపడిన ఈ ఫ్యాక్టరీని తెరిపిస్తామని 2014 ఎన్నికల సందర్భంగా కేసీఆర్ ప్రకటించారు. ఉమ్మడి వరంగల్‌లోని ఏపీ రేయాన్స్ ఫ్యాక్టరీ పరిస్థితి కూడా ఇంతే. తెలంగాణలో మూతపడిన పరిశ్రమల ఊసెత్తని కేసీఆర్ పదేళ్లుగా ప్రజలను మోసం చేశారు. నిజంగానే కెసిఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే తెలంగాణలో మూతపడ్డ పరిశ్రమలను తెరిపించే వారు.ఎన్నికల ముందు చేసే ప్రయత్నాలు ఎప్పటికైనా బెడిసి కొడతాయి. రాజకీయాలు చేయడం వేరు..ప్రజలకు సేవచేయడం వేరు..ప్రజలను నమ్మించి ఓట్లు కొనుగోలు చేయడం వేరు. ఈ ప్రక్రియలో ఎవరు ఎటువైపు అన్నది ప్రజలు గమనిస్తూనే ఉంటారు. అందువల్ల చిత్తశుద్ధితో చేసే ప్రయత్నాలను మాత్రమే ప్రజలు స్వాగతిస్తారు. ఎందుకంటే ఇప్పుడు కెసిఆర్, బిఆర్ఎస్ నేతలు రేవంత్ ప్రభుత్వం విషయంలో చేస్తున్న ఆరోపణలకు మూల్యం చెల్లించుకోక తప్పదు.

# కొడుకు రాజకీయ ఎదుగుదలే లక్ష్యం

## అమిత్ ప్రత్యక్ష రాజకీయాల కోసం గుత్తా ఎత్తులు



**నల్గొండ:** జిల్లాలో సీనియర్ బిఆర్ఎస్ నేత,మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మరోమారు వార్తల్లో నిలిచారు. సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉన్న ఆయన రాష్ట్ర రాజకీయాల్లో తన కుమారుడు అమిత్ ఎదుగుదలను చూసి ఆనందించాలని భావిస్తున్నారు. అందుకోసం ఎంపిగా నిలబెట్టే క్రమంలో రాజకీయ ఎత్తులు వేస్తున్నారు. ఇంతకాలం ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న గుత్తా ..ఇప్పుడు సైలెంట్‌గా ఉన్నారు. మండలి ఛైర్మన్ అన్నది అత్యున్నతపదవే అయినా రాజకీయంగా పెద్దగా ముందుకు సాగే ఛాన్స్ ఉండదు. మండలి ఛైర్మన్ కావడంతో జిల్లాలో రాజకీయంగా చక్రం తిప్పే స్థానం ఉండదు. దీనికితోడు గుత్తా సుఖేందర్ రెడ్డికి సొంత జిల్లాలోనే కొందరు పొగ పెడుతున్నారని ప్రచారం ఉంది.మండలి ఛైర్మన్‌గా రెండోసారి అవకాశం ఇచ్చినా...తన కొడుకును ఎంపిగా చూడాలన్న కోరికతో ఉన్నారు. ఈ క్రమంలో ఆయన తనయుడు ఇటీవలే సిఎం రేవంత్ రెడ్డి సలహాదారు వేం నరేందర్ రెడ్డితో భేటీ అయ్యారు. భువనగిరి ఎంపి స్థానం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. గుత్తా సుఖేందర్ రెడ్డి వివాద రహితుడిగా మృదు స్వభావి గా పేరుంది. వార్డు సభ్యుడిగా రాజకీయ అరంగ్రేటం చేసిన గుత్తా టీడీపీ నుంచి 1999లో నల్గొండ ఎంపీగా గెలిచి పార్లమెంట్లో అడుగు పెట్టారు. రాజకీయ సమీకరణాల్లో భాగంగా 2009లో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అదే ఏడాది జరిగిన ఎన్నికల్లో నల్గొండ ఎంపీగా రెండోసారి విజయం సాధించారు. తిరిగి 2014లో వరుసగా మూడోసారి కాంగ్రెస్ ఎంపీగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. మారిన రాజకీయ సమీకరణాలతో తన అనుచరులతో కలిసి గుత్తా సుఖేందర్ రెడ్డి గులాబీ కండువా కప్పుకున్నారు. రాష్ట్ర స్థాయిలో సీఎం కేసీఆర్ ఏర్పాటుచేసిన రైతు సమన్వయ సమితి తొలి ఛైర్మన్ గా వ్యవహరించాడు. ఆ తర్వాత ఎమ్మెల్సీగా నామినేట్ అయిన గుత్తా సుఖేందర్ రెడ్డి శాసన మండలి రెండో ఛైర్మన్ గా 21 నెలలపాటు వ్యవహరించారు. ఆ పదవి నుంచి గుత్తా దిగిపోయిన నాటి నుంచి ఖాళీగానే ఉంది. తిరిగి రెండోసారి 2021 నవంబర్ లో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నిక య్యారు. అయితే కాంగ్రెస్ నుంచి టిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నప్పటి నుంచి గుత్తా సుఖేందర్ రెడ్డి క్యాబినెట్ లో బెర్త్ ఆశించారు. ఎప్పుడూ ప్రజాక్షేత్రంలో ఉండేందుకు ఇష్టపడే సుఖేందర్ రెడ్డి టీఆర్ఎస్ పార్టీలో చేరిన తొలినాళ్లలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా ప్రభుత్వం నియమించింది. ఎమ్మెల్సీగా ఎన్నికయ్యాక 2019 సెప్టెంబర్ 11 నుంచి గతేడాది జూన్ 3వరకు మండలి ఛైర్మన్ గా పనిచేశారు. మరో మారు ఛైర్మన్ పదవి దక్కడంతో ఆయన ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారనే భావించాలి. అయితే గతంలో గుత్తా శాసనమండలి ఛైర్మన్ అయినప్పటికీ ప్రజలతో, పార్టీ కేడర్ తో సత్సంబందాలు కొనసాగించారు. నాగార్జునసాగర్ ఉపఎన్నిక, గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో గుత్తా తెరవెనక పాత్ర పోషించారు. మండలి ఛైర్మన్ పదవిలో గుత్తా ఎన్నాళ్లు కొనసాగుతారనే విషయం పక్కన పెడితే భవిష్యత్తులో తన కుమారుడి రాజకీయ ఎదుగుదల కోసం ఆయన తాపత్రయ పడుతున్నారు. కొడుకును ఎంపిగా చేస్తే ఇక తనకు తిరుగుండదని భావిస్తున్నారు.

# సమస్యలను గుర్తించి ముందుకు సాగాలి !

తెలంగాణలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనేకంటే..రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అంటే బాగుంటుంది. యువకుడైన రేవంత్ రెడ్డి తన మంత్రివర్గ సహచరులతో కలసి చేస్తున్న పాలనాతీరు పట్ల ప్రజల్లో ఓ నమ్మకం..భరోసా పెరిగింది. బిఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు ఏవగింపు కలిగిలా...వారిని మరింత అసహ్యించుకునేలా చేస్తున్నాయి. చేసిన అప్పుల గురించి, అక్రమాల గురించి కాకుండా ఎదురు దాడితో చేస్తున్న విమర్శలు సామాన్యుల్లో బిఆర్ఎస్ వారిపట్ల మరింత అసహ్యం కలుగుతోంది. మేడిగడ్డపై కెసిఆర్ చేస్తున్న విమర్శలు చూస్తుంటే ఆయనలోని అసహనం బయటపడింది. మేడిగడ్డ కుంగిపోతే... బాధ్యతారహితంగా మాట్లాడారు. ఇంతకన్నా దారుణం ఉండదు. పదేళ్లు సిఎంగా చేసిన వ్యక్తి ఇలా మాట్లాడడం శోచనీయం. అసెంబ్లీకి రాకుండా టివిల్లో చర్చ చేస్తానని చెప్పడం ఆయన అసహనానికి పరాకాష్టగా చూడాలి. హరీష్‌రావు, కెటిఆర్, కవితలు కూడా చేస్తున్న విమర్శలు ప్రజల్లో ఇప్పుడు బాగా చర్చగా మారాయి. రచ్చబండ చర్చల్లో రేవంత్ తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న హామీలపై బాగా చర్చ సాగుతోంది. ప్రధానంగా మహిళలకు ఉచిత బస్సు అన్నది గ్రామీణ ప్రాంతాల మహిళలకు వరంగా మారింది. అలాగే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500కే సిలిండర్ కూడా మహిళలకు ఆర్థికంగా తోడ్పడే కార్యక్రమంగా చెప్పుకోవాలి. అందుకే బిఆర్ఎస్ నేతల తీరుపై తీవ్ర వ్యతిరేకత మొదలయ్యింది. గతంలో ఉన్న సానుభూతి కూడా పోగొట్టుకుంటున్నారు. మేమే తెలంగాణ తెచ్చామని ఇప్పటికీ చెప్పు కోవడం సిగ్గుచేటు. ప్రజలంతా కలిసి పోరాడితేనే తెలంగాణ వచ్చింది. కేవలం కెసిఆర్ పోరాడితే రాలేదని గుర్తించలేకపోతున్నారు. అధికారం పోవడంతో ఉండలేకపోతున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం వందరోజుల పాలన పూర్తి చేసుకుంది. డిసెంబర్ 7 సీఎంగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశాక ఆయన తో పాటు, మంత్రులు కూడా బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారు. అదేపనిగా బిఆర్ఎస్‌ను వారు విమర్శలు చేయడం లేదు. కేవలం చేస్తున్న బిఆర్ఎస్ నేతలు విమర్శలపై మాత్రమే ఖండిస్తున్నారు. అప్పులు ఎలా జరిగాయో ప్రజలకు వివరిస్తున్నారు. ఇక వందరోజుల పాలన అంతా సజావుగా సాగుతోంది. అయితే ఇప్పటి వరకు రేవంత్ రెడ్డి , ఆయన టీమ్ కేవలం వారు హామీ ఇచ్చిన పనులను మాత్రమే చేసి చూపారు. కానీ హామీ ఇవ్వని పనులు గ్రామాల్లో కోకొల్లలు. మంత్రులు ఎవరికి వారు వారి శాఖల్లో ఉన్న సమస్యలపై స్పందించాల్సి ఉంది. ప్రధానంగా పంచాయితీల్లో అంటే..గ్రామాల్లో ఇంటి వారసత్వం కొడుకులు లేదా కూతుళ్లకు బదిలీ అయ్యేది. తండ్రి చనిపోగానే ఓ తెల్ల కాగితం రాస్తే..బదిలీ చేశారు. ఈ పద్దతిని గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఎత్తేసింది. గ్రామాల్లో ఇళ్లను కూడా తండ్రి మరణానంతరం బదిలీ చేసుకునేలా ఉన్న వెసలుబాటును పునరుద్దరించాలి. గ్రామ పంచాయతీ స్థాయిలో అటెండర్ దగ్గర నుంచి ఇవో వరకు లంచాలు మేయనిదే పనులు చేయడం లేదు. దీనిని సీరియస్‌గా తీసుకుని కఠిన ఆదేశాలు ఇవ్వాలి. గ్రామస్థాయిలోనే ప్లాస్టిక్ నిషేధాన్ని ప్రోత్సహించాలి. అవసరమైతే చట్టం చేయాలి. ప్లాస్టిక్, చెత్తా చెదారం ఎక్కడపడితే అక్కడ మోరీల్లో, రోడ్లపై వేశాక..పారిశుద్ద సిబ్బందితో ఎత్తివేయించడం కన్నా...వారు చెత్తా చెదారంతో పాటు ప్రధానంగా ప్లాస్టిక్ వ్యర్థాలు బయట వేయకుండా కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క దీనిని తక్షణ కర్తవ్యంగా స్వీకరించాలి. ఇకపోతే గతంలో వైఎస్ అధికారంలో ఉన్నా తరవాత కిరణ్ కుమార్ రెడ్డి, రోశయ్య, పదేళ్ల కెసిఆర్ పాలనలో దేవాదాయ భూములు అన్యాకాంతం అయ్యాయి. కౌలుకు తీసుకున్న దేవాలయ భూములకు కౌలు చెల్లించడం లేదు. కొన్నిచోట్ల కౌలుదారులు ఎమ్మార్వోల ను మేనేజ్ చేసి తమ పేరున పట్టాలుగా రాయించుకున్నారు. ధరణిలో ఎక్కించుకున్నారు. ఇలాంటి భూములను స్వాధీనం చేసుకుంటే ధూపదీప నైవేద్యాలకు డబ్బులు విదల్చాల్సిన అవసరం రాదు. ఇకపోతే కోతుల భయంతో ప్రజలు గ్రామాల్లో పంటలు వేయాలంటే భయపడుతున్నారు. ఇళ్లల్లో పాదులు కూడా పెట్టుకోవడం లేదు. ఇంటిముందున్న చెట్లను నరికేస్తున్నారు. ఇళ్లకు గేట్లు వేసుకుని కూర్చుఉంటున్నారు. ఇది ఓ ప్రధాన సమస్యగా మారింది. కుక్కల బెడదీ తీవ్రంగా ఉంది. దీంతో పర్యావరణం దెబ్బతింటోంది. కోతుల బెడదను తొలగించేందుకు లేదా తరలించేందుకు మార్గాలను అటవీశాఖ ఆలోచన చేయాలి. ఇది యువతకు ఉపాధిగా కూడా మార్చవచ్చు. దీనిపై మంత్రి కొండా సురేఖ ఆలోచన చేయాలి. గ్రామాల్లో చెరువుల పూడికతీతలు ఎక్కడా జరగలేదు. మిషన్ కాకతీయ పేరుతో నిధులు మింగారు. అలాంటి చెరువులను గుర్తించి ప్రజల భాగస్వామ్యంతో పునరుద్దరించాలి. చెరువుల ఆక్రమణలను తొలగించాలి. గ్రామాల్లో పారిశుద్ధ్యం కూడా ముఖ్యంగా గమనించాలి. గ్రామీణ రోడ్లను అభివృద్ది చేయాలి. నగరం నుంచి వెలపలకు వెళ్లే ప్రధాన రహదారులతో పాటు , సర్వీస్ రోడ్లను అభివృద్ధి చేయాలి. ఇవన్నీ కొన్ని సమస్యలు మాత్రమే. ఎందుకంటే సమస్యలను గుర్తించి పరిష్కరిస్తే ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుంది. తొలి రోజే ప్రగతి భవన్ వద్ద ఉన్న గేట్లను తొలగించి,. అక్కడ ప్రజల వినతులు స్వీకరించేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల్లో విశ్వాసం కలిగింది. ప్రజలు ఎక్కువగా తమ వ్యక్తిగత సమస్యలే ప్రస్తావిస్తారు. గ్రామాల వారీగా సమస్యలను గుర్తించే పనిని పార్టీపరంగా చేయాలి. జిల్లాల్లో సమస్యలు పరిష్కారం కాని వాళ్లు ఇక్కడకు వచ్చి వినతులు ఇవ్వాలని ప్రభుత్వం చెప్పింది. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రధాన కారణంగా ఆ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలు అమలవుతున్నాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలుపైనే రేవంత్ సర్కారు దృష్టి పెట్టింది. అలాగే గ్రామస్థాయిలో ఉన్న సమస్యలను పరిశీలించి, పరిష్కరిస్తే మంచిది. ముందుగా మంచినీటి సమస్యలతో పాటు, సాగునీటి సమస్యలు కూడా పరిష్కరించాలి. అవినీతికి ఆస్కారం లేని పాలనపై దృష్టి సారించాలి. ప్రజల్లో అప్పుడే మరింత విశ్వాసం కలుగుతుంది.



# మోడీ గ్యారెంటీ అంటే జైలుకు పంపడమేనా!



మోడీ గ్యారెంటీ అంటే...విపక్ష నేతలను జైళ్లకు పంపించడమేనని బెంగాల్ సిఎం మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలు సత్యదూరం కాదు. జార్ఖండ్ సిఎం హేమంత్ సోరెన్, కేజ్రీవాల్ అరెస్ట్ తరవాత విపక్షాల్లో కొంత భయం వచ్చింది. అయితే తప్పులు చేయనిదే ఇడి, సిబిఐ ఏమీ చేయలేవని తెలుసుకోవాలి. అలాగే చట్టాలకు తాము అతీతం అన్న భ్రమలను పాలకులు వీడాలి. ఢిల్లీ హైకోర్టు కేజ్రీవాల్ విషయంలో ఇదే వ్యాఖ్య చేసింది. సిఎం అయినంత మాత్రాన అవినీతి కేసుల్లో తప్పించుకోలేరని, అందిరిలాగే సిఎంకు కూడా చట్టం వర్తిస్తుందని తెలిపింది. అవినీతి చర్యలకు పాల్పడే వారు ఎంతటి ఉన్నతస్థానంలో ఉన్నా శిక్షకు గురి కావాల్సిందే. జగన్, కెసిఆర్ విషయంలోనూ అవినీతి కేసులను తవ్వి తీయాల్సిందే. అలాగే విపక్షాలు కూడా విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నాయి. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయి. అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అప్పులు చేసి, ఆస్తులు కూడబెట్టామని ప్రగల్భాలు పలుకుతున్నాయి. వేలకోట్ల అక్రమంగా సంపాదించి వ్యక్తిగత ఖజానాను నింపుకుంటు న్నాయి. తమ ముందున్న అన్ని మార్గాలను ఇందుకు వేదికగా చేసుకుని అక్రమాలకు పాల్పడుతున్నాయి. ఇందకు ప్రత్యక్ష ఉదాహరణ తెలుగు రాష్ట్రాలని చెప్పవచ్చు. తెలంగాణను లూటీచేసి, అప్పుల పాలు చేసిన కెసిఆర్ అధికారం కోల్పోవచ్చు గాక..చేసిన నష్టం పూడ్చడ మెలా అన్నది కూడా ముఖ్యమే. ఎపిలో ఇంతకంటే దారుణమైన పరిస్థితితులు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రాంతీలయ పార్టీల నేతలు చేస్తున్న అక్రమాలను నిలదీసేదెవరన్నదే ముఖ్యం. నిలదీయడమే కాదు.. అప్పులను ఎలా కడతారు.. ఎవరు కడతారన్నది కూడా ముఖ్యమే. అధికారం అనుభవించి, అప్పులు చేసిన వారు జవాబుదారీ తనం లేకుండా పోతే ఎలా? ఇకపోతే ప్రతిపక్షాలను వెంటాడే ముందు అధికార పక్షంలో అవినీతి జలగలను కూడా వదిలించాలి. అప్పుడే మోడీ చర్యల నిజాయితీ తెలుస్తుంది. ప్రతిపక్షం లేని ప్రజాస్వామ్య వ్యవస్థను సృష్టించడం సాధ్యం కాదు. తెలంగాణలో కెసిఆర్ కూడా ఇలాగే చేసి దెబ్బ తిన్నారు. విపక్ష కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలను అణగదొక్కితే తమకు తిరుగులేదని భావించారు. కాంగ్రెస్ ముక్త భారత్ కోసం మోడీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం వేయని ఎత్తులు లేవు. ఆర్థికంగా ప్రతిపక్షం పీకనొక్కడం ద్వారా కాంగ్రెస్ ముక్త్ భారత్' అన్న మోడీ 'కల' నెరవేర్చు కునేందుకు పన్నాగం పన్నుతూనే ఉన్నారు. దీంతో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రూపాయి పుట్టకుండా చేశారు. ఖాతాలను స్తంభింప చేశారు. దేశంలో అధికార పక్ష నేతల నుంచి కార్పొరేట్ సంస్థల అధి నేతల వరకు ఎంతో మంది పన్నుఎగవేత దారులున్నారు. అంతెందుకు నిన్నగాక మొన్న నీరవ్ మోడీ ఆస్తులు వేలానికి లండన్ కోర్టు అనుమతి ఇచ్చింది. ఇలా పన్నులు ఎగవేస్తున్న నేతల చిట్టా తీయాలి. మన దేశానికి చెల్లించాల్సిన పన్ను బకాయి లెంతగా ఎగవేశారన్నది కూడ ఆపారిపోయిన వారి విషయంలో లెక్కలు వేయాలి. దేశం వదిలి పారిపోయిన విజయ్ మాల్యా లాంటి వారిని ఎందుకు ఇంక ఉపేక్షిస్తున్నామో తెలుసుకోవాలి. కార్పోరేట్ కంపెనీటలకు పన్నులు మాఫీ చేయడం వంటి చర్యలు సహించరానదిగా భావించాలి. అలాంటి వారిని వదిలేసి దేశంలో అనేకులపైన దాడులు చేస్తున్నారు. రాజకీయ పార్టీలకు జరిమానాలు విధిస్తూ, నోటీసులు మీద నోటీసులు జారీ చేయడం దేనికి సంకేతం? అంటే..మమతా బెనర్జీ చెప్పినట్లుగా విపక్షాలను బొక్కలో తోయమడే తమ లక్ష్యమని నిరూపించుకుం టున్నాని అనుకోవాలి. 370 సీట్లు గ్యారంటీ అంటూ మోడీ లెక్కలు వేయడం వెనకా ఈ కుట్ర దాగివుందని విపక్షాలు ఆరోపిస్తున్నా యి. మొత్తంమీద కాంగ్రెస్‌కు సంబంధించిన 11 బ్యాంకు ఖాతాలను స్తంభింప చేసింది. ఎన్నికలు జరగనున్న సమయ ంలో ఇలా ప్రధాన ప్రతిపక్ష పార్టీ బ్యాంకు ఖాతాలు జప్తు చేయ డం అంటే ఆ పార్టీని ఆర్థికంగా నిస్తేజం చేయడమే. అంటే ఎన్నికల సమయంలో కాంగ్రెస్ తమ నాయకుల పర్యటన కోసం కనీసం రైలు టికెట్లు కొనే స్థితిలో కూడా లేకుండా చేయాలని మోడీ ప్రభుత్వం కుట్రగా ఉందిన రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు గమనార్హం. లెక్కలు చూపడంలో కాం గ్రెస్ అలస్యం చేసిన మాట వాస్తవం. అయితే పద్ధతి ప్రకారం, చట్టం ప్రకారం కాగ్రెస్‌పై చర్యలు తీసుకుని ఉంటే విమర్శలు రావు. 2017-18 నాటి లెక్కలు చూపనందుకు కూడా కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను జప్తు చేశారని రాహుల్ తెలిపారు. నిజానికి రాజకీయ పార్టీలు ఆదాయం పన్ను లెక్కలు కరెక్ట్‌గా చూపాలి. లెక్కలు ఆదాయపు పన్ను శాఖకు అందజేయాలి. ఈ విషయంలో కాంగ్రెస్ పొరపాటు చేసిందనే అనుకున్నా బ్యాంకు ఖాతాలు జప్తు చేయించడానికి ఎన్నుకున్న సమయం ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో స్పష్టంగానే తెలుస్తోంది. ఇంత తీవ్రమైన చర్య తీసుకోవడం వెనక విపక్షాలను ఎన్నికల సమయంలో ఆర్థికంగా దెబ్బచేయాలన్న కుట్ర దాగి ఉందను కోవడానికన్నా మించిన కారణం ఏమీ కనిపించడం లేదు. ప్రజాస్వామ్యం గొంతునొకడానికే తమ బ్యాంకు ఖాతాలు జప్తు చేశారని కాంగ్రెస్ ఆక్రోశించింది. కాంగ్రెస్ విషయంలోనో, వామపక్షాలపైనో ఈ దుర్నీతికి పాల్పడిందని సరిపెట్టుకోవడానికి వీల్లేదు. తప్పు చేసిన వారిని శిక్షించండంలో వెనకాడవద్దు. ప్రజాస్వామ్యంలో విశ్వాసం ఉన్న వారందరూ తీవ్రంగా పట్టించు కోవలసిన అంశమిది. ఎన్నికల బాండ్లలో బీజేపీ బండారం బయట పడిన వెనువెంటనే కేంద్రం కాంగ్రెస్‌పై ఆదాయ పన్నుశాఖ ను ఉసిగొల్పిందన్న విమర్శలూ ఉన్నాయి. ఎన్నికల ముంగిట లెక్కా పత్రం,హద్దూ పద్దూ లేని జరి మానాలు విధించి ప్రతిపక్షాలను ఎన్నికల ప్రచారం కూడా చేసుకో నీయకుండా ముందే ముందరి కాళ్లకు బంధాలు వేస్తోంది. మరో వైపు జార్ఖండ్ సీఎం సోరెన్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌లను అరెస్టు చేయడం,ఇతరులను దర్యాప్తుల పేరుతో వేధించడం, ఇదంతా గమనిస్తే ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా కమలదళం వేస్తున్న ఎత్తుగడలుగా భావించాలి. చట్టం అందరికీ ఒకేలా ఉండాలి. అందరినీ ఒకేలా చూడాలి. అధికార, విపక్షం అన్న విభేదాలు అస్సులు రాకూడదు. అవినీతి విషయంలో కూడా అందరినీ ఒకే గాటన కట్టాలి. అప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం మనగులుగుంది.

# గాంధీ కుటుంబ కనుసన్నల్లోనే పార్టీ

**- షాడో అధ్యక్షుడిగా నేతలను శాసిస్తున్న రాహుల్ - రాహుల్ సూచనలతోనే రానున్న ఎన్నికలపై వ్యూహం**





**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీలో నాయకత్వం మారినా..పెత్తనం అంతా ఇప్పటికీ ఆ ముగ్గురి చేతుల్లోనే ఉంది. వారి కనుసన్నల్లోనే పార్టీ నడుస్తోంది. సోనియా,రాహుల్, ప్రియాంకలే నిర్దేశం చేస్తున్నారు. ఎందరు నేతలు ఉన్నా గాంధీ కుటుంబ సభ్యులకు మించిన నాయకులు కనపడదం లేదు. రాహుల్ స్థానంలో రాగలిగిన నాయకుడెవరూ కాంగ్రెస్‌లో కనపడడం లేదు. రానున్న రోజులన్నీ కాంగ్రెస్‌కు పరీక్షను నిలిపేవే. రాహుల్ పార్లమెంట్ ఎన్నికల పోరులో విజయం సాధించేందుకు ఎలా కష్టపడతారన్నదే ముఖ్యం. ఎందుకంటే ఇప్పటి వరకు అన్నాచెల్లెళ్లు పెద్దగా సాధించేందేమీ లేదు. అలాగే వారు సాధిస్తారన్న ఆశలు కూడా లేవు. ఇకపోతే వీరిని కాదని సోనియా ఎలాంటి నిర్ణయం తీసుకునేలా లేరు. మరీ ముఖ్యంగా అధికారం దక్కితే రాహుల్‌కే పగ్గాలు కట్టబెట్టాలన్నది సోనియా వ్యూహంగా ఉంది. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ తన సత్తానిరూపించుకోవాల్సి ఉన్నది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎక్కడా పెద్దగా ప్రభావం చూపలేదు. అయితే కర్నాటక, ఆ తరవాత తెలంగాణలో అధికారం దక్కడంతో కొంత ఊరట లభించింది. ప్రియాంకకు పగ్గాలు అప్పగిస్తే ఏమైనా అదృష్టం మారుతుందా అని కూడా కొందరు ఆలోచన చేస్తున్నారు. కాంగ్రెస్‌ను తుడిచిపెడితే బిజెపికి దేశంలో ఇక తిరుగుండదు. ఆ తర్వాత భారత రాజకీయాలు పూర్తిగా బిజెపి చేతుల్లోకి మారుతాయి. ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ కూడా పూర్తిగా కనుమరుగు కానుంది. కాంగ్రెస్ కనుమరుగు అయితే ప్రాంతీయ పార్టీలను బలిచక్రవర్తిలా తొక్కేయాలని మోడీ చూస్తారు. వివిధ పద్ధతులతో మోదీ ప్రస్తుతం అనుసరిస్తున్న వ్యూహం కారణంగా కాంగ్రెస్ గింగిరాలు కొట్టుకుంటోంది. ఐటి శాఖ నోటీసులు, అకౌంట్లు సీజ్ చేయడం, జరిమానాలు విధించడం అంతా ఓ పద్ధతి ప్రకారం సాగుతున్నాయి. కాంగ్రెస్ విముక్త భారత్ అన్న నినాదం పూర్తిగా సాకారం అయ్యే దిశగా భారత రాజకీయాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ పూర్తిగా అంతమయితే ప్రాంతీయ పార్టీలను తుడిచిపెట్టడం బిజెపికి పెద్ద విషయం కాకపోవచ్చు. ఎందుకంటే ప్రాంతీయ పార్టీలన్నీ అవినీతి ఊబిలో కూరుకుని పోయాయి. ఈ అవినీతే అస్త్రంగా మోడీ వాటిని దునుమడే అవకాశం ఉంది. బలమైన ప్రతిపక్షం లేకుంటే నిరంకుశ విధానాలు అవలంబించేలా ప్రభుత్వ విధానాలు ఉంటాయి. అది దేశానికి క్షేమకరం కాదు. కాంగ్రెస్ పునరుద్ధరణ కాంగ్రెస్‌కు మాత్రమే ముఖ్యం కాదు, మొత్తం ప్రజాస్వామ్యానికి, మన సమాజానికి కూడా ఎంతో ముఖ్యం అని గుర్తించాలి. కాంగ్రెస్ జీవన్మరణ సమస్య నెదుర్కొంటున్నదని స్పష్టంగా తెలుసు. ప్రత్యర్థి చేతుల్లో ఓడిపోడం కంటే శాయశక్తులా పోరాడి కనీసం జీవించేందుకు ప్రయత్నించక తప్పనిసరి పరిస్థితిలో కాంగ్రెస్ ఉన్నది. ఇక ప్రస్తుతం ఓ ఎంపిగా మాత్రమే ఉన్న రాహుల్ షాడో అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. రాహుల్ నాయకత్వాన్ని ప్రశ్నించగల ధైర్యం కాంగ్రెస్ పార్టీలో ఎవరికీ లేదు. అయినా ఆయన భారత్ జోడో యాత్ర తరవాత పరిస్థితి మారుతోంది. క్రమంగా కాంగ్రెస్ పట్ల ప్రజల్లో కూడా ఆదరణ పెరుగుతోంది. కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ రాహిత్యాన్ని ఉల్లఘించినా పెద్దగా పట్టింపు ఉండదు. రెండు రకాలుగా నేతలను కాంగ్రెస్ అధిష్టానం పోషించడం అనాదిగా వస్తోంది. అందుకే అది అరాచక పార్టీగా పేరొందింది. అసమ్మతి లేకుండా గట్టిగా హెచ్చరికలు చేసిన దాఖలాలు లేదు. తెలంగాణలో ఇప్పుడు పిసిసి చీఫ్‌గా ఉన్న రేవంత్‌కు కూడా ఆ బాధ తప్పడం లేదు. కాంగ్రెస్‌లో అసమ్మతి నడిపడం ద్వారా నేతగా బలపడాలన్నదే కొందరి లక్ష్యంగా ఉంటుంది. తాజా పరిణామాలతో పార్టీలో నాయకులు అందరినీ కలుపుకుని విజయం వైపు నడిపించాలన్న ఆలోచనలో రాహుల్ ఉన్నట్లుగా ఉంది.దాని గురించి ఆ పార్టీ నాయకులు ఆలోచించాల్సి ఉన్నది. ఇందుకు అవసరమైన విశ్వసనీయమైన సమిష్టి నాయకత్వ బృందం ఏర్పర్చుకోవాల్సిన అవసరం ఉన్నది. రాష్ట్రాల్లో అసమ్మతి నేతలు చెలరేగకుండా చూసుకోవాలి. ముందు పార్టీలో చిల్లర రాజకీయాలను తగ్గించుకోవాలి. కలసికట్టుగా పోరాడాలన్న కార్యాచరణ సిద్ధం చేసుకోవాలి. అప్పుడే కాంగ్రెస్ కొంతయినా ప్రభావం చూపగలదు.

# బలమైన విపక్షం కూడా అవసరమే!

ప్రజాస్వామ్యం బలంగా సాగాలంటే బలమైన ప్రతిపక్షం అవసరం. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలపడాలను కుంటున్నా.. బలమైన నిర్ణయాలు తీసుకోవడం లేదు. బలంగా పోరాడడం లేదు. కనీసం ఇతర పక్షాలను కలుపుకుని పోవడంలోనూ వైఫల్యం కానవస్తోంది. ఇండియా కూటమిని బలంగా నిర్మించడం లోనూ విఫలమయ్యింది. దేశం ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నా...ప్రతిపక్షాలు ఉమ్మడిగా మోడీ ప్రభుత్వాన్ని నిలదీయలేక పోతున్నాయి. ప్రభుత్వ విధానాలను నిగ్గదీయలేకపోతున్నాయి. ఈ ఎన్నికల్లో కూడా పోటీని ఇచ్చేలా కనపడడం లేదు. ఎందుకంటే నితీశ్ మళ్లీ ఎన్డీఎ గూటికి చేరగా, మమతా బెనర్జీ సైలెంట్‌గా ఉన్నారు. కేజ్రీవాల్ జైలుకు వెళ్లారు. లా చెప్పుకుంటూ పోతే పెద్దగా బలమైన కూటమిగా కాంగ్రెస్ కానరావడం లేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ ఆకర్శణీయమైన మేనిఫెస్టోను ప్రకటించింది. దీనిపై ప్రజలు ఎలా స్పందిస్తారన్నది చూడాలి. అయితే ప్రధాన సమస్యలను చర్చించడంలో కాంగ్రెస్ మేనిఫెస్టో కూడా విఫలం అయ్యింది. ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న నిరుద్యోగం, జిఎస్టీ తదితర అంశాలపై స్పష్టత కానరావడం లేదు. మరోవైపు కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నా, తన పాత్రను బలంగా నిర్వహించలేక పోతున్నది. మిగతా పార్టీలను కలుపుకుని అధికారపార్టీ ఆగడాలను అడ్డుకోలేకపోతున్నది. ప్రజలను అనేకానేక సమస్యలు వెన్నాడుతున్నాయి. ప్రజలు ప్రభుత్వ విధానాలతో నానాయాతన పడుతున్నారు. ప్రధానంగా పెట్రో ధరలు, గ్యాస్ ధరలు, నిత్యావసర ధరలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిజానికి సమస్యలపై చర్చించే విషయంలో ఉమ్మడిగా పోరాడలేక పోతున్నాయి. నిజానికి దేశంలో కాంగ్రెస్ పార్టీ దుస్థితి గురించి ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిది. బలపడాలన్న కాంక్ష కనిపించడం లేదు. ప్రజల పక్షాన పోరాడాలన్న తపన కానరావడం లేదు. ఒకరకంగా ప్రతిపక్ష పార్టీ బలంగా లేకపోవడం వల్ల మోడీ ఆడింది ఆటగా సాగుతోంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత తాము మరింత బలపడ్డామని, 400 సీట్లు సునాయాసంగా గెలుస్తామన్న ధీమా మోడీకి ఏర్పడింది. దీంతో మోడీ ప్రభుత్వం ప్రతిపక్షాలను ఖాతరు చేయడం లేదు. వారు ఇచ్చే ఎలాంటి సూచనలను కూడా పరిగణించడం లేదు. ధాన్యం సేకరణపై జాతీయ విధానం కావాలని రైతులు పట్టుబట్టి పోరాడుతున్నా ఖాతరు చేయడం లేదు. దీనిని బట్టి రైతులపట్ల మోడీ ప్రభుత్వానికి ఏ మాత్రం ప్రేమ ఉందో గమనించవచ్చు. బిజెపి అగ్రనేతలకు, దానిని సమర్థిస్తున్న ఆర్ఎస్ఎస్ నేతలకు కూడా ఇదే ధీమా ఏర్పడింది. పెట్రోలియం ధరలు ఎడాపెడా పెంచడం ఇందుకు సంకేతం. అయితే మోదీ నుంచి ఇంకా ఎటువంటి కీలక నిర్ణయాలు వెలువడ నున్నాయా అని భయపడవలసి వస్తోంది. ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులు, బీమా సంస్థల ప్రైవేటీ కరణ,లేబర్ కోడ్‌ల అమలు, ప్రభుత్వ ఆస్తుల నగదీకరణతో పాటు మరిన్ని ఆర్థిక సంస్కరణల విషయంలో మరింత వేగంగా చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. సాగు చట్టాలను వెనక్కు తీసుకున్నా రైతుల గురించి ఆలోచించే దాఖలాలు కనిపించడం లేదు. కనీస మద్దతుధరకు విలువ లేకుండా పోతుంది. మద్దతు ధరల కోసం రైతులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోలేదు. ఒంటరిగా పోరాడి నందున కాంగ్రెస్‌కు ఫలితం దక్కడం లేదు. ప్రధాన సమస్యలపై కలసికట్టుగా పోరాడేందుకు వ్యూహం పన్నడంలో రాహుల్, సోనియాలు పూర్తిగా విఫలం అవుతున్నారు. మోడీకి కూడా విపక్షాలు అంటే అలుసుగా మారింది. దేశం గురించి గొప్పలు చెప్పుకుంటున్న బిజెపి నేతలు కూడా ప్రజల సమస్యలపై చర్చించాలన్న ఇంగితాన్ని ప్రదర్శించడం లేదు. నేతలు ఎవరు కూడా మోడీకి భయపడి ఏమీ మాట్లాడడం లేదు. ఈ క్రమంలో దేశంలో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. నిజానికి దేశంలో నేటికీ పంటల కొనుగోళ్లకు సంబంధించి ,మద్దతు ధరలకు సంబంధించి స్పష్టమైన విధానాలు లేవు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను ఎలాగైనా కొనుగోలు చేసి...వాటిని ప్రజలకు చేర్చాలన్న విధానాలూ లేవు. పంటల కొనుగోళ్లకు సంబంధించి జాతీయవిధానం, ఆహారపంటల ఎగుమతుల విధానాలను అమలు చేయడం లేదని వ్యవసాయ నిపుణులు ఎప్పటినుంచో మొత్తుకుంటున్నారు. సమస్యలను ఎత్తి చూపడంలో విపక్షాలు విఫలం అవుతున్నాయి. దేశంలో విభిన్న వాతావరణ పరిస్థితులు..విభిన్న ఆహారపు అలవాట్లు ఉన్నందున.. ఏ ధాన్యం ఎక్కడ ఎంత అవసరమో ..దానికి అనుగుణంగా ఏ పంటలు అవసరమో కేంద్రం వద్ద ప్రణాళిక లేదు. సమస్యలపై సమగ్రంగా చర్చించాలన్న స్పృహ విపక్షాలకు లేదు. అధికారపక్షానికి అంతకకన్నా శ్రద్ధ లేదు. దేశంలో అనుత్పాదక రంగాలను పెంచి పోషిస్తూ.. దుబారా ఖర్చులు చేస్తున్నారు. వీటి గురించి ఎవరు కూడా నిలదీయడం లేదు. బ్యాంకులను ముంచినోళ్లను.. కంపెనీలు పెట్టి రుణాలు ఎగ్గొట్టినోళ్లను వెనకేసుకుని వస్తున్న మోడీ ప్రభుత్వం రైతులకు సంబంధించి ఆమోదయోగ్య విధానాలను మాత్రం రూపొందించడం లేదు. పంటల కొనుగోళ్లను రాష్ట్రాలకు వదిలేయడం వల్ల ధాన్య సేకరణ అన్నది ఇప్పటికీ ఓ మిధ్యగా మారింది. ఈ సమస్యలపై మోడీ దాటవేత ధోరణితో దేశం తీవ్ర సమస్యను ఎదుర్కోనుంది. అలాగే నిలదీ యకపోవడం వల్ల విపక్షాలు బలహీనంగా మారనున్నాయి. కాంగ్రెస్ ఈ అవకాశాలన్నీ వినియోగించు కోవడంలో పూర్తిగా విఫలం అయ్యిందనే చెప్పాలి. ఈ సమస్యలన్నీ ఎన్నికల ముందు చర్చించాల్సి ఉంది. అనేకానేక సమస్యలను ప్రస్తావించాల్సి ఉంది. విపక్షాలు కనీసం తమ ఎన్నికల ఎజెండాలో వీటిని పెట్టాలి. ప్రజలైనా ఆలోచన చేస్తారు. అప్పుడైన కొంత మేర అధికార బిజెపిలో కదలిక వస్తుందేమో చూడాలి.

## అంబేడ్కర్‌ను ప్రధానిగా అంగీకరించని గాంధీ

**నెహ్రూ ప్రభావంతో దూరం పెట్టిన మహాత్ముడు**

**ముంబై:** దేశంలో అంబేడ్కర్ ఎదుర్కొన్న వర్ణవివక్ష అంతాఇంతా కాదు. ఆయన జీవితమే అనుభవ పాఠంగా మారింది. స్వాతంత్ర్యానంతరం అంబేడ్కర్‌ను ప్రధానిని చేసివుంటే దేశ పరిస్థితి మరోటా ఉండేది. గాంధీ సైతం ఈ విషయంలో అంబేడ్కర్‌ను పక్కన పెట్టారనే చెప్పాలి. నెహ్రూ ప్రభావంతో ఆయన సుభాస్ చంద్రబోస్‌ను, స్వాతంత్ర్యానంతరం అంబేడ్కర్‌ను పక్కన పెట్టారు. 1927లో అంబేడ్కర్ 'బహిష్కృత భారతి' అనే మరాఠి పక్ష పత్రిక ప్రారంభించాడు. ఆ పత్రికలో ఒక వ్యాసం వ్రాస్తూ అంబేడ్కర్ ఇలా అన్నాడు. బాలగంగాధర్ తిలక్ గనుక అంటరానివాడుగ పుట్టివుంటే 'స్వరాజ్యం నా జన్మ హక్కు'అని ఉండేవాడు కాదంటాడు. అస్పృశ్యతా నివారణెళి నా ధ్యేయం, నా జన్మ హక్కు' అని ప్రకటించి ఉండేవాడని వ్రాశాడు. అంటే ఆనాడు అంబేడ్కర్ కులతత్వవాదుల బాధను ఎంతగా అనుభవించాడో దీన్ని బట్టి తెలుసుకోవచ్చు. అయితే అంటరాని వారుగా చూడబడుతున్న కులాల వారు తమ ఆత్మగౌరవాన్ని త్యాగం చేస్తూ సమాజ బాగు కోసం తాము చేసే వృత్తులను చేస్తున్నారని అటువంటి వారిని ఇతర వర్ణాల వారందరూ గౌరవించాలని పేర్కొన్నారు. ఇలా కుల, అంటరానితన సమస్యకు గాంధీ సామాజిక,సాంస్కృతిక పరిష్కారం చూపగా అంబేద్కర్ ఈ విషయంలో గాంధీతో విభేదించాడు. ఎందుకంటే దాని పర్యవసానాలు ఎలా ఉన్నాయో ఈనాడు చూస్తున్నాం. దీనిని ఆనాడే అంబేడ్కర్ మహాశయుడు ఊహించి ఉంటాడు. అందుకే ఆనాడే గాంధీతో అంబేడ్కర్ విభేదించాడు. నిజానికి ఆనాడే గాంధీ చిత్తశుద్ధితో ప్రయత్నం చేసివుంటే ఇవాళ సమాజం ఇంకెంతో ముందుకు..అంటే అంబేడ్కర్ ఆశించిన విధంగా పోయి వుండేది. గాంధీజీతో అనేక విషయాలలో విభేదించినా తాను మతం మారదలచు కున్నప్పుడు మాత్రం దేశానికి చాలా తక్కువ ప్రమాదకరం అయిన దానినే ఎన్నుకుంటానని ప్రకటించాడు.

## కుటుంబపెద్ద బాధ్యత ఇలాగే ఉంటుందా ?

భారతదేశ రాజకీయాలను పూర్తిగా నియంత్రించేందుకు రానున్న రోజుల్లో మోదీ ఇంకా ఎన్ని ఆయుధాలను ప్రయోగిస్తారో ఊహించలేం. ఆయన ఎక్కడి రోటిపాట అక్కడ పాడుతున్నారు. ఇప్పుడు కొత్త నినాదం ఎత్తుకున్నారు. ప్రజలంతా నా కుటుంబం అంటున్నారు. మంచిదే..మరి ప్రజల బాధలు వినాల్సిన పాలకుడిగా మోడీ ఆ పనిచేయడం లేదు. కేవలం తాను చేసిన గొప్పలను గోరంతలు కొండంతలుగా ప్రచారం చేస్తున్నారు. తెలంగాణలో రెండ్రోజుల పర్యటనలో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపారు. కాళేశ్వరంపై కేంద్రం చర్యలు తీసుకోదు. తీసుకుంటున్న రేవంత్ ప్రభుత్వాన్ని విమర్శించి బిఆర్ఎస్‌కు ప్రాణం పోసే ప్రయత్నం చేశారు. గతంలో కాళేశ్వరం బిఆర్ఎస్‌కు ఎటిఎం అన్న మోడీ ఏనాడూ అవినీతిపై చర్యలు తీసుకోలేదు. కేవలం 370 ఆర్టికల్, అయోధ్యను చూపి సమస్యలు పరిష్కరించానని, ఇది మోడీ గ్యారెంటీ అంటూ ఊదరగొట్టారు. ఈ రెండు కూడా ప్రజలకు కూడు పెట్టేవి కావు. మోడీ చేస్తున్న రాజకీయ విన్యాసాలు ఎక్కువ కాలం పనిచేయవని గుర్తించాలి. ప్రజలు ప్రధానంగా ధరలతో సతమతం అవుతు న్నారు. నిరుద్యోగం తాండవిస్తోంది. ఉపాధి రంగాలు దెబ్బతిన్నాయి. జిఎస్టీతో సామాన్యుల నడ్డి విరుగు తోంది. ప్రధానిగా ప్రజల్లో ఈ సమస్యలను ఏనాడు చర్చించడం లేదు. కుటుంబం అంటున్న మోడీ ఇవన్నీ చర్చించాలి. నిత్యం భజన చేస్తున్న వందిమాగధులు ఈ సమస్యలను అధినేత దృష్టికి తీసుకుని వెళ్లడం లేదు. అప్రజాస్వామిక చర్యలపై కోర్టులు మొట్టికాయలు వేస్తున్నా పట్టించుకోవడం లేదు. చండీగఢ్‌లో జరిగిన మేయర్ ఎన్నిక తీరును సుప్రీం తప్పుపట్టింది. దీనికి సమాధానం లేదు. లోక్‌సభ ఎన్నికల సమయంలో బిహార్, జార్ఖండ్‌లో ఈడీ స్వైరవిహారం చేస్తున్నాయి. జెఎంఎం కనుక ఎన్డీఏలో ఉండి ఉంటే ఇప్పుడు ఈడీ దాడులనుంచి సోరేన్‌కు బాధలు ఉండేవి కావు. అందుకే ఇవన్నీ పక్కన పెట్టి తను ఓ అవతార పురుషుడినని చెప్పుకోవడం.. చెప్పించుకోవడం ద్వారా మరోమారు ఎన్నిక కావాలని మోడీ చూస్తున్నారు. అందుకు తగ్గట్లుగానే విపక్షాల్లో అనైక్యత లేదు. వారిలో నిబద్ధత లేదు. స్వార్థ రాజకీయాల్లో అవి కొట్టు మిట్టాడుతున్నాయి. ప్రజల సమస్యలను బలంగా వినిపించే గళం లేకుండా పోయింది. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేందుకు విపక్షాలు సర్వశక్తులు ఒడ్డుతున్నా లాభం లేదని తెలుస్తోంది. మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే తమ మనుగడ ఏమవుతుందో అని కొన్ని రాజకీయ పార్టీలు భయపడడం, మరి కొన్ని రాజకీయ పార్టీలు ఈ భయంతోనే మోదీ అండదండలకు ప్రయత్నించడం జరుగుతోంది. ఎపిలో జగన్, టిడిపి కూటమి ఇదే కోరుకుంటోంది. మోదీ ప్రాపకం ఉంటే చాలని మోకరిల్లే పరిస్థితికి వచ్చాయి. నిజంగానే మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే అసలు ప్రతిపక్షమే ఉండకపోవచ్చు. కాని ఈ భయం ప్రజల్లో ఏర్పడడం లేదు. కాంగ్రెస్ తదితర పక్షాల తీరు కారణంగానే మోడీ బలోపేతం అవుతున్నారు. దక్షిణాదిన తెలంగాణ, కర్ణాటకలో సాధించిన ఫలితాలు కాంగ్రెస్ ఇతర రాష్ట్రాల్లో ఎందుకు సాధించలేకపోతోందని వివేచన చేయడం లేదు. జాతీయ స్థాయిలో ఒక బలమైన ప్రత్యామ్నాయాన్ని ఏర్పర్చుకోవడం మాత్రమే కాదు, ఈ ప్రత్యామ్నాయాన్ని నీరుకార్చేందుకు చేసే ప్రయత్నాలను వమ్ము చేసే నాయకత్వం కూడా దేశానికి అవసరం. ఈ లోటు స్పష్టంగా కనపడుతోంది. కేవలం రాహుల్‌ను ముందు పెట్టడం ద్వారా ప్రజల ఆకాంక్షలను ప్రతిఫలించలేవు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎజెండాగా చేసుకుని ముందుకు సాగడంలో కాంగ్రెస్ తదితర పక్షాలు పూర్తిగా విఫలం అవుతున్నాయి. వారికి ఏది సమస్యనేది తెలియడం లేదు. ఈ క్రమంలోనే రెండ్రోజుల తెలంగాణ పర్యటనలో మోడీ కేవలం తన వాక్చాతుర్యంతో స్థానిక బిజెపి నేతలు ఇచ్చిన సమాచారంతో మాట్లాడారని గుర్తించాలి. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ కొత్త ఏటీఎంలా మారిందని ప్రధాని మోదీ చేసిన ఆరోపణలో రాజకీయం తప్ప నిజాలు లేవనే చెప్పాలి. రాష్ట్రంలో డబ్బు దోచుకొనే పనిలో ఆ పార్టీ బిజీ అయ్యిందని విమర్శించడం ద్వారా తనస్థాయిని ప్రధాని మోడీ తక్కువ చేసుకున్నారు. ఎందుకంటే రాష్ట్రాన్ని దోచుకున్న బిఆర్ఎస్‌ను ఏమీ చేయలేని అసమర్థ ప్రధానిగా మోడీ పేరు సంపాదించుకున్నారు. ఇది తెలంగాణ పల్లెల్లో ఎక్కడికి వెళ్లినా ప్రజలే చెబుతారు. బిఆర్ఎస్‌తో మోడీ కుమ్మక్కయ్యారని చెబుతారు. అవినీతికి పాల్పడుతున్న కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీలపై మోదీ పాలనలో సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్‌స్ట్రైక్స్ ఉంటాయని హెచ్చరించడం ద్వారా బెదిరింపు రాజకీయాలకు పాల్పడ్డారనే చెప్పాలి. తెలంగాణతో పాటు దేశంలోని ప్రజలంతా మూడోసారి బీజేపీకి పట్టం కట్టాలని, 400 ఎంపీ సీట్లు గెలిపించాలని కోరారు. అలా చేయాలంటే ప్రజలు ఏం కోరుకుంటున్నారో మోడీ గుర్తించాలి. కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలపై మోదీ ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ అవినీతిని బట్టబయలు చేస్తుండటం తో ఆ పార్టీ తనపై విమర్శలు చేస్తున్నదని వెల్లడించారు. అవినీతి విషయంలో ఎన్ని చర్యలు తసీఉకున్నా ఎవరికీ అభ్యంతరం లేదు. అంత ఖచ్చితంగా ఉండివుంటే కెసిఆర్, జగన్‌ల అవినీతిపై ఎందుకు ఉపేక్షిస్తు న్నారో బహిరంగ ప్రకటన చేయాలి. తనకు కుటుంబం లేదంటూనే ఇండియా కూటమి తనపై అనైతిక యుద్ధానికి దిగుతున్నదని చెప్పారు. దేశంలోని ప్రతి వ్యక్తి మోదీ కుటుంబ సభ్యుడేనని, తనను ప్రజలంతా తమ కుటుంబసభ్యునిగా భావిస్తున్నారని అన్నారు. ప్రజలపై అంతగా ప్రేమ ఉంటే వారి సమస్యలు వినాలి. వారు ఎదుర్కొంటున్న సమస్యలపై క్షేత్రస్థాయి నివేదికలు తెప్పించుకోవాలి. పరిష్కారం చూపాలి. వారసత్వ రాజకీయ పార్టీలకు మోదీ భయం పట్టుకున్నదని పదేపదే చెప్పి ప్రజలను నమ్మించ లేరు. దేశాన్ని మూడో అతి పెద్ద ఆర్థికశక్తిగా తీర్చిదిద్దుతానని, ఇది తన గ్యారెంటీ అని వెల్లడించారు. మోదీ గ్యారెంటీ అంటే తప్పకుండా అవుతుందని అన్నారు. నిజంగా ఇంతగా అభివృద్ధి చెందితే ప్రజలు ఎందుకు అథఃపాతాళంలోకి తొక్కబడుతున్నారో మోడీ చెప్పాలి. ఎందుకు బతికి బట్టలేక పోతున్నారో చెప్పాలి. ఎందుకు తిండికి కూడా కష్టపడుతున్నారో చెప్పాలి. పెరుగుతున్న ధరలను ఎలా కంట్రోల్ చేస్తారో చెప్పాలి. పెరుగుతున్న ఔషధ ధరలను ఎవరు నియంత్రిస్తారో చెప్పాలి. ఇవన్నీ చెప్పి, ప్రధానిగా చర్యలు తీసుకుని ఉంటే మోడీ తప్పకుండా ప్రతి ఒక్కరి కుటుంబ సభ్యుడు అవుతారు.

## దళితులకు ప్రత్యేక నియోజకవర్గాలు

**- బ్రిటిష్ సామ్రాజ్యంలోనే అంబేడ్కర్ పట్టు - విభేదించిన గాంధీ మహాశయుడు**

**న్యూఢిల్లీ:** భారతదేశంలో1919 మాంటేగ్ చేమ్స్ ఫర్డ్ సంస్కరణలు ఎలా పనిచేస్తు న్నాయో అధ్యయనం చేయడానికి, నూతన రాజ్యంగ సంస్కరణల కోసం సూచించేందుకు ఏర్పాటు చేసిన సైమన్ కమిషన్ భారతదేశాన్ని 1928లో పర్యటించింది. ఆ పర్యటన అనంతరం ఆ కమిటీ బ్రిటిష్ ప్రభుత్వానికి అందించిన నివేదికను చర్చించడానికి బ్రిటిష్ ప్రభుత్వం మూడు రౌండ్ టేబుల్ సమావేశాలను ఏర్పరచింది. ఈ సమావేశాలు 1930, 1931, 1932 లలో జరిగాయి. ఈ మూడు సమావేశాలకు అంబేద్కర్ హాజరు కాగా రెండవ సమావేశంలో భారత జాతీయ కాంగ్రెస్ తరపున గాంధీ హాజరు అయ్యారు. ఈ సమావేశాంలోనే గాంధీకి అంబేద్కర్‌కు మధ్య భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. అంబేద్కర్ దళితులకు ప్రత్యేక నియోజక వర్గాలు ఇవ్వాలని పట్టుబట్టగా, అలా ఇస్తే హిందూ సమాజం విచ్ఛిన్నమవుతుందని అందుకు గాంధి ఒప్పుకోలేదు. ఏకాభిప్రాయం కుదరక పోవడంతో రెండవ రౌండ్ టేబుల్ సమావేశం నుండి గాంధీ బయటకు వచ్చేసారు. 1932 లో రామ్సే మెక్ డోనాల్డ్ 'కమ్యూనల్ అవార్డు'ను ప్రకటించడం జరిగింది. దీని ప్రకారం దళితులకు ప్రత్యేక నియోజక వర్గాలు ప్రతిపాదించారు. ఈ ప్రకటన వెలువడే నాటికి గాంధి శాసనోల్లంఘన ఉద్యమంలో భాగంగా అరెస్ట్ అయి ఎరవాడ జైలులో ఉన్నారు. ఈ ప్రకటన గూర్చి తెలుసుకొని గాంధీ నిరాహారదీక్ష చేపట్టారు. అంబేద్కర్ పై నైతిక ఒత్తిడి పెరిగింది. చివరికి గాంధీకి అంబేద్కర్‌కు మధ్య పూనా ఒప్పందం కుదిరి కమ్యూనల్ అవార్డ్ కన్నా ఎక్కువ స్థానాలు ఉమ్మడి నియోజక వర్గాలలో ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. దీని తర్వాత గాంధి 'హరిజన్ సేవక్ సమాజ్' ఏర్పరచి అస్పృస్యత నివారణకు కృషి చేసాడు. అంబేద్కర్ ను కూడా ఇందులో భాగస్వామిని చేసాడు.. కాని అంటరానితన నిర్మూలనలో గాంధీకున్న చిత్తశుద్ధి మిగిలిన కాంగ్రెస్ నాయకులకు లేదు. దీనితో అంబేద్కర్ గాంధి ఉద్యమం నుండి బయటకు వచ్చి ప్రత్యేకంగా దళిత సమస్య పరిష్కారానికి ఆలిండియా డిప్రేస్సేడ్ క్లాస్ కాంగ్రెస్, ఆలిండియా షెడ్యూల్ కాస్ట్ ఫెడరేషన్ వంటి అనేక రాజకీయ పార్టీలను ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా దళితులను సమీకరించే ప్రయత్నం చేసారు. ఈ సందర్భంలో క్విట్ ఇండియా ఉద్యమం, ఆ తరువాత దేశ విభజనతో కూడిన స్వాతంత్య్రం రావడం జరిగాయి.

## అంబేడ్కర్‌పై రాజ్యాంగ రచన భారం

**ఆయన పుస్తకాలు నేటికీ ప్రామాణికం**

**న్యూఢిల్లీ:** రాజ్యంగ పరిషత్తు సభ్యుడిగా, మంత్రివర్గ సభ్యుడిగా అంబేద్కర్ చేసిన కృషి అనన్య సామాన్యమైనది. ఆయన రాజ్యంగ భారాన్నంతా ఒక్కడే తన భుజస్కంధాలపై మోసాడు. రాజ్యాంగ పరిషత్తు సభ్యుడుగా అంబేద్కర్ విశేషంగా శ్రమించి రాజ్యాంగం రచించటం ఆయన శేష జీవితంలో ప్రముఖమైన ఘట్టం. నాటి కేంద్రమంత్రి టి.టి కృష్ణమాచారి ఒకమారు రాజ్యాంగ పరిషత్తులో మాట్లాడుతూ 'రాజ్యాంగ రచనా సంఘంలో నియమితులైన ఏడుగురిలో ఒకరు రాజీనామా చేశారు. మరొకరు మరణించారు. వేరొకరు అమెరికాలో వుండి పోయారు. ఇంకొకరు రాష్ట్ర రాజకీయాలలో నిమగ్నులయ్యారు. ఉన్న ఒక్కరిద్దరు ఢిల్లీకి దూరంగా ఉన్నారు. అందువల్ల భారత రాజ్యాంగ రచనా భారమంతా డా.అంబేద్కర్ మోయవలసి వచ్చింది. రాజ్యాంగ రచన అత్యంత ప్రామాణికంగా వుంటుందనటంలో ఏలాంటి సందేహం లేదన్నాడు. కేంద్ర మంత్రిమండలిలో న్యాయశాఖ మంత్రిగా వుండి 1951 అక్టోబరులో మంత్రి పదవికి రాజీనామా చేశాడు. ముఖ్యంగా సాంఘిక సంస్కరణలకు శ్రీకారం చుడుతూ అంబేద్కర్ పెక్కు గ్రంథాలు వ్రాశాడు. 'ది ప్రాబ్లం ఆఫ్ ది రూపీ', 'ప్రొవిన్షియల్ డీ సెంట్రలైజేషన్ ఆఫ్ ఇంపీరియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటీష్ ఇండియా', 'ది బుద్ధా అండ్ కార్ల్ మార్క్స్', 'ది బుద్ధా అండ్ హిజ్ ధర్మ' ప్రధానమైనవి. ప్రసిద్ధ రచయిత బెవెర్లి నికొలస్ డాక్టర్ అంబేద్కర్ భారతదేశపు ఆరుగురు మేధావులలో ఒకరు అని ప్రశంసించాడు.

# అవినీతి మరక అంటితే సిఎం అయినా లెక్కలేదు

## - గతంలో తమిళనాడు సిఎంగా జయలలితపై అవినీతి కేసు - జార్ఖండ్ సిఎం హేమంత్ సోరేన్‌కు అదేగతి







**న్యూఢిల్లీ:** ఢిల్లీ లిక్కర్ కేసులో ఆమ్ ఆద్మి పార్టీ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేయడంతో ఇప్పుడు అనేక ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. సిఎంగా అధికారంలో ఉండగా ఓ రాష్ట్ర ముఖ్యమంత్రిని దర్యాప్తు సంస్థలు అరెస్టు చేయవచ్చా అనే సందేహాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. దీనికి చట్టం ఏం చెబుతోంది..? అందుకు సంబంధించిన విధివిధానాలు ఏమిటి అనే విషయాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారయి. అయితే తమిళనాడు సిఎంగ ఆఉన్న సమయంలో జయలలితపై అవినీతి కేసులు నమోదయ్యాయి. ఆమెను అరెస్ట్ చేసే సమయం రావడంతో రాజీనామా చేసి, తన స్థానంలో పన్నీరు సెల్వంను సిఎంగా చేసి సందర్భం ఉంది. ఇకపోతే చట్టం దృష్టిలో ప్రతి భారతీయుడు సాధారణ వ్యక్తే.అన్నది రాజ్యాంగం చెబుతోంది. ఇందుకు ఎటువంటి నిబంధనలు లేనందువల్ల వారిపై క్రిమినల్ నేరం నమోదైతే దేశ ప్రధానమంత్రినైనా అరెస్ట్ చేయవచ్చుని నిపుణులు అంటున్నారు. పాలకుల నుంచి సాధారణ వ్యక్తుల వరకు ఈ నియమం అందరికీ వర్తిస్తుందని చెబుతున్నారు. అయితే రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతిని మాత్రమే పదవిలో ఉన్నప్పుడు అరెస్టు చేయడానికి వీలులేదు. ఆర్టికల్ 361 ప్రకారం భారత రాష్ట్రపతి, రాష్ట్రాల గవర్నర్లు.. వారి అధికార విధులకు సంబంధించి కోర్టులకు జవాబుదారీగా ఉండరు. ఈ నిబంధన కింద రాష్ట్రపతి, గవర్నర్ తన పదవికి సంబంధించిన అధికారాలు, విధులను అమలు చేయడం, వారు చేసిన, చేయాలనుకుంటున్న ఏదైనా చర్యకు ఏ న్యాయస్థానానికి జవాబుదారీగా ఉండనవ సరం లేదు. ఈ ప్రత్యేక మినహాయింపు ఒక్క రాష్ట్రపతి, గవర్నర్‌లకు మాత్రమే ఉంటుంది. అందువల్ల వారు పదవిలో ఉన్నప్పుడు క్రిమినల్ నేరాలలో కూడా అరెస్ట్ చేసే అధికారం ఎవరికీ లేదు. పదవీ విరమణ అనంతరం మాత్రమే వారిపై చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. వీరి పదవీకాలం ముగిసే వరకు సివిల్, క్రిమినల్ ప్రొసీడింగ్‌ల నుంచి నిరోధించవచ్చు. కానీ ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులకు ఈ రక్షణ ఉండదు. చట్టం ముందు అందరూ సమానమనేది ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రికి కూడా వర్తిస్తుంది. అందుకే వివిధ సందర్భాల్లో కొందరు రాజీనామా చేసిన సందర్భాలు ఉన్నాయి. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973 నిబంధనల ప్రకారం.. కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేస్తే ఏ వ్యక్తినైనా అరెస్టు చేయవచ్చు. నిందితుడు పరార్ అయ్యే అవకాశం ఉందని, సాక్ష్యాలను ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తాడని, చట్టపరమైన పక్రియ నుంచి తప్పించుకునే విధంగా ప్రవర్తిస్తాడనడానికి తగిన కారణం ఉంటే మాత్రమే వారిని అరెస్టు చేయాలి. ఈ లెక్కన ఓ రాష్ట్ర ముఖ్యమంత్రిని అరెస్ట్ చేసే అధికారం రాజ్యంగం ప్రకారం ఉంటుంది. అయితే సివిల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 135 ప్రకారం.. పార్లమెంటు సభ్యులు 40 రోజుల ముందు, 40 రోజుల తర్వాత, పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలో అరెస్టు చేయడానికి వీలులేదు. మూడు పార్లమెంటు సమావేశాలు ఒక్కొక్కటి 70 రోజులు ఉండటంతో, దాదాపు 300 రోజుల వరకు వీరిని అరెస్ట్ చేసే అధికారం ఉండదు. ఈ రక్షణ కేవలం సివిల్ కేసులకు మాత్రమే వర్తిస్తుంది. ఇతర నేరాల విషయంలో రాజ్యసభ, లోక్‌సభ సభ్యులెవరికీ రక్షణ ఉండదు.దేశ చరిత్రలో అత్యంత వివాదాస్పద రాజకీయనాయకుల్లో దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత ఒకరు. విలక్షణమైన వ్యక్తిత్వంతో తమిళనాడు రాష్ట్రానికిపలుమార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయితే ఆదాయానికి మించిన ఆస్తుల కేసుకు సంబంధించి దేశంలో మొట్టమొదటి సారి అరెస్ట్ అయిన సిట్టింగ్ ముఖ్యమంత్రిగా పేరుగాంచారు. గ్రామాలకు కలర్ టీవీ సెట్ల కొనుగోలులో అవినీతికి పాల్పడినందుకు ఆమెను డిసెంబర్ 7, 1996న అరెస్టు చేయగా.. నెలపాటు జైలులో ఉన్నారు. ఇలా జార్ఖండా సిఎం, ఇప్పుడు కేజ్రీవాల్ అరెస్ట్ అయ్యారు.

# కులగణనపై రాజకీయ తిరకాసు

జనగణన చేస్తే ఓబీసీల జనగణన చేయాల్సి ఉంటుందని భావించినందువల్లే బిజెపి ప్రభుత్వం కుల జనగణనను వ్యతిరేకిస్తోందని దేశ రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కులం ఆధారంగా జనగణన వల్ల సామాజిక, రాజకీయ భావోద్వేగాలు చెలరేగుతాయని కొందరు సామాజిక శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. కులగణన చేయాలన్న డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. దీనికితోడు మహిళా బిల్లులో రిజర్వేషన్ల కోసం విమర్శలు పెరిగాయి. వచ్చే ఏడాది సార్వత్రక ఎన్నికల లోపు జనగణన చేయడం సాధ్యమయ్యే అవకాశాలు కనపడడం లేదు. భారత రిజిస్ట్రార్ జనరల్ మాటిమాటికీ జనగణనను వాయిదా వేస్తూ రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖలు రాస్తున్నారు. కేంద్రం కూడా ఈ ఏడాది బడ్జెట్‌లో జనగణనకు కేటాయించిన నిధులను భారీగా తగ్గించి ఇప్పట్లో జనగణన చేసే ఉద్దేశం లేదని పరోక్షంగా ప్రకటించింది.

బహుశా తమకు రాజకీయంగా ప్రయోజనం ఉంటుందని భావించడం వల్లనే కుల జనగణన జరగాలని ఇటీవల ఇండియా కూటమి డిమాండ్ చేసింది. 1931లో జరిగిన కుల ఆధారిత జనగణనలో దేశంలో 52 శాతం ఓబీసీలు ఉన్నారని తేలింది. మండల్ కమిషన్ కూడా ఇదే శాతాన్ని నిర్ధారించింది. అప్పటి నుంచీ ఓబీసీలను లెక్కించే జనగణన దేశంలో జరగనే లేదు. దళితులు, ఆదివాసీల లెక్కతేలినా ఓబీసీలకు సంబంధించి జాతీయ స్థాయి డేటా ఎక్కడా లేదు. కుల జనగణన జరిగితే దేశంలో ముఖ్యంగా బిహార్, యూపీ వంటి రాష్ట్రాల్లో సామాజిక న్యాయ రాజకీయాలకు తావిచ్చినట్లవుతుంది. వారి ఆర్థిక, విద్యాపరమైన సామాజిక వెనుకబాటుతనం, వివిధ రాష్ట్రాల్లో వారి జనాభా, న్యాయవ్యవస్థ, విద్యారంగం, వివిధ ప్రభుత్వ సంస్థల్లో వారి వాటా గురించి చర్చ జరుగుతుంది. ఇప్పటికే బిహార్‌లో జనతాదళ్ (యునైటెడ్), రాష్ట్రీయ జనతాదళ్ ప్రభుత్వం కుల ఆధారిత సర్వేను నిర్వహించింది. దీని వల్ల అణగారిన వర్గాలకు ప్రయోజనం జరుగుతుందని బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అన్నారు. ఈ సర్వేను పాట్నా హైకోర్టు కూడా సమర్థించింది. నిజానికి మోదీ ప్రభుత్వం జమిలి ఎన్నికలపై దృష్టి సారించిందని కొద్ది రోజులుగా ఉధృత ప్రచారం జరుగుతూ వచ్చింది. జమిలి ఎన్నికల గురించి అందరూ ఆలోచిస్తున్న వేళ మోదీ కేబినెట్ మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించింది. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల ఎజెండాలో ప్రస్తావించకుండా మహిళా రిజర్వేషన్ బిల్లు గురించి సమావేశాలు ప్రారంభమయ్యే వరకూ రహస్యంగా ఉంచి సమావేశాల రెండో రోజు అనుబంధ జాబితాలో చేర్చింది. బిల్లుపై అందరి ఏకాభిప్రాయం కావాలనుకుంటున్న మోదీ ప్రభుత్వం కనీసం అఖిలపక్ష సమావేశంలోనైనా ఆ బిల్లు గురించి ఎందుకు ప్రస్తావించలేదు. మహిళా రిజర్వేషన్ తెర ముందుకు వచ్చిన ప్రతిసారీ ఓబీసీల రిజర్వేషన్‌పై చర్చ తీవ్రతరమవుతుందని తెలిసినప్పటికీ మోదీ ప్రభుత్వం ఈ చర్చను పెద్దగా పట్టించుకోవడం లేదని అర్థమవుతోంది. 1996లో దేవెగౌడ ప్రభుత్వ హయాంలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు అణగారిన మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్లు కావాలని ఓబీసీ నేతలు డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో మాదిరే వెనుకబడిన కులాలకు చెందిన మహిళలకు చట్టసభల్లో కూడా రిజర్వేషన్ కల్పించాలని అప్పుడు బిజెపి నేత ఉమాభారతి డిమాండ్ చేశారు. వెనుకబడిన వర్గాల మహిళలే అత్యధికంగా కష్టాల పాలవుతున్నారని గుర్తు చేశారు. ఈ బిల్లుపై దేవెగౌడ ప్రభుత్వం శరద్ పవార్, మమతా బెనర్జీ ప్రభృతులతో ఏర్పాటు చేసిన సెలెక్ట్ కమిటీ కూడా ఎస్సీ, ఎస్టీలతో పాటు ఓబీసీలకు కూడా చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరింది. వాజపేయి హయాంలో కూడా ఓబీసీ నేతలు ములాయం సింగ్ యాదవ్, లాలూ ప్రసాద్ యాదవ్‌లు మహిళా రిజర్వేషన్ బిల్లు వల్ల కేవలం అగ్రవర్ణాల మహిళలకే ప్రయోజనం జరుగుతుందని వాదించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఓబీసీలకు సంబంధించి చర్చను మరోసారి రేకెత్తించే అవకాశాలున్నాయి. దీని వల్ల ప్రతిపక్ష కూటమిలో చీలిక తేవాలన్నదీ కూడా మోదీ ప్రభుత్వ ఉద్దేశం కావచ్చు. మమతా బెనర్జీ వంటి నేతలు కుల జనగణనను అంగీకరించడం లేదు. కుల జనగణనను అడ్డుకోవడానికి మోదీ ప్రభుత్వం ఇప్పటికే రోహిణీ కమిషన్ నివేదికను ఒక అస్త్రంగా వాడుకోవాలని నిర్ణయించినట్లు కనపడుతోంది. ఓబీసీల్లో అత్యంత వెనుకబడిన వర్గాలను బిజెపి తమ వైపునకు ఇప్పటికే తిప్పుకునేందుకు ఉత్తరాదిన చేసిన ప్రయత్నాలు విజయవంతం అయ్యాయి. ఓబీసీల్లో అత్యంత వెనుక బడిన వర్గాలకు న్యాయం జరగలేదని, రిజర్వేషన్లు కేవలం 10 ఓబీసీ వర్గాలకే ప్రయోజనం చేకూర్చాయని, 983 ఓబీసీ వర్గాలకు సున్నా నుంచి మూడు శాతం మేరకే ప్రయోజనం దక్కిందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రోహిణీ కమిషన్ నివేదిక ప్రతిపాదన ప్రకారం ఓబీసీల ఉపవర్గీకరణ జరిగితే అత్యంత వెనుకబడిన వర్గాలకు న్యాయం చేయడం ద్వారా వారిలో తమ బలం మరింత పెంచుకోవచ్చునని బిజెపి భావిస్తోంది. మోదీ ప్రభుత్వం జనగణన చేసినప్పటికీ కుల ఆధారిత జనగణన చేసే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. దేశంలోని 95 కోట్ల మంది ఓటర్లలో దాదాపు 46 కోట్ల మంది మహిళా ఓటర్లు ఉన్నారని, పురుషుల కంటే ఎక్కువగా ఓటింగ్‌లో మహిళలే పాల్గొన్నారని గణాంక వివరాలు చెబుతున్నాయి. అందుకే మహిళా బిల్లుకోసం బిజెపి ఆరాట పడుతోందన్న విమర్శలు ఉన్నాయి.

# కాలం కలసిరాని నేతలు

## - ఊరించినట్లే ఊరించి పోతున్న పదవులు - అదృష్టం లేక డీలపడుతున్న నాయకులు

**హైదరాబాద్:** పదవులు ఊరికే రావు. పైగా చట్టసభల్లో ప్రాతినిధ్యం దక్కాలంటే ఆషామాషీ కాదు. కష్టపడ్డా.. కొట్లాడినా.. కాసులు పోగొట్టుకున్నా అదృష్టం కూడా ఉండాలి. బహుశా అది లేకే.. ఆ ముగ్గురు నేతలకు పదవులు అందని ద్రాక్షగా మారాయనే టాక్ వినిపిస్తోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రొఫెసర్ కోదండరాం క్రియాశీలకంగా వ్యవహరించారు. పొలిటికల్ జేఏసీ ఏర్పాటు చేసి అన్ని పార్టీలను ఏకతాటిపైకి తెచ్చారు. దశలవారీగా ఉద్యమాలు చేసి కేంద్రంపై ఒత్తిడి పెంచారు. రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించారు. ఉద్యమ సమయమంతా బీఆర్ఎస్‌కు అనుకూలంగా కేసీఆర్ వెంటే నడిచారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక.. కోదండరాంను పక్కన పెట్టారు. ఎలాంటి పదవులు దక్కకపోవడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. కోదండరాంను రాజ్యసభకు పంపిస్తారని లేందంటే ఎమ్మెల్సీగా చేసి మంత్రి పదవి ఇస్తారని ఇలా రకరకాల ప్రచారం జరిగింది. కానీ అవేవీ జరగలేదు. పైగా కేసీఆర్‌కు కోదండరాం మధ్య గ్యాప్ పెరిగింది. ఆ తర్వాత తెలంగాణ జన సమితి పేరుతో పార్టీ పెట్టారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచారు. దీంతో ఆయనకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ప్రభుత్వం నామినేట్ చేసింది. కోదండరాంను ఎమ్మెల్సీగా గవర్నర్ ఆమోదముద్ర వేశారు. ఇక ప్రమాణమే ఆలస్యం అనుకున్నారంతా. కానీ అంతలోనే హైకోర్ట్ ట్విస్ట్ ఇచ్చింది. ఎమ్మెల్సీల నియామకంపై బీఆర్ఎస్ నేత శ్రవణ్ హైకోర్టులో సవాల్ చేశారు. గతంలో తాము వేసిన పిటిషన్‌పై విచారణ తేలే వరకు ఎమ్మెల్సీల నియామకాలు ఆపాలని పిటిషన్‌లో కోరారు. పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. యథాతథ స్థితిని కొనసాగించాలంటూ ఆదేశాలిచ్చింది. దీంతో పదవి ఇలా వచ్చినట్టే వచ్చి అలా అగిపోయింది. వ్యక్తిగత హోదాలో ప్రజల కోసం పోరాడిన కోదండరాంను.. పదవి ఇప్పటికీ ఊరిస్తూనే ఉంది. అలాగే కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్‌కి దురదృష్టం నీడలా వెంటాడుతూనే ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి సీటు అద్దంకి దయాకర్ ఆశించారు. అక్కడ శామ్యూల్‌కి అధిష్టానం టికెట్ కేటాయించింది.

ఆ సమయంలో ఎమ్మెల్సీ లేదా ఇతర పదవులు ఇస్తామని దయాకర్‌కి హామీనిచ్చింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా దయాకర్ కు ఛాన్స్ ఇస్తారని అనుకున్నారు. కానీ, చివరి నిమిషంలో పార్టీ అధిష్టానం మరొకరికి ఛాన్స్ ఇచ్చింది. పదవి వచ్చినట్టే వచ్చి చేజారింది. అదృష్టం కూడా కలసి రాలేదు. దాసోజు శ్రవణ్.. నల్గొండ జిల్లాకు చెందిన నేత. తెలంగాణ ఉద్యమకారుడు, సామాజిక కార్యకర్త, విద్యావేత్త, కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్ ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉంటాయి. మేధావిగా పేరుంది. మంచి వాక్చాతుర్యం, ప్రతిపక్షాలకు కౌంటర్ ఇవ్వడం, మీడియా డిబేట్‌లో పార్టీ గళం వినిపించేవారిలో దాసోజు ముందు వరుసలో ఉంటారు. ప్రజా రాజ్యం, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలో పని చేసిన శ్రవణ్.. తిరిగి బీఆర్ఎస్‌లో చేరికతో ఎమ్మెల్సీ అవకాశం అందిపుచ్చుకున్నారు. ప్రజారాజ్యం పార్టీలో వ్యవస్థాపక పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, అధికారిక ప్రతినిధిగా పనిచేశారు. తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుడిగా, బీఆర్ఎస్ తరపున అపెక్స్ స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. అయితే గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేయడంతో ఫుల్ ఖుషీ అయ్యారాయన. అయితే గవర్నర్ కోటా కింద ప్రతిపాదించిన శ్రవణ్‌ను తమిళి సై తిరస్కరించారు. సాహిత్యం, వైజ్ఞానిక శాస్త్రం, కళలు, సమాజ సేవ రంగాల్లో అనుభవం లేదని శ్రవణ్ అభ్యర్థిత్వాన్ని తిరస్కరించారు. దీంతో ఎమ్మెల్సీ పదవికి నోచుకోకుండాపోయారు. ఇకపోతే ఎన్టీఆర్ సిఎంగా ఉన్న సమయంలో సీతాఫల్ మండికి చెందిన నేత నోముల ప్రకాశ్‌కు టిడిపి టిక్కెట్ ఖరారు అయ్యింది. కానీ అర్ధరాత్రి మోహన్‌బాబు రంగప్రవేశ్ చేసి ఆ టిక్కెట్‌ను తలసానికి ఇప్పించారు. తలసాని దశ తిరిగి అప్రతిహతంగా ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. నోముల ప్రకాశ్ అడ్రస్ లేకుండా పోయారు. తెల్గీ స్టాంపుల కుంభకోణంలో ఇరుక్కుపోయిన కృష్ణయాదవ్ తిరిగి ప్రస్థానం ప్రారంభించినా అదృష్టం కలసిరావడం లేదు. మొన్నటి ఎన్నికల్లో అంబర్‌పేట నుంచి ఓటమి పాలయ్యారు. ఇలా ఎందరినో దురదృష్టం వెన్నాడుతూనే ఉంది.

# బిఆర్ఎస్‌కు పొగపెడుతున్న రాజకీయాలు !

రాజకీయాలు ఎప్పుడూ అధికారం చుట్టే తిరుగుతాయి. అధికారం ఉన్న పార్టీకే ఆకర్శణ ఎక్కువ. సిద్దాంత నిబద్దతలకు ఇక్కడ తావు లేదు. అందుకే ఏ పార్టీలో గెలిచామన్న దానికి నేతలు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. అధికారంలో ఉన్న పార్టీలో ఉన్నామా లేమా అని బేరీజు వేసుకుంటున్నారు. కెసిఆర్ నేర్పిన సిద్దాంతం ఇది. ఆయన నేర్పిన సిద్దాంతాన్నే ఇప్పుడు కాంగ్రెస్ అనుసరిస్తోంది. గతంలో కాంగ్రెస్, సిపిఐ, టిడిపి ఎమ్మెల్యే నను నిస్సిగ్గుగా టిఆర్ఎస్‌లో చేర్చుకుని తెలంగాణ పునరేకీకరణ ముద్ర వేశారు. ఈ సూత్రాలే ఇప్పుడు పునరావృతం అవుతుంటే బిఆర్ఎస్ భుజాలు తుడుముకుంటోంది. సిగ్గు సిగ్గు అంటూ శివాలు వేస్తోంది. కెటిఆర్ లాంటి వారు రాజకీయ బేహారులు అంటూ విమర్శలు చేస్తున్నారు. ఎన్నికలంటేనే తిమ్మిని బమ్మిని చేయడం..ఎత్తులు పైఎత్తులు వేయడం....ఎదుటి వారిని బురిడీ కొట్టించడం.. అబద్దాలుచెప్పడం..ఆచరణ సాధ్యం కాని హామీలు గుప్పించడం.. ఓటర్లను ప్రలోభ పెట్టడం...ఇవన్నీ సర్వసాధారణం. మనమెంత నిజాయితీగా ఉన్నా..ఎదుటివారు అనుసరించే ఎత్తులను గమనించి ముందుకు సాగాలి. మనం నిజాయితీగా ఉంటూనే చెడును దునుమాడే ధైర్యం కూడా సొంత చేసుకోవాలి. రాజకీయంగా మనమెంత బలంగా ఉన్నా.. ఎదుటి పక్షం మనపై నిరంతరం బురదజల్లే ప్రయత్నం చేస్తుంది. బట్టకాల్చి మీద వేస్తుంటారు... ఇలాంటి అనుభవాలు మనకు లేకున్నా భరించాల్సిందే. అయితే వీటిని దీటుగా ఎదుర్కోవాలి. గట్టిగా తిప్పికొట్టాలి. ముల్లును ముల్లుతోనే తీయాలన్న సామెతను ఆధారం చేసుకుని ముందుకు సాగాలి. ప్రజల కోసం రాజకీయంలోకి దిగిన పార్టీలు కావచ్చు..నేతలు కావచ్చు...అందుకు దీటుగా ప్రచారాస్త్రాలను సంధించా ల్సిందే.. అందుకు వారి వాదనల ను బలంగా ప్రజలకు చేరవేయాల్సిందే. కొత్తగా నినాదాలు సిద్దం చేసుకోవాల్సిందే.. అయితే ఇదే క్రమంలో మనం చేసిన మంచిని ఒకటికి పదిసార్లు పదేపదే ప్రజల చెంతకు చేర్చాలి. అభివృద్ధి పనులను ప్రజల్లో చర్చ జరిగేలా చేయాలి. గత ఐదేళ్లలో ఏ పనికి ఎంత మొత్తం కేటాయించామో చర్చ జరిగేలా చేయాలి. ఎన్ని మంచిపనులు చేశామో లెక్కలతో సహా చెప్పగల గాలి. అలాగే అవినీతికి ఎంతగా దూరం ఉన్నామో కూడా ముఖ్యం. అలాగే అభివృద్ధి కళ్లకు కనపడుతుందా అన్నది కూడా ముఖ్యమే. కానీ ప్రచారంలోనే అభివృద్దిని చూపి అవినీతికి,అక్రమాలకు, అధికార దుర్వి యోగానికి పాల్పడ్డ విషయాలను బిఆర్ఎస్ నేతలు కనపడకుండా చేశామని అనుకున్నారు. అయితే ప్రజలకు ఇదంతా తెలిసిపోయింది. అందుకే బిఆర్ఎస్ అవినీతిని, అహంకారాన్ని భరించలేక పోయారు. బిఆర్ఎస్ విషయంలో ఇదే జరిగింది. సామాజిక మాధ్యమాలు బలంగా ఉన్న ఈ కాలంలో ప్రతి చిన్న అవినీతి, అక్రమం క్షణాల్లో ప్రజలకు చేరిపోతోంది.

# జలమే మానవాళికి జీవనాధారం



**బెంగళూరు:** బెంగళూరులో నీటి సమస్య తీవ్రం కావడంతో మనమెంతగా దూరదృష్టి లేకుండా మనుగడ సాగిస్తున్నామో అర్థం చేసుకోవచ్చు. నీటి వనరులను ధ్వంసం చేయడం, చెరువుల, కాలువను ధ్వంసం చేయడం వల్ల తీరని నీటి సమస్యను ఎదుర్కొంటున్నాం. తాగడానికి నానా తంటాలు పడుతున్నాం. కర్నాటక పరిస్థితులు మనకు ఓ హెచ్చరిక కావాలి. నీరు లేనిదే సమస్త జీవ కోటికి మనుగడ లేదు. అసలు జీవ పరిణామం ప్రారంభమైందే సముద్ర గర్భంలో అనే విషయం తెలిసిందే. ఒకప్పుడు పుష్కలంగా లభించే మంచి నీటిని అభివృద్ధి పేరిట కలుషితం చేస్తున్నాం. అవసరానికి మించి వాడుతూ వాటిని వృథా చేస్తున్నాం. దీంతో సమీప భవిష్యత్తులో నీటి కోసం యుద్దాలు జరిగే రోజులు కూడా రానున్నాయనడంలో ఆశ్చర్యమేమీ లేదంటే అతిశయోక్తి కాదేమో. ఈ పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతోనే ఐక్యారాజ్య సమితి 'ప్రపంచ జల దినోత్సవం' అంటే వరల్డ్ వాటర్ డే ను నిర్వహిస్తున్నది. ప్రతియేటా మార్చి 22న దీనిని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. వరల్డ్ వాటర్ డే.. పది ఆసక్తికర విషయాలు గగమనించాలి. ప్రపంచంలో నేడు ప్రతి ముగ్గురిలో ఒకరికి శుద్ధమైన తాగునీరు దొరకడం లేదు. 2050 నాటికి భూమి మీద నివసిస్తున్న వారిలో సుమారు 5.7 బిలియన్ల అంటే 500 కోట్ల మంది సంవత్సరానికి ఒక నెల పాటు నీటి కొరత ఎదుర్కొన నున్నారని అంచనా. మంచి నీటి సరఫరా, పారిశుధ్యం సక్రమంగా ఉంటే ప్రతి యేటా 3,60,000 వేల మంది శిశువుల ప్రాణాలను కాపాడుకోవచ్చు. గ్లోబల్ వార్మింగ్‌ను పూర్వస్థాయి కంటే 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేస్తే వాతావరణ ప్రేరిత నీటి ఒత్తిడిని 50 శాతం వరకు తగ్గించవచ్చు. గత దశాబ్దంలో 90 శాతానికి పైగా విపత్తులు తీవ్ర వాతావరణ పరిస్థితుల కారణంగానే తలెత్తాయి. 2040 నాటికి ప్రపంచ వ్యాప్తంగా ఇంధన డిమాండ్ 25 శాతానికి, నీటి డిమాండ్ 50 శాతానికి పైగా పెరగనుందని అంచనా. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా అందరికీ నీరు, పారిశుధ్యం కల్పించాలని ఐరాస లక్ష్యంగా పెట్టుకుంది. 2018-2028 దశాబ్దాన్ని 'వాటర్ ఫర్ సస్టైనెబుల్ డెవలప్‌మెంట్'గా ఐరాస జనరల్ అసెంబ్లీ ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాఠశాలలో సగానికంటే ఎక్కువ స్కూళ్లలో విద్యార్థులకు హ్యాండ్ వాషింగ్ సౌకర్యాలు లేవు. కనీసం చేతులు కడుక్కోవడానికి నీరు, సబ్బు కూడా అందుబాటులో లేని స్కూళ్లు కూడా చాలా ఉన్నాయి. అపరిశుభ్రమైన నీరు తాగి ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 2,97,000 మంది అంటే సుమారు రోజుకు 800 మంది పిల్లలు అతిసారం బారిన పడి చనిపోతున్నారు. ఈ కారణాల చేత ప్రతి ఒక్కరూ నీటి ఆవశ్యకతను గుర్తించి వాననీటిని ఒడిసి పట్టడమే కాకుండా,నీటినిజాగ్రత్తగా వాడుకునే విధంగా వ్యవహరించాలి.

# మద్దతు ధరల మర్మం !

కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన సాగుచట్టాలను రద్దు చేసినా..రైతులకు ఇచ్చిన హామీలను



అమలు చేయడం లేదు. వ్యవసాయాన్ని ఆదాయం వచ్చేలా తీర్చిదిద్దుతామన్న హామీ మేరకు నిర్ణయాలు తీసుకోవడం లేదు. సాగుచట్టాలను రద్దు చేయాలని ఉద్యమిస్తే తప్ప ..ఆ ఉద్యమ ఉధృతికి తాళలేక చివరికి వాటిని ఉపసంహరించుకొంటున్నట్టు మోడీ ప్రకటించారు. ప్రధాని మోడీ దేశానికి క్షమాపణలు చెప్పుకొన్నారు. కానీ ఏడాదిపాటు రైతులు ఉద్యమించడం వల్ల ఎందరో బలయ్యారు. ఈనిపై కించిత్తు కూడా విచారం వ్యక్తం కాలేదు. ఈ సందర్భంగా మొత్తం 23 పంటలకు మద్దతు ధరల హామీ ఇస్తూ చట్టాన్ని చేయాలన్న అన్నదాతల అసలు డిమాండ్ ఇంత వరకు నెరవేరలేదు. దీనిపై చర్చలు జరిపి చట్టాన్ని తెస్తామని ఇచ్చిన హామీని ప్రధాని మోడీ ప్రభుత్వం మరిచిపోయింది. ఇతర అన్ని సరకులకు, సామగ్రికి లాభసాటి ధరలను నిర్ణయించి అమ్ముకొనే స్వేచ్ఛ వాటి ఉత్పత్తిదారులకు వుండగా, ఒక్క వ్యవసాయ ఉత్పత్తుల విషయంలోనే రైతుకు అటువంటి స్వేచ్ఛ లేకపోడం దారుణం.అన్నదాతలు చేసుకున్న పాపామో ఏమో కానీ మద్దతు ధరల కోసం ఏటా ఎదురుచూపులే. అన్యాయంగా రైతుల శ్రమ మీద దళారులు బాగు పడుతున్నారు. పంటలు పండించిన రైతులు మాత్రం రోజురోజుకీ కుంగిపోతున్నారు. ఈ దుస్థితి తొలగా లంటే స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసిన విధంగా అసలు ఖర్చుకి రైతు ఇంటిల్లిపాది చేసే శ్రమ విలువ ను కూడా చేర్చి ఆ మొత్తానికి ఒకటిన్నర రెట్లు మద్దతు ధరగా నిర్ణయించవలసి వుంది. రైతు కోసం ఏదైనా చేస్తామంటారు గాని, స్వామినాథన్ కమిషన్ సిఫారసు యధాతథంగా ఇంత వరకు అమలు చేయలేక పోతున్నారు. బహుళజాతి కంపెనీలకూ ఎర్రతివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. నిజానికి కంపెనీలకు మించిన ఆదాయాన్ని, ఉద్యోగ కల్పనను వ్యవసాయరంగమే కల్పిస్తోంది. వ్యవసాయానికి పెద్దపీట వేసివుంటే ఈ రంగం దేశ ఆర్థిక పురోగతిలో కీలకం అయ్యేది. అనేక కంపెనీలకు ఇస్తున్న రాయితీల మాదిరి వ్యవసాయా నికి కూడా రాయితీలు ఇచ్చి పంటల ఉత్పత్తిని సవాల్‌గా తీసుకోవాలి.. సేంద్రియ వ్యవసాయానికి చేయూతను ఇవ్వాలి. అలాగే దేశంలో ఉన్న వ్యవసాయభూముల్లో ఎక్కడెక్కడ ఏ పంట పండుతుందో తెలుసు కనుక అందుకు అనుగుణంగా పంటల విధానం తీసుకుని రావాలి. అయితే రైతులను ఓటు బ్యాంకుగా చూడడం అలవాటు చేసుకున్న పాలకులు వారిని దేశంలో ఆర్థికరంగంలో కీలకమైన వ్యక్తులుగా చూడడం లేదు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టి యువతను ప్రోత్సహించడం ద్వారా నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టవచ్చు. కానీ అలా జరగడం లేదు. సస్యవిప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకోవాల్సిన తరుణంలో వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. దేశీయంగా వ్యవసాయ పురోభివృద్ధికి పాటుపడడం లేదని వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అలా చేయడం వల్ల వ్యవసాయం రంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారగలదని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే మంచిదని అంటున్నారు. అయితే అలాంటిదేమీ లేకపోగా కంటితుడుపు చర్యలతో కాలం నెట్టు కొస్తున్నారు. ఇటీవల చెరకు మద్దతు ధరలను పెంచారు. చెరకు ధరను రూ. 10 పెంచి క్వింటాలు రూ. 315కి చేర్చింది. యూరియా సబ్సిడీని కొనసాగించాలని నిర్ణయించింది. సేంద్రియ ఎరువుల ఉత్పత్తిని ప్రోత్సహిం చడానికి ప్రత్యేక పథకాన్ని అమలు చేయదలచింది. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయాలను తీసుకొన్నది. 2024 ఏప్రిల్‌లో వచ్చే చెరకు పంటకు ఈ కొత్త ధర వర్తిస్తుంది. వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో వుంచుకొని ఈ నిర్ణయాలు తీసుకొన్నట్టు బోధపడుతున్నది. చెరకు అత్యధికంగా పండించే రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో వుండగా, రెండో స్థానంలో మహారాష్ట్ర, మూడో స్థానంలో కర్ణాటక వున్నాయి. ఇక్కడ రైతులను మచ్చిక చేసుకునేందుకే ఈ పెంపు ప్రతిపాదన అన్నది వేరుగా చెప్ప నక్కర్లేదు. అయితే స్వాతంత్య వజ్రోత్సవాల బహుమతిగా 2022 23 ఆర్థిక సంవత్సరంలోనే దేశంలోని రైతుల అందరి ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని ప్రధాని మోడీ చేసిన వాగ్దానం మరచిపోయారు. సంస్థాగత రుణాలు అందుబాటులో లేక, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దయాదాక్షిణ్యాల మీద ఆధార పడుతున్నందున రైతులు సాగు మీద సంపాదిస్తున్న దానికి, తీర్చవలసిన అప్పుకి లంకె కుదరడం లేదు. వ్యవసాయ ఆదాయానికి మించి అప్పులు పేరుకుపోడంతో వున్న ఎకరా, అర ఎకరా భూమిని అమ్ముకొని కౌలు రైతులుగానో, వ్యవసాయ కార్మికులుగానో మారిపోతున్న రైతులు దేశంలో ఎంతో మంది వున్నారు. ఆడపిల్ల పెళ్ళి చేయలేక ఉరి తాడును ఆశ్రయిస్తున్న వారున్నారు. రైతులకు ఇంత చేశాం, అంత చేశాం అని చెప్పుకొనే కేంద్ర ప్రభుత్వం 2020 ఆగస్టు నుంచి 2021 డిసెంబర్ వరకు దాదాపు ఏడాదిన్నర కాలం ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన చరిత్రాత్మకమైన రైతు ఉద్యమం వల్ల రైతులకు గట్టిగా చేసిందేమీ లేదు. మూడు నల్ల చట్టాలను వారి ముందు ఉరి తాళ్ళ మాదిరిగా వేలాడ దీసి రెచ్చగొట్టి ఉద్యమంలోకి లాగిన తీరును దేశం ఇంకా మరచిపోలేదు. ఈ క్రమంలో మద్దతు ధరలు మరింతగా పెరగాలి. వ్యయసాయానికి ప్రధాన్యం ఇవ్వాలి. వారికి కావాలసిన వసతులను సమకూర్చి దేశంలో దీనిని అగ్రగామిగా నిలబెట్టాలి. అంతేకా కుండా... ఆదాయవనరుగా తీర్చిదిద్ది నిరుద్యోగాన్ని నిర్మూలించేలా చేయాలి. వ్యవసాయ అనుబంధ రంగాలను మరింతగా ప్రోత్సహించాలి. అప్పుడే వ్యవసాయం బతికిబట్ట కలదు. తాజాగా చెరుకుకే కాకుండా మిగతా పంటలకు కూడా మద్దతు ధరలను పెంచాలి.



# ఇలాంటి అవకాశాలు ఒక్కసారే వస్తాయి : తమన్నా

మిల్కీ బ్యూటీ తమన్నా ఒకానొక సమయంలో టాలీవుడ్‌ను ఏలింది. వరుసగా సినిమాలు చేసి మంచి క్రేజ్ తెచ్చుకుంది ఈ అమ్మడు. తెలుగులో దాదాపు స్టార్ హీరోలందరి సరసన సినిమాలు చేసింది. శ్రీ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఈ చిన్నది.. హ్యాపీడేస్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ సినిమా తర్వాత తెలుగులో బిజీగా మారిపోయింది. తమన్నా ప్రస్తుతం తెలుగులో సినిమాలు తగ్గించింది. హిందీ మీద ఎక్కువ ఫోకస్ పెట్టింది ఈ చిన్నది. తెలుగులో చివరిగా చిరంజీవి హీరోగా నటించిన భోళాశంకర్ సినిమాలో చేసింది. ఈ సినిమా డిజాస్టర్ గా నిలిచింది. ఇదిలా ఉంటే తమన్నా త్వరలోనే పెళ్లి పీటలెక్కనుందని వార్తలు వినిపిస్తున్నాయి. బాలీవుడ్ నటుడు విజయ్ వర్మతో రిలేషన్ లో ఉంది ఈ బ్యూటీ. ఇటీవల స్పెషల్ సాంగ్స్ లోనూ నటిస్తూ ఆకట్టుకుంటుందో. రీసెంట్ గా విడుదలైన 'స్త్రీ 2' చిత్రంలో తమన్నా స్పెషల్ సాంగ్ సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఓ వైపు సినిమాలు ,ఆరో వైపు స్పెషల్ సాంగ్స్ చేస్తూ ఆకట్టుకుంటుంది ఈ అమ్మడు. ప్రస్తుతం తెలుగులో ఓదెల అనే సినిమా చేస్తుంది. తాజాగా తమన్నా చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. జీవితంలో ఒక్కసారే ఇలాంటి సినిమాల్లో నటించే అవకాశం వస్తుంది.



# ప్రశాంత్‌నీల్ డైరెక్షన్‌లో ఊర్వశీ రౌతేలా ప్రత్యేక పాత్ర

## మొన్న బాబాయ్.. నేడు అబ్బాయ్‌తో నటన

గత కొద్ది రోజులుగా బాలీవుడ్ భామ ఊర్వశీ రౌతేలా పేరు మీడియాలో మారు మ్రోగిపోతోంది. నిజానికి ఊర్వశీ రౌతేలా టాలీవుడ్ లోకి 2023లో అడుగు పెట్టిన ఏడాదే 'వాల్తేర్ వీరయ్య'తో పాటు 'ఏజెంట్', 'బ్రో' , 'స్కంద' మూవీస్ లో స్పెషల్ సాంగ్ లో నర్తించి భారీ ఎత్తున సందడి చేసేసింది. అయితే అప్పటికే ఆమె 'బ్లాక్ రోజ్' అనే ద్విభాషా చిత్రం (తెలుగు, హిందీ)లో హీరోయిన్ గా నటించింది కానీ అదింకా విడుదలకు నోచుకోలేదు. ఇక బాలకృష్ణ సరసన ఏ ముహూర్తాన ఊర్వశీ రౌతేలా 'డాకు మహారాజ్'లో నటించిందో కానీ ఆమె ప్రతి కదలిక అందరి దృష్టినీ విశేషంగా ఆకర్షించింది. ఆమెతో కలిసి బాలకృష్ణ వేసి స్టెప్పులు సోషల్ మీడియాలో పాజిటివ్ గానూ నెగెటివ్ గానూ కూడా వైరల్ అయ్యాయి. దానికి తోడు ఇటీవల ఈ సినిమా నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ కాగానే... ఆమె సన్నివేశాలను, పాటను తొలగించారనే ప్రచారం జరిగిపోయింది. కానీ అందులో నిజం లేదని తెలిసింది. అయితే... ఓటీటీలో వివిధ భాషల్లో స్ట్రీమింగ్ కాగానే ప్రేక్షకులు బ్రహ్మ రథం పట్టేస్తున్నారు. ఇది చాలదన్నట్టుగా ఇప్పుడు ఈ అందాల ముద్దుగుమ్మ జూనియర్ ఎన్టీఆర్- ప్రశాంత్ నీల్ మూవీలోనూ ఓ కీలక పాత్ర పోషించబోతోందనే వార్త ఫిల్మ్ సర్కిల్స్ లో చక్కర్లు కొడుతోంది. ఇటీవలే ఈ సినిమా షూటింగ్ ను దర్శకుడు ప్రశాంత్ నీల్ మొదలెట్టాడు. అందులో ఊర్వశీ నటిస్తోందని, వచ్చే షెడ్యూల్ లో ఆమె జాయిన్ అవుతుందని అంటున్నారు. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో ఓల్ట్ కోల్ కతా బ్యాక్ డ్రాప్ లో కొన్ని సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ పీరియాడిక్ యాక్షన్ మాస్ మూవీలో ఎన్టీయార్ సరసన రుక్మిణీ వసంత్ నటిస్తోంది. అలానే మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. వచ్చే యేడాది జనవరి 9న రాబోతున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. విశేషం ఏమంటే... 'వాల్తేర్ వీరయ్య, డాకు మహారాజ్' తర్వాత ఊర్వశీ రౌతేలాకు ఇది మూడో సంక్రాంతి మూవీ అవుతుంది.



## బాలీవుడ్‌లో స్త్రీ పాత్రలకు తక్కువ ప్రాధాన్యత : కంగనా


డైరెక్టర్ అనురాజ్ బసు దర్శకత్వం వహించిన గ్యాంగ్ స్టర్ చిత్రంతో కంగనా బాలీవుడ్ తెరంగేట్రం చేసింది. ఇందులో ఆమె నటనకు ప్రసంసలు అందుకుంది. ఆ తర్వాత ఫ్యాషన్ సినిమాతో సూపర్ హిట్ ఖాతాలో వేసుకుంది. ఈ చిత్రానికి ఉత్తమ సహాయ నటిగా జాతీయ అవార్డు అందుకుంది. హిందీలో క్వీన్, మణికర్ణక, తను వెడ్స్ మను వంటి చిత్రాలతో స్టార్ డమ్ అందుకుంది. తెలుగులో ప్రభాస్ నటించిన ఏక్ నిరంజన్ చిత్రంలో నటించింది కంగనా. ఈ మూవీతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యింది. ఆమె నటించిన తను వెడ్స్ మను సినిమా రూ.100 కోట్లు దాటిన తొలి హీరోయిన్ సెంట్రిక్ సినిమాగా నిలిచింది. ఇప్పుడు రాజకీయాల్లోకి అడుగుపెట్టింది. ముక్కుసూటిగా మాట్లాడడంతో బాలీవుడ్ పెద్దలు ఆమెను దూరం పెట్టారు. ఆమెకు అవకాశాలు రాకుండా అడ్డుకున్నారు. దీంతో తనే నిర్మాతగా మారి సినిమాలను నిర్మిస్తుంది. ఇప్పుడు బీజేపీ పార్టీలో చేరింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో హిమాచల్ ప్రదేశ్ లోని మండి నుంచి ఆమె ఎంపిగా పోటీ చేసి ఘన విజయం సాధించింది. తాజాగా బాలీవుడ్ పై షాకింగ్ కామెంట్స్ చేసింది కంగనా. బాలీవుడ్ సినిమాల్లో వివాహబంధాన్ని తప్పుగా చూపిస్తున్నారని ఆమె అన్నారు. అంతే కాదు బాలీవుడ్ సినిమాల్లో స్త్రీల విలువను తగ్గించే సందర్భాలెన్నో చూశాను అని కంగనా సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

## రాజాసాబ్‌లో నా పాత్ర ఎంతో స్పెషల్

### ప్రభాష్‌కు నేను పెద్ద ఫ్యాన్

### మాళవిక మోహనన్

కొత్త పరిశ్రమ, కొత్త భాష అనగానే కాస్త కంగారు పడ్డా. అయితే.. నిదానంగా అలవాటు పడ్డా. కొత్త నగరంలో కొత్త సంస్కృతిని ఆకళింపు చేసుకున్నా. ముఖ్యంగా తెలుగు భాషపై ఇష్టం, ఆసక్తి రెండూ పెరిగాయి. ఆ పదాలు పలికే విధానం, శబ్దం నాకు నచ్చాయి.' అంటున్నది కేరళ కుట్టి మాళవిక మోహనన్. రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో ప్రభాస్ 'ది రాజాసాబ్' గురించి ఆమె మాట్లాడింది. అందులో తన పాత్ర గురించీ, అనుభవాల గురించి ఆసక్తికరంగా వెల్లడించింది. "ది రాజాసాబ్' హారర్ కామెడీ మూవీ. ఇప్పటివరకూ నేను చేయని జోనర్. చాలా సినిమాల్లో హీరో పాత్ర ఎదిగే కొద్దీ స్త్రీ పాత్ర తగ్గిపోతూవుంటుంది. కానీ 'ది రాజాసాబ్'లో అలాకాదు. ఇందులో ఆద్యంతం నా పాత్ర బలమైనదే. అద్భుతమైన సన్నివేశాల్లో నటించాను. 'బాహుబలి' నుంచి ప్రభాస్‌కి నేను పెద్ద ఫ్యాన్. ఆయనతో కలిసి పనిచేయాలని కలలు కన్నా. సెట్‌లో ఆయన్ను చూసి ఆశ్చర్యపోయా. అంతపెద్ద స్టార్ చాలా నార్మల్‌గా ఉంటారు. సపోర్టివ్ కూడా. ఆయన ఉన్న ప్రదేశాన్నంతా కంఫర్టబుల్‌గా మార్చేస్తారు. మనతో సరదాగా గడుపుతారు. సెట్‌లో ఉన్న టీమ్ మొత్తానికీ మంచి ఫుడ్‌ని పంపిస్తారు. దగ్గరుండి బిర్యాని తినిపిస్తారు..



Editer : Gunnala Anil Reddy, Address : Krushi Nagar, Sharelingampalli Mandalam, Ranga Reddy (Dist) Telangana Cell : 9705043131, 8096660656